10-07Pg1exHMNWJQEVK.qxd:10-07Pg1exHMNWJQEVK.qxd 01/01/01 8:20 AM Page 1

సాహితీ
గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 159 పేజీలు: 12 వెల: 6.50

భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!
9లో
కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?

# అడ్డంకులు సృష్టిస్తే సహించం

ప్రభుత్వ పథకాలకు అడ్డుపడేవారిపై కఠిన చర్యలు

వైఎస్సార్సీ కుట్రలపై విచారణ జరిపిస్తాం: సిఎం చంద్రబాబు

రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణ

స్పోర్ట్స్ అకాడెమీకి భూముల కేటాయింపు

క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

మోటార్ వెహికిల్ బిల్లులో పలు సవరణలు



బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు తదితరులు

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిళ్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ అడ్డుకోవడం క్షమించరాని విషయం అన్నారు. ఆ పార్టీకుట్రలపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. చేసిన తప్పులను ప్రత్యర్థులపైకి నెట్టేసే కుట్రలను వైఎస్సార్సీ అమలు చేస్తుందని విమర్శించారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ఈ విషయంలో మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు అధ్యక్షతన కేబినెట్‌భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎజెండాలో అంశాలతో పాటు పలు విషయాలపై ఆయన చర్చించారు. ప్రభుత్వ పథకాలకు అడ్డంకిగా ఉంటున్న శక్తులపై తగిన రీతిలో బదులు చెప్పాలన్నారు.ఇక 20 ఏజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా 50వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672 కోట్ల విడుదలకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. తద్వారా 31,000ల మంది రైతులకు బకాయిలు అందనున్నాయి. అన్నదాతలఖాతాల్లో 24 గంటల్లో బకాయిలు జమ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం పాత బకాయిలు రూ.1000 కోట్లలో రూ. 672 కోట్ల నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నగదును 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యతను పౌర సరఫరాల శాఖ మంత్రి >>2



బుధవారం నమీబియా అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' ను ప్రధాని మోడీకి అందజేస్తున్న అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌దైత్వా

## ప్రధాని మోడీకి నమీబియా అత్యున్నత పురస్కారం

**విండ్‌హాక్(నమీబియా), జూలై 9:** ఐదుదేశాల పర్యటనలోభాగంగా తన చిట్టచివరి పర్యటనగా నమీబియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీ ఆదేశ అత్యున్నత పురస్కారం అందుకున్నారు. 'ఆర్డర్ ఆఫ్‌ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' పురస్కారాన్ని ఆదేశ అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌దైత్వా ప్రధానిమోడీకి బుధవారం ఈ పురస్కారం అందచేసారు. నమీబియా రాజ్యాంగం దఖలుపరిచిన అధికారాల ఆధారంగా నమీబియా అత్యున్నత పురస్కారాన్ని విభిన్న రంగాల్లో విశిష్టసేవలందించిన భారతప్రధాని నరేంద్రమోడీకి అందచేస్తున్నందుకు ఎంతో గర్వంగా >>2

# నదుల అనుసంధానమే లక్ష్యం

## కృష్ణా డెల్టాకు వరప్రదాయిని పట్టిసీమ ఎత్తిపోతలు

## రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



బుధవారం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు హారతినిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** నదుల అనుసంధానం వలన వ్యవసాయరంగానికి ఎంతో ప్రయోజనం ఉందని ఎపి జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం అందుకు కీలక ఉదాహరణ అన్నారు. డెల్టా భూములకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో నదుల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు హారతి ఇచ్చారు. కృష్ణమ్మ చెంతకు గోదావరి జలాలు చేరిన చోట హారతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రతి ఏటా మూడు వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృధాగా సముద్రంలోకి పోయేదని ఆయన అన్నారు. ఆ నీరు వృధాగా పోకుండా సిఎం చంద్రబాబు పట్టిసీమ నిర్మాణం చేశారని గుర్తుచేశారు.

తాను 2014- 19 మధ్య ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు స్వయంగా ఆ పనులు తాను చూశానని నిమ్మల వెల్లడించారు. అసెంబ్లీలో ఆనాడు జగన్, పట్టిసీమను వట్టిసీమ అని హేళన చేశారని మండిపడ్డారు. ఇప్పుడు ఈ పట్టిసీమ ద్వారా 13 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. చంద్రబాబు ముందుచూపు ఎలా ఉంటుందో, పట్టిసీమ నీరు ఉపయోగిస్తుండడమే ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని స్పష్టం చేశారు. పట్టిసీమ కట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కృష్ణ డెల్టాకు 263 టీఎంసీల నీటిని ఇచ్చామని నిమ్మల వివరించారు.

ఇప్పటివరకు 50వేల కోట్ల రూపాయల సంపదను ఈ పట్టిసీమ ఇచ్చిందని మంత్రి తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క లిఫ్టుకు కూడా జగన్ ప్రభుత్వం మరమ్మతులు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి లిఫ్టులను మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి నిమ్మల వెల్లడించారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో షట్టర్లకు కనీసం గ్రీస్ కూడా పెట్టలేదని నిమ్మల ఆక్షేపించారు. గత ప్రభుత్వ పాపాలు మనకు శాపలుగామారాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌వద్ద రిపేర్ పనులకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ధవళేశ్వరం, శ్రీశైలం ప్రాజెక్టుల >>2

# డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

## నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు



బుధవారం నిర్మాణంలో ఉన్న క్వార్టర్లు పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, జులై9, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అమరావతిలో నిర్మాణంలోఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. రాజధాని అమరావతిలో పనులు ఊపందుకున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శాశ్వత సచివాలయం, హైకోర్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. గత నెలలో అమరావతికి వచ్చిన నిపుణుల బృందం ఐకానిక్ టవర్లు, శాశ్వత హైకోర్టుపునాదులను పరిశీలించింది. వారి సూచనల మేరకు ముందుకు సాగుతున్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల >>2

# మామిడి రైతులు రౌడీలా?

## తోతాపురి కేజీకి రూ.12 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్

## బంగారుపాళ్యం మార్కెట్ యార్డు మామిడి రైతుల పరామర్శలో మాజీ సిఎం జగన్



బుధవారం మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వానికి మామిడి రైతులు రౌడీల్లా కన్పిస్తున్నారా! మామిడిరైతులను పరామర్శించడానికి వస్తున్న తనవద్దకు రావడానికి మామిడి రైతులు ప్రయత్నిస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తారా! చిత్తూరు జిల్లాలో 500మంది మామిడి రైతులు మాత్రమేవున్నారా! చిత్తూరు జిల్లాలో 76 వేల మామిడి రైతులు వున్నారనే విషయం సైతం ప్రభుత్వం మరచిపోయిందని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేయడంతో పాటు మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మామిడి మార్కెట్ యార్డులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుటున్నాడన్నారు. చిత్తూరు జిల్లాలో మే మూడవ వారంలో పల్ప్ ఫ్యాక్టరీలు ప్రారంభించాల్సివుండగా జూన్ 3వ వారం నాటికి సైతం ప్రారంభించలేదన్నారు. పల్ప్ ఫ్యాక్టరీలపై ఒకేసారి ఒత్తిడి పెరగడంతో పల్ప్‌ఫ్యాక్టరీలు రైతులనుండి మామిడి కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం మామిడి రైతుకు కేజీకి రూ.12 చెల్లిస్తామని ప్రకటించిందని, ఇందులో ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం కేజీకి రూ.4 సబ్సిడీ ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు, ప్రభుత్వం ఎంత మంది రైతులకు కేజీకి రూ.12 చెల్లించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజు మామిడి రైతులు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు జీవితం సర్వనాశం అయ్యిందని, పంటలు సాగు చేసిన ప్రతి రైతు మద్దతు ధర కోసం రోడ్డెక్కి పోరాటం చేయాల్సి న పరిస్థితి ఏర్పడిందన్నారు. నిన్నటి వరకు ఫ్యాక్టరీలు మామిడి రైతుకు కేజీ తోతాపురి మామిడికి రూ.3, రూ.2.50 చెల్లించేవని, ఈ వేళ ఇక్కడికి తాను రావడంతో కేజీకి రూ.4 చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం మామిడి రైతు ప్రతి ఒక్కరికి కేజీకి రూ.12 వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

### - మంత్రి కె. పార్థసారథి

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఎపి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ హడ్కో నుంచి తీసుకున్న రుణాలకు గ్యారంటీ ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారధి వెల్లడిం >>2

# రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా మాధవ్ బాధ్యతల స్వీకరణ

## విజయవాడలో లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సెంటర్‌గా పిలవాలని పిలుపు



బిజెపి ఎపి అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవ్

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి ఎపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు పివిఎన్ మాధవ్ విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఎపి బిజెపి నూతన అధ్యక్షుడిగా మంత్రి సత్యకుమార్ యాదవ్,ఎంపీ పురందేశ్వరి తదితరుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాకంటే ముందు అధ్యక్షు లైనవారి శక్తియుక్తులతో ముందుకువెళ్తాను అన్నారు. ప్రతీ కార్యకర్త తానే అధ్యక్షుడ య్యానని అన్నంతగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పలుకుతూ ఒక నిర్ణయాన్నిచ్చారని పేర్కొన్నారు. బిజెపి ఇచ్చిన ఈ పదివిని గౌరవంగా భావించి పని చేస్తాను. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించాను. కవిసామ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణకు నివాళులు అర్పించాను. రాష్ట్రానికి శాసన భాషగా తెలుగు ఉండాలని అని ఒక శాసన నిఘంటువు తయారు చేసిన విశ్వనాథ సత్యనారాయణకు నివాళులర్పించాను అని పేర్కొన్నారు మాధవ్. అయితే ఎపి బిజెపి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి ముందు తుమ్మలపల్లి >>2

# నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

హాజరుకానున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

2 కోట్ల మంది టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే అవకాశం

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఒకే రోజున 2 కోట్ల మందితో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రభుత్వం నిర్వహించనుంది. విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు...ఇలా అందరినీ ఒక చోటుకు ప్రభుత్వం తీసుకొస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది రెండో కార్యక్రమం. రేపు పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉపాధ్యాయులతో సిఎం మాట్లాడనున్నారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, జూనియర్ కాలేజీలలో మెగా పిటిఎం 2.0ను ఒక ఉత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 74,96,228 మంది >>2

# కుప్పంలో ప్రతిగ్రామానికి ఇ-ఆటోలు

## ఎయిర్‌పోర్టు పనులు డిసెంబర్‌లో మొదలు

### 110కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణానికి చర్యలు: కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



**కుప్పం, జులై 9 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో దేశంలోనే తొలిసారిగా కుప్పంనియోజకవర్గంలో ప్రతి గ్రామానికి చెత్త సేకరణకై ఇ -ఆటోలు ఏర్పాటుచేస్తున్నట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడ ప్రాంత అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థచే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుప్పంలో ఎయిర్ పోర్టుకు భూసర్వే పూర్తయిందని త ్వరలోనే అవార్డు పాస్ (పరిహారం)చేస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో పనులు మొదలు పెడతామన్నారు.చిన్న చిన్న సమస్యలు ఉన ్న రైతులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

గతంలో ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన రైతులకు 13కోట్ల బకాయిలు ఉండగా వడ్డీతో కలిపి డబుల్‌గా 25 కోట్లు చెల్లించాలని సిఎం చంద్ర బాబు ఆదేశించారన్నారు. కుప్పం నియోజక వర్గంలో త్వరలోనే 110 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణ పనులకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే కుప్పంలో ఆరు పెద్ద పరిశ్రమలు వచ్చాయన్నారు. వీటిద్వారా 13వేల ఉద్యోగాలు ఖరారవుతాయన్నారు.

## సచివాలయ ప్రవేశ విధానంలో మార్పులు

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సచివాలయంలో భద్రతను ఎపి ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తోంది. ఆ క్రమంలో ప్రవేశద్వారాల వద్ద నూతన సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని పరికరాలూ వచ్చాయి. ప్రవేశద్వారాల వద్ద వాటిని అమరుస్తున్నారు. అది పూర్తికాగానే సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాత్రికేయులకు స్మార్ట్‌కార్డులు ఇవ్వనున్నారు. గుర్తింపు కార్డునకు అదనంగా ఇది ఉంటుంది. ప్లెయిన్‌గా ఉండే ఈ కార్డులోని చిప్‌లో మనకు సంబంధించిన అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. దీన్ని స్కాన్ చేయగానే...డేటాబేస్‌లో ఉన్న వివరాలతో సరిపోల్చుకొని ఆటోమేటిక్‌గా తలుపులు తెరుచుకుంటాయి. బెంగుళూరుకు చెందిన 'సత్యాలజీ'అనే సంస్థకు ప్రభుత్వం ఈ భాధ్యతలు అప్పగించింది. వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులుతెలిపారు. వాహనాల్లోవచ్చే ఉద్యోగులు, సిబ్బందికి రేడియో ఫ్రీకెన్సీ గుర్తింపు (ఆర్ఎఫ్ఐడీ)ను ఇస్తారు. ఈ ఆర్ఎఫ్‌డీ స్టిక్కర్‌ను వాహనం ముందు అతికిస్తారు. దాన్ని 'బూమ్ వారియర్' స్కాన్ చేస్తుంది. అనంతరమే గేట్లు తెరుచుకుంటాయి. ఫాస్ట్ ట్యాగ్ తరహాలో ఇది పని చేస్తుంది. ఇందుకు ఉద్యోగుల వాహనాల నెంబర్లను ఓ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నారు.



బుధవారం నమీబియాలోని విండ్‌హోక్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు

# నమీబియా అత్యున్నత పురస్కారం

>> ఉందని వ్యాఖ్యానించారు. నమీబియాలో శాంతి, సమన్యాయం స్థాపనకోసం సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం ప్రధాని మోడీ అవిరళ కృషిచేసారని ఆమె ఈసందర్భంగా పేర్కొన్నారు. కేవలం నమీబియాకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతిసామరస్యం కోసం విశేష కృషిచేసారన్నారు. ఈ పురస్కారంతో ప్రధానిమోడీ ప్రపంచ దేశాలనుంచి 27 అత్యున్నత పురస్కారాలను అందుకున్నట్లయింది. ప్రస్తుత పర్యటనలో ఇది నాలుగో పురస్కారం. 1995లో స్థాపించిన ఈపురస్కారాన్ని 1990లో నమీబియా స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి అమలులోకి తెచ్చారు. విశిష్టసేవలందించిన నమీబియాకోసం అందించిన సేవలు, నాయకత్వ లక్షణాలున్న ప్రముఖులు, విదేశీ ప్రముఖులకు ఈపురస్కారాన్ని అందజేస్తున్నారు. నమీబియాలో అత్యంత పేరున్న ప్రముఖ ఎడారిమొక్క వెల్‌విట్షియా మిరాబిలిస్ పేరుతో ఈ అవార్డును అందిస్తున్నారు. అంతకుముందు ప్రధానిమోడీ నమీబియా అధ్యక్షురాలు నెటుంబో నాండిఎన్‌డైత్వాతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణరంగం, భద్రత, వ్యవసాయం, హెల్త్‌కేర్, విద్యారంగం, సంక్లిష్ట ఖనిజ వనరులవంటి రంగాలలో సహకరించుకోవాలని నిర్ణయించారు. ప్రతినిధిబృందం స్థాయిలో ఇరువురునాయకులు భారత్ నమీబియా సంబంధాలను పునసమీక్షించారు. వాణిజ్యం, ఇంధనం, పెట్రోకెమికల్స్ రంగాల్లోపరస్పర సహకారంపైనా విస్తృత స్థాయిలో చర్చలు జరిపామన్నారు. ప్రాజెక్టుచీతాలో నమీబియా సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించిన ప్రధానిమోడీ ఆదేశ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అతిథిగృహంలో ఉభయులమధ్య చర్చలుజరిగిన తర్వాత నాలుగు ఒప్పందాలు జరిగాయి. హెల్త్, ఔషధాలు, నమీబియాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కేంద్రం ఏర్పాటు, సిడిఆర్ఐ ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ బయోఫ్యూయల్స్ ఫ్రేమ్‌వర్క్ విభాగాల్లో ఈఒప్పందాలు చేసుకున్నారు. నమీబియాలో భారత ప్రధానిహోదాలో నరేంద్రమోడీ పర్యటన ఇదే మొదటిసారికాగా ఈ ఆఫ్రికా దేశంలో మూడుసార్లు భారత ప్రధానులు పర్యటించినట్లయింది.

## రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాల

# ఏర్పాటుపై అడ్వోకేట్స్ కమిటీ!

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు అంశంపై ఏపీ హైకోర్టు సందేహాన్ని వ్యక్తం చేసింది. ఈ అంశంపై అడ్వోకేట్ కమిటీ వేస్తామని వెల్లడించారు. ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా విజయవాడ మూడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదికను హైకోర్టు ప్రస్తావించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఒక సీసీ కెమెరా మాత్రమే ఉన్నట్లు మెజిస్ట్రేట్ నివేదికలో పేర్కొన్నారని గుర్తుచేసింది. అయితే, స్టేషన్‌ను వ్యక్తిగతంగా తనిఖీ చేసి రాజా మొత్తం కవర్ అయ్యేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు విజయవాడ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సర్టిఫై చేస్తూ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. పరస్పర భిన్న నివేదికల నేపథ్యంలో ఎసీపీవేసిన సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని హైకోర్టు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లలో పర్యటించి ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? స్టేషన్ మొత్తం కనిపించేలా ఏర్పాటు చేశారాలేదా? తదితర అంశాలపై కమిటీ నుంచి నివేదిక కోరతామని పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదో వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎసజీపీ)ని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆ మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడుజిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గతేడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పోలీసు యంత్రాంగం ఏపీ హైకోర్టుకు వివరించింది. ఇందుకు సంబంధించి ఆయా డిఎస్‌పిలు రూపొందించిన నివేదికలు హైకోర్టుకు సమర్పించారు.

పోలీస్ స్టేషన్ లోపల, బయట కనబడేలా వాటిని ఏర్పాటు చేశామన్న నివేదికలపై హైకోర్టు సందేహాలను లేవనెత్తింది. సిసి కెమెరాల ఏర్పాటుపై వాస్తవాల నిర్ధారణ కోసం అడ్వకేట్స్ కమిటీ వేస్తామని స్పష్టం చేసింది. పోలీసులు ఇచ్చిన నివేదికను క్షేత్రస్థాయిలో పరిస్థితులకూ పొంతన లేదని వ్యాఖ్యానించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పిఎస్సే నిదర్శనమని చెప్పింది. వాలా పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు ఎందుకు చేయలేదో చెప్పాలంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అన్నీ కనిపించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ నివేదిక ఇచ్చారని, ఇక్కడికి వెళ్లిన మరో కేసులో సంబంధిత మెజిస్ట్రేట్ మాత్రం కేవలం ఒక్క సిసి కెమెరా ఉందని తమకు నివేదిక ఇచ్చారని చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు అన్ని పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ 2019లో వేసిన పిల్‌ను మంగళవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో 1,392 పోలీస్ స్టేషన్లు ఉంటే 1,001 స్టేషన్లలో మాత్రమే సిసి కెమెరాలు ఉన్నాయని పిటిషనర్ వాదన. లాకప్‌లున్న అన్ని పిఎస్‌లలో ఏర్పాటు చేశామని ప్రభుత్వ వాదన. లాకప్‌లు లేనిచోట కెమెరాలు పెట్టలేదని చెప్పింది.


# ముఖ్యమంత్రి పర్యటన సాగేది ఇలా..

**సత్యసాయి జిల్లా, జులై 09, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులో మెగా పేరెంట్ టీచర్ మీట్ (పిటిఎం) కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఇలా కొనసాగనుంది. అధికార వర్గాలు తెలియజేసిన మేరకు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి ఉదయం 8 గంటలకు ఉండవల్లి నుండి విజయవాడ ఎయిర్‌పోర్ట్ బయలుదేరి 8:10 కి చేరుకుంటారు. 8.15 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరి ఉదయం 9 గంటలకు శ్రీ సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. 9:10 గంటలకు ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరి 9:25 గంటలకు కొత్తచెరువులోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 9:30 గంటల నుండి 9:50 గంటల వరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఇష్టాగోష్టి నిర్వహిస్తారు. 9:55 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు మెగా పేరెంట్ టీచర్ మీట్ సభలో పాల్గొంటారు. ఒంటిగంటకు కొత్తచెరువులోని బాలుర జడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను సందర్శించి అక్కడినుండి పుట్టపర్తి ప్రశాంతి నిలయంకు 1:15 గంటలకు చేరుకుంటారు. 02:15 గంటల వరకు ప్రశాంతి నిలయంలో గడిపిన అనంతరం అక్కడి నుండి బయలుదేరి 02:25 గంటలకు శ్రీ సత్య సాయి విమానాశ్రయంకు చేరుకోనున్నారు. 02:35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 3:30 గంటలకు విజయవాడ విమానాశ్రయంకు బయలుదేరి వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

# డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

>> క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. ఈ డిసెంబర్ నాటికి అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అక్కడ జోరుగా పనులు సాగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. చట్టసభ సభ్యులకోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35 మంది మంత్రులు, 36 న్యాయమూర్తుల క్వార్టర్స్ మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ నివాస సముదాయాలు మంత్రుల క్వార్టర్స్‌తో పాటే ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్, ఆసుపత్రి, క్లబ్ హౌస్ వంటివి కూడా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ యూజెస్ వంటి అన్ని వసతులు ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, రాజ్ భవనన్‌లు కృష్ణా నది వెంబడి ఉంటాయన్నారు. అమరావతి నిర్మాణానికి మలివిడతలో మరో 34,964 ఎకరాల సేకరణకు సిఆర్‌డిఎ ఇప్పటికే ఆమోదం తెలిపింది. తొలివిడతలో ఇచ్చిన ప్యాకేజీనే దీనికీ వర్తించనుంది. అలాగే రాజధానిలో 58 ఎకరాల్లో పిపిఎవిధానంలో నివాస, మిశ్రమఅభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించారు.. మరికొన్ని సంస్థలకు సైతం భూకేటాయింపులు చేస్తూ ఆమోదం తెలిపారు.

మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళ సాధికార సభ్యుల సదస్సు ఉంటుందని శాసనసభపతి అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాతో ముచ్చటించారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న పార్లమెంట్ స్పీకర్ సూచన మేరకు దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపు 500 మంది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటారన్నారు.



బుధవారం మంత్రి లోకేష్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

# లోకేష్‌ను కలిసిన రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 9, ప్రభాత వార్త :** రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పివిఎన్ మాధవ్... మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్... మాధవ్‌ను మంగళగిరి శాలువాతో సత్కరించారు. ప్రతిపక్షంలో ఉండగా శాసనమండలిలో ప్రజాసమస్యలపై కలిసి పోరాడిన సందర్భాన్ని ఇద్దరు నేతలు నెమరు వేసుకున్నారు. మృదు స్వభావిగా పేరున్న మాధవ్‌కు రాష్ట్ర సమస్యలపై సంపూర్ణ మైన అవగాహన ఉంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని లోకేష్ అన్నారు.

# మాధవ్ బాధ్యతల స్వీకరణ

>> కళాక్షేత్రం వద్ద బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మాధవ్ అనంతరం ర్యాలీగా బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వెంట భారీ సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలివచ్చారు. ఇక, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పుష్ప మాల వేసి బాధ్యతలు స్వీకార కార్యక్రమానికి పివిఎన్ మాధవ్ బయలుదేరారు. అయితే ఈ సందర్భంగా పుస్తకప్రియులకు స్వర్గధామంగా ఉన్న విజయవాడలోని లెనిన్ సెంటర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. లెనిన్‌కి భారత దేశానికి ఎటువంటి సంబంధం లేదన్న ఆయన విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం చుట్టూ మంచి వాతావరణం నిర్మాణం చేయాలి. వారి పట్ల నిర్లక్ష్యం తగదు అన్నారు. ఇక మీదట ఇది లెనిన్ సెంటర్ కాదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సెంటర్‌గా పిలవాలిఅంటూ వ్యాఖ్యానించారు పివిఎన్ మాధవ్. ఇక సంస్థాగతంగా సభ్యత్వాలు ఎన్నికలు సంపూర్ణంగా జరిగాయి. బిజెపి ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయడం వల్ల 25 లక్షల సభ్యత్వం చేరుకున్నాం అన్నారు. బిజెపి ఎంపి పురందేశ్వరి బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం ఆధారంగా అన్నిస్థాయిలలో అధ్యక్షుల ఎన్నిక జరిగింది. జాతీయ కౌన్సిల్ మెంబర్ల నియామకం కూడా జరిగింది. మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట పటిమ కలిగిన వ్యక్తి ఎమర్జెన్సీలో కూడా చలపతిరావు దంపతులు జైలుకువెళ్లారు. సంస్థాగత అంశాలపట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి మాధవ్ అని పేర్కొన్నారు. కార్యకర్తలు అందరూ బిజెపి కుటుంబసభ్యులు రెండు సంవత్సరాల నా ప్రస్థానంలో నాకు సహకారం అందించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు పురందేశ్వరి. ఇక రాష్ట్ర కార్యకర్తలు అందరూ మాధవ్‌ని అధ్యక్షుడిగా స్వాగతిస్తున్నారు. మాధవ్ అధ్యక్షుడుగా ప్రకటన జరిగాక పాజిటివ్ వైబ్రేషన్స్ వచ్చాయి అన్నారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాష్ట్రంలో బిజెపిని మంచి స్థాయికి తీసుకెళ్లే పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో బలోపేతం అవ్వడమే ఎమ్మెల్సీ సోము వీర్రాజు బిజెపి ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

# వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

>> చారు. ఈ నిర్ణయంతో పాటుఅమరావతిలో వరల్డ్ ఎకానమీ ఫోరం నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. కుళాయి నీరు అందించేందుకు రూ.10 వేలకోట్ల రుణాల సమీకరణకు క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు ద్వారా రూ.4 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నాం. ఎపి స్పేస్ పాలసీ 2025-30కి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వైకాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌ట్యాక్స్‌ను దారుణంగా పెంచింది. దాన్ని రూ.3 వేల వరకు తగ్గించాం అని పార్థ సారథి తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ రేటును తగ్గిస్తూ, ఈ వాహనాలు చెల్లించే త్రైమాసిక పన్నుపై ఆధారపడటం కాకుండా కొత్త పన్ను రేట్లను రూ.1,500 మరియు రూ.3,000/ గా నిర్ధారించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది. కాలం చెల్లిన వాహనాల సంఖ్యను తగ్గించడానికి గ్రీన్ ట్యాక్స్ పెంచే అవకాశం కేంద్రంఇవ్వగా గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను భారీగా పెంచింది. గతంలో ఏడేళ్లు దాటిన సరకు, ప్రజా రవాణా వాహనాలకు ఏడాదికి రూ.200 ఫీజు ఉండేది. కానీ గత ప్రభుత్వం దానిని మార్చి ఎక్కువ పన్నులు వేసింది. 7-10 ఏళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను, 10-12 ఏళ్ల వాహనాలకు ఒక త్రైమాసిక పన్ను, 12 ఏళ్లు దాటిన వాహనాలకు రెండు త్రైమాసికాల పన్నులు వసూలు చేసే విధానాన్ని 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. దీనివల్ల వాహనదారులపై చాలా భారం పడింది. లారీ యజమానులు చాలా ఇబ్బంది పడ్డారు. గత విధానంలో ఏడాదికి రూ.20 వేల వరకు ఉన్న పన్నును ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.3 వేలకు తగ్గించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది.

# నదుల అనుసంధానమే లక్ష్యం

>> మరమ్మతులకు రూ. 350 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. శ్రీశైలం ప్రాజెక్టు జాతి సంపద అని, మనం దాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలకు తెచ్చామని వ్యాఖ్యానించారు. నీళ్లు పారించాలని చంద్రబాబు అనుకుంటూ ఉంటే, జగన్ రప్పరప్ప అంటూ రక్తం పారించాలనుకుంటున్నారని నిమ్మల దుయ్యబట్టారు. మహిళలను కించపరిచే సంస్కృతి వైఎస్సార్సీ అధినాయకత్వం నుంచి ఉందని మండిపడ్డారు. ఆరోజు చెల్లిని తల్లిని జగన్ అవమానించారని, ఇవాళ కూడా ఆ పార్టీ అదే తీరులో ఉందని దుయ్యబట్టారు. పట్టిసీమ నిర్మాణమైన రోజు నుంచి ఇప్పటి వరకూ గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టాకు ఉపయోగించుకుంటున్నామన్నారు. రాయలసీమకు సంబంధించిన ఏ రిజర్వాయర్‌ను చూసినా 90 నుంచి 95 శాతం నీటి సామర్థ్యంతో నిల్వ చేయగలిగాం. దీనికి ప్రధానంగా సీఎం చంద్రబాబు ముందుచూపు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అప్పట్లో కేవలం రూ.1300 కోట్లతో పట్టిసీమను నిర్మిస్తే ఇప్పుడు దాని ద్వారా రూ.50,000 వేల కోట్ల సంపదను సృష్టించిందంటే ఇది కృష్ణాడెల్టాకు వరప్రదాయినిగా భావించవచ్చునన్నారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన క్వాంటమ్ వ్యాలీకి భూమి

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాజధాని అమరావతిలో స్థల సేకరణ దిశలో కార్యచరణను చేపట్టారు. రూ.4వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ కోసం ఉద్దండరాయునిపాలెం,లింగాయపాలెం మధ్య సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. ఈ స్థలంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. ఈ-3 రోడ్డు,ఎన్-10 రోడ్డు అనుసంధానమయ్యే ప్రాంతంలో ప్రాజెక్టు రానుంది. క్వాంటమ్ వ్యాలీ లోని ఐకానిక్ భవనం కోసం డిజైన్లు తయారవుతున్నాయి. సిద్ధమైన వాటిలో సిఎం చంద్రబాబు పలుమార్పులు సూచించారు. దీంతో నమూనాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఖరారైనతర్వాత టెండర్లు పిల్చి కాంట్రాక్టరును ఎంపిక చేయనున్నారు. వచ్చే జనవరి నాటికి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో అందుబాటులోకి తీసుకుని రావాలని ఎపి ప్రభుత్వం భావిస్తోంది.,అనుకున్న సమయానికి వ్యాలీని పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహన్ రావు అరెస్టు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** గత మార్చిలో జరిగిన ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (ఎస్ఆర్‌హెచ్)ను టికెట్ల విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘటనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఇతర సభ్యులను సిఐడి అధికారులు బుధవారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అప్పట్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలకు సంబంధించి కీలక పత్రాలను కూడా సిఐడి జప్తు చేసింది. అనంతరం అరెస్ట యిన వారిని లక్‌డికాపూల్‌లోని సిఐడి కార్యాలయానికి తరలించి అక్కడ ప్రశ్నిస్తున్నారు.

బిసిసిఐ పరిధిలో దేశ వ్యాప్తంగా వున్న రాష్ట్రస్థాయి క్రికెట్ సంఘాలలో తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొంటున్న హెచ్‌సిఎ మరోమారు వార్తల్లో నిలిచింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఆయన సహచర సభ్యులను సిఐడి అరెస్టు చేయడం సంచలనం రేపింది. ఈ ఏడాది ముగిసిన ఐపిఎల్ సీజన్‌లో హైదరాబాద్ ఫ్రాంఛేజి అధిపతి ఎస్ఆర్‌హెచ్‌కు ఉప్పల్ స్టేడియం వాడుకునేందుకు హెచ్‌సిఎ అనుమతి ఇచ్చింది.

# నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

>> విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు ఈ వేడుకలో పాల్గొనున్నారు. మొత్తంగా 2.28 కోట్ల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ మెగా పేరెంట్ టీచర్ సమావేశం సరికొత్త రికార్డు సృష్టించనుంది. ఇక ప్రతీ ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశాన్ని పిటిఎం పేరిట ప్రభుత్వం నిర్వహించనుంది. కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పేరెంట్ టీచర్ మీటింగ్స్‌ను ప్రభుత్వ అధీనంలో నడిచే పాఠశాలలో నిర్వహించాలని మంత్రి నారా లోకేష్ సంకల్పించారు. ఈ మేరకు వరుసగా రెండో ఏడాదికూడా పండుగవాతావరణంలో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

**తల్లిదండ్రులకు పురోగతి కార్డుల అందజేత**

తమ పిల్లలు చదువులో ఎంత పురోగతి సాధిస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది, సామాజిక సమస్యలపై అవగాహన చేసుకుంటున్నారా అనే అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది. అంతేకాదు...విద్యార్థుల చదువులకు సంబందించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించనుంది.

తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను, సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకోవచ్చు. పాఠశాల విద్యలో పనితీరు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై చర్చించుకునే సదావకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది.

# అడ్డంకులు సృష్టిస్తే సహించం

>> నాదెండ్ల మనోహర్‌కి ప్రభుత్వం అప్పగించింది. ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672కోట్లు విడుదలకు మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 32 వేల మంది రైతులకు ఈ నిధులు మంజూరు ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పెండింగ్ బకాయిలు జమ చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించింది. ఆ క్రమంలో మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ జులై 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది .ఈ నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టనున్నారని మంత్రి సమావేశంలో వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ చూస్తుందని కేబినెట్‌లో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఎపిఎండీసీ బాండ్లల్లో పెట్టుబడులు పెట్టవద్దని ఈ మెయిళ్లు పెట్టారని తెలిపారు. 200 కంపెనీలకు తప్పుడు ఈ మెయిళ్లు పెట్టారని సిఎం చంద్రబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. వైఎస్సార్సీనే తమ పార్టీ సానుభూతిపరుడితో ఈ మెయిళ్లు పెట్టించిందని చెప్పారు. అదేవిధంగా అమరావతికి నిధులు రాకుండా తప్పుడు ఫిర్యాదులు చేసిందని, ఈ మెయిళ్ల అంశాన్ని కూడా తీవ్రంగా పరిగణించాలని మంత్రులు సిఎంకు తెలియజేశారు. ఈ క్రమంలో వీటిపై చంద్రబాబు స్పందించారు. ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిళ్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం.13 గ్రామాల పరిధిలో ఈ భూ సమీకరణ,అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను కృష్ణానది నుండి డ్రెడ్జింగ్,సిబిఐ,జడ్ఎస్ఐ భూములు కేటాయించే అంశాలపై చర్చించారు. స్పోర్ట్స్ అకాడమీకి భూముల కేటాయింపుపై చర్చ జరిగింది. జలవనరుల శాఖలో 71 పనులకు ఆమోదం తెలపనున్నారు. జలవనరుల శాఖలో వివిధ మీడియం ప్రాజెక్టుల మరమ్మత్తులకు నిధులపై చర్చించారు. ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై కేబినేట్‌లో చర్చ జరిగింది. ఎపి మోటార్ వెహికల్ బిల్లులో పలు చట్ట సవరణలు, పరిశ్రమలు, కార్మిక బిల్లులో పలు చట్ట సవరణలు చేసే అంశంపై చర్చించారు. అమరావతి పరిధిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అమరావతి పరిధిలో భూమి లేని 1,575 పేద కుటుంబాలకు పింఛన్ కొనసాగింపుపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ కొనసాగించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సమావేశంలో అభివృద్ధి పథకాలకు అడ్డంకులు సృష్టించాలనుకుంటున్న వైకాంగ్రెస్‌పార్టీకి తీవ్ర స్థాయిలో గుణపాఠం చెప్పాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఇంటింటికి మంచి నీటిని అందించే దిశలో ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై ఆయన సమావేశంలో ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు ఇదే సమావేశంలో కొందరు మంత్రులు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్‌కు (ఇప్పటికే పొందిన రూ.6700.00 కోట్ల రుణంతో పాటు) రూ.1000.00 కోట్ల అదనపు రుణాన్ని మంజూరు చేయడానికి, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుండి క్రెడిట్ పొందేందుకై ప్రభుత్వ హామీని పొడిగిస్తూ మరియు 2024- 25 రబీ కార్యకలాపాల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను (పెండింగ్‌లో ఉన్న రైతు బకాయిల కోసం) తీర్చడానికి మరియు వాటా మూలధనాన్ని 10 కోట్ల నుండి 20 కోట్లకు పెంచడానికి ఇంటర్‌కార్పొరేట్ లోన్‌గా విజయవాడలోని స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి జీవో నెంబరు.25, వ్యవసాయ కోఆపరేటివ్ విభాగం, ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులను ఆమోదించడానికి వ్యవసాయ,సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

కోకో రైతులకు సరసమైన ప్రోత్సాహక ధరలను అందించడానికి, వారి ఆర్థిక ప్రగతికి మద్దత్తునివ్వడానికి, రాష్ట్రంలో కోకో సాగును స్థిరీకరించేందుకు మరియు నష్టాలతో అమ్ముకోకుండా రైతులను రక్షించడానికి ప్రభుత్వ మద్దతు ధరగా కిలోకు రూ. 50/ చొప్పున రూ. 14.884 కోట్లు మంజూరు చేయడానికి మరియు ప్రస్తుత సీజన్‌లో నిర్దేశించిన అమ్ముడుపోని 2976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజలను ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో సేకరించేందుకు వ్యవసాయ మరియు సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

## వారం - వర్జ్యం

10-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు
పౌర్ణమి రా.2.05
పూర్వాషాఢ పూర్తి
వర్జ్యం : మ.2.52-4.33
దు.ఉ.10.03-10.55, 2) మ.3.16-4.08
శుభసమయం:ఉ.6.15-7.00, సా.6.10-7.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల సహాయంతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తిచేస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**వృషభం:** ఆస్తి వ్యవహారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి. వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**కర్కాటకం :** జీవిత భాగస్వామి సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్తులాభాలు.

**సింహం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు. ఆస్తి వ్యవహారాలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి.

**కన్య :** కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృశ్చికం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మకరం:** కొత్త కార్యక్రమాలకు, వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మీనం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

3rdpage main.qxd:10-07Pg3exHMNWJQERTKL.qxd 01/01/01 9:02 AM Page 1



# తిరుమల సమాచారం

## టిటిడి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

### - బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు,భక్తులు ఇచ్చిన భూములు తెలంగాణాలో కూడా ఉన్నాయని, భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన చీఫ్: రామచంద్రరావు తెలిపారు. ఖమ్మంలో కూడా టిటిడి స్థలాలు ఉన్నాయని, అక్కడ అన్యమతస్తులు కొందరు రాజకీయ అండతో వాటిని కబ్జాచేసుకుని గోడను కూలగొట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. దేవుని స్థలాలను వాణిజ్యకార్యకలాపాలకు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆక్రమణలు ఆపాలని, టిటిడి భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు బిజెపి తరపున ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతానన్నారు. బిజెపి తెలంగాణ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం ఉదయం అనురులతో కలసి తిరుమలకు చేరుకున్న రామచంద్రరావుకు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు రంగనాయకులు మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ బిజెపి చీఫ్‌గా శ్రీవారి దర్శనం చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

## హోటళ్ల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత ప్రధానం

### - టెండర్‌ప్రాసెస్‌పై యజమానులకు అవగాహన



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం తిరుమలకు వస్తున్న భక్తుల అవసరాలకు తగ్గట్లు సాంప్రదాయమైన ఆహారపదార్థాలను అందించేందుకు టిటిడి తాజాగా జనతా,పెద్ద హోటళ్ళకు టెండర్లు ఖరారుచేస్తోంది. ఈ టెండర్లలో వ్యాపారులు పాల్గొని నిర్వహణకు ముందు హోటళ్ళ నిర్వాహకులతో బుధవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు జనతా,పెద్ద హోటళ్ళు, క్యాంటీన్లలో నాణ్యమైన రుచికరమైన సాంప్రదాయ ఆహారపదార్థాలను అందించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులకు సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహారపదార్థాలు, లాభాపేక్ష లేకుండా పరిశుభ్రతతో నిర్ధేశించిన ధరలకు అందించాలని ఇఒ తెలిపారు. గతనెల 23న జారీచేసిన నోటిఫికేషన్ మేరకు సదరు ఈఐఒ సంబంధించిన సందేహాలపై గుర్తింపు ఉన్న హోటళ్ళ నిర్వాహకులు తమ ఆసక్తిని వ్యక్తం చేసేందుకు ప్రీ బిడ్ సమావేశమయ్యారు. నిర్థారించిన నియమాలకు లోబడి హోటళ్ళు, క్యాంటీన్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పెద్దహోటళ్ళ నిర్వాహకులు, టిటిడి అదనపు ఎఫ్ఎఒ రవిప్రసాదు, తిరుమల ఎస్టేట్ అధికారి కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వానరాల నుండి భక్తులకు రక్షణ

### - స్మార్ట్‌స్టిక్స్‌తో ఆలయ పరిసరాల్లో నిఘా



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో వానరాలు(కోతులు)బెడద తీవ్రమైంది. అటవీప్రాంతంలో ఉండే వానరాలు ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. గత వారంరోజులుగా తిరుమల ఆలయం పరిసరాల్లో మాఢవీధుల్లో కూడా వానరాలు సంచారం పెరిగింది. కాటేజీలు,అతిధిగృహాలు, ప్రముఖులు బసచేసే ప్రాంతాల్లోనూ వీటి సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తుల చేతుల్లో సంచులను లాగేయడం, ప్రసాదాలను లాక్కెళ్లడం చేస్తున్నాయి. దీంతో టిటిడి ఈ వానరాలను పట్టుకోవడం, లేదా దూరంగా తరిమేయడం చేసేందుకు టిటిడి అటవీశాఖను ఆదేశించింది. టిటిడి డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు వానరాల బెడదను తప్పించేందుకు బ్యాటరీతో పనిచేసే స్మార్ట్‌స్టిక్స్ తెప్పించారు. ఈ స్టిక్స్‌కు పైభాగంలో ఫోకస్‌లైటింగ్ అమర్చారు. ఎక్కడైనా వానరాలు ఉంటే వాటిని తరిమేయడానికి ఈ స్టిక్‌క్రింద ఉన్న బటన్ నొక్కితే లైట్ వెలిగి ఆ కాంతికి వానరాలు పరారవుతాయి. వీటిని ప్రస్తుతం రెండు తెప్పించారు. అవసరమైన ప్రాంతాల్లో ఈ రెండింటిని అటవీశాఖ సిబ్బంది వినియోగిస్తారు.

## వెంకటేశ్వరస్వామి దర్శనంతో అనుభూతి

### - శ్రీవారి సేవలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** భగంతుని నామస్మరణతో ప్రజలు భక్తిభావంతో మెలిగినపుడే ఆ దేవుని దర్శనం అనుభూతి కలుగుతుందని తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీరామ్ విశ్వాసం వెలిబుచ్చారు. కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని అన్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్ కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


## కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం: ఎమ్మెల్యే సిఎం రమేశ్



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఏడాది పాలనలో అమలుచేస్తోందని, విజయవంతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని బిజెపి ఎమ్మెల్యే సిఎం రమేశ్ తెలిపారు. క్రమక్రమంగా హామీలు అమలుచేసుకుంటూ వాగ్దానాలను నిలబెట్టుకుంటోందన్నారు. కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు, సాఫ్ట్‌వేర్ సంస్థలు వస్తున్నాయన్నారు. పురోబివృద్ధిని కూటమి ప్రభుత్వం సాధిస్తుందన్నారు. కృష్ణగోదావరి నదులు నీటితో పుష్కలంగా నిండాయని, రైతులకు ఎటువంటి నీటిసమస్యలేకుండా దేవదేవుడు కరుణించాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులతో కలసి బుధవారం ఎమ్మెల్యే సిఎంరమేశ్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్థానికత ఉన్న హోంగార్డులను రాష్ట్రానికి రప్పించండి

### - సిఎం చంద్రబాబుకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



హోంగార్డులు, విదేశీ వైద్యా గ్రాడ్యుయేట్లు సమస్యలపై సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ కె.రామకృష్ణ

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** హోంగార్డుల వేతనాల పెంపు, విదేశీ వైద్య విద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ప్రభుత్వాన్ని కోరింది. సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఈ సమస్యలున్నాయని ప్రభుత్వానికి తెలిపింది. సీపీఐ రాష్ట్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనను అనుసరించి ఈ అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. వైద్యవిద్యలో విదేశాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏపీకి చెందిన విద్యార్థులకు ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్ నిరాకరిస్తోందని ఈ నిబంధనను సవరించేలా చూడాలని ఆయన ముఖ్యమంత్రికి విన్నవించారు. వైద్య నిపుణుల కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో ఏపీఎంసీ నిబంధనల్ని మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణా, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే నిబంధనల్ని సవరించారని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో హోంగార్డుల వేతనాల పెంపు, పోలీసు సెలక్షన్లలో రాయితీలు కల్పించే అంశంపైనా నిర్ణయం తీసుకోవాలని రామకృష్ణ కోరారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 400 మంది ఏపీ స్థానికత కలిగిన హోం గార్డులు తెలంగాణాలో పనిచేస్తున్నారని వారిని రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ సీఎంను కోరారు. వేతనం పెంపుతో పాటు పోలీసు సెలక్షన్లలో నిబంధనలను సడలించి హోంగార్డులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మహిళల పట్ల వైకాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

### నారా భువనేశ్వరి



**విజయవాడ,జులై 9, ప్రభాతవార్త ప్రతి నిధి:** వైకాంగ్రెస్ పార్టీకి మహిళల పట్ల ఎటువంటి ద్వేష పూరిత అభిప్రాయం ఉందో మాజీ ఎంఎల్ఏ ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని నారా భువనేశ్వరి అన్నారు. 'ఎక్స్' వేదికగా ఆమె మహిళల పట్ల వైకాపా తీరు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని ఆయన వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని చెప్పారు. సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు స్థానం లేదు. ఎంఎల్ఏ ప్రశాంతి రెడ్డికి నా సంఘీభావం ప్రకటిస్తున్నా... ఆమెపై చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నన్నారు..,.మహిళల పట్ల అవమానకర పదాలు వారి విలువను తగ్గించలేదు. స్త్రీల గౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా ఖండించాల్సిందేనన్నారు. వైకాంగ్రెస్ పార్టీ నేతలు ఇంకా ఈ విషయంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని సమర్దించడం సరికాదన్నారు.

## ఉచిత బస్సు పథకం అమలుకు సన్నద్ధం

### ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులనే తీసుకోవాలని ఆర్టీసీ పాలకవర్గం నిర్ణయించిందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. వీటికోసం బస్టాండ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా తగిన వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన పాలకమండలి తొలి సమావేశం విజయవాడలోని ఆర్టీసీ కార్యలయంలో జరిగింది. ఇందులో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీ సంస్థ గతంలో 1,489 బస్సులు కొనుగోలు చేయగా, వీటిలో 904 బస్సులకు బాడీబిల్డింగ్‌కు టెండర్లు పిలిచి ఇచ్చారు. 518 ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రం రీటెండరు పిలిచి అదనపు ధరతో బాడీ బిల్డింగ్‌కు కాంట్రాక్టరు కు అవకాశం కల్పించారు. దీనికి రూ.75 కోట్ల చెల్లింపుల అంశం బోర్డులో చర్చకు రాగా కొందరు సభ్యులు దీన్ని ప్రశ్నించారు. మళ్లీ టెండరు పిలిచి, ధర ఎందుకు పెంచాల్సి వచ్చిందో వివరాలన్నీ వచ్చే బోర్డు సమావేశం నాటికి తెలియజేయాలని అన్నారు. రాయలసీమ జిల్లాల్లో బస్టాండ్ల పరిస్థితి ఎలా ఉందో కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చడంలో భాగంగా ఆగస్టు 15 మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా దీన్ని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అధ్యక్షతన ఏపీఎస్ ఆర్టీసీ పాలక మండలి సమావేశమైంది. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో జరిగిన భేటీకి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు, ఈడీలు, సహా బోర్డు సభ్యులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీకి సంబంధించి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశారు.

## అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధం

### - వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధమైంది. ఏపీ వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన రైతుల జాబితాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న జాబితాలో రైతులు వారి పేర్లను పరిశీలించుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు డిల్లీరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనూ ఆధార్ నెంబర్ ద్వారా తన అర్హతను తెలుసుకోవచ్చని వెల్లడించారు. మన మిత్ర వాట్సాప్ ద్వారా కూడా రైతులు వారి అర్హతను తెలుసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆధార్ నెంబర్‌ను మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు పంపితే వివరాలు లభ్యమవుతాయని సూచించారు. రైతు పేరు లేని పక్షంలో, అర్హత ఉందని భావిస్తే రైతు సేవా కేంద్రంలో అర్జీతో పాటు పత్రాలు సమర్పించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనీ గ్రీవెన్స్ మాడ్యులులో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13 వరకు మాత్రమే గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం ఉందని డిల్లీరావు స్పష్టం చేశారు. వివరాలు రైతులకు మరింత చేరేలా వ్యవసాయ శాఖ సిబ్బంది ముమ్మర ప్రచారం చేయాలని డిల్లీరావు ఆదేశించారు. అర్హులుగా 47.77 లక్షల రైతులు: ఖిఅన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్‌ఖి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 47.77 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించామని కొద్ది రోజుల క్రితం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సర్వే ఆధారంగా 98 మందికి ఈకేవైసీ పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియ ఇంకా 61,000 మందికి పూర్తి చేయాల్సి ఉందని ఢిల్లీరావు వివరించారు. సొంతభూమి కలిగిన డీ.పట్టాదారులు, ఎసైన్డ్, ఈనాం భూముల రైతులను కూడా అర్హులుగా గుర్తించామని ఢిల్లీరావు పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ జత కాకున్నా, తప్పుగా జోడించినా, చనిపోయిన ఖాతాలు, నోషనల్ ఖాతాలు కలిగిన రైతులు రెవెన్యూ అధికారులను వద్దకు వెళ్లి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం వారికి కూడా ఈ సుఖీభవ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. రైతుల అభ్యర్థనలు స్వీకరించేందుకు త్వరలో అన్నదాతా సుఖీభవ పోర్టల్ అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. భూమిలేని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడంతోపాటు ఈపంటలో పేరు నమోదు చేసుకోవాలని ఢిల్లీరావు సూచించారు. అర్హత ప్రకారం అందరికి లబ్ధి చేకూరుస్తామని అక్టోబరు, 2026 జనవరి నెలల్లో 2 విడతలుగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్ మొత్తాన్ని అందిస్తామన్నారు.

## ఐఐటి, నీట్‌లో అర్హత సాధించిన గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహకం

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఐఐటీ, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్ ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని ఎపీఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన ఎపీఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ కార్యాలయంలో 75 వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఐఐటి, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం ఐఐటి, నీట్ లో అతి తక్కువ మార్కులతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ రాష్ట్రంలోని 10 ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో డిప్యూటేషన్ పై గురుకులాల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయుల నియామకం గురుకులాలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మోటిక్ కిట్స్ ప్రతి గురుకులంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు వీటితో పాటు గురుకులాల్లో పదవ తరగతి, ఇంటర్ సెకండియర్ లో ఖాళీ సీట్ల అడ్మిషన్లకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఎపీఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో కీలకంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా వినుకొండ డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన భాయ్ తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద ఆర్థిక సాయంగా రూ.3 లక్షల చెక్కును మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అందజేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం.ఎం నాయక్, సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి, ఎపీఎస్‌డబ్ల్యు ఆర్‌ఇఐఎస్ అడిషన్ ల్ సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, ఎపీఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ డిప్యూటీ సెక్రటరీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## గరివిడి పశువైద్య కళాశాలకు లభించని విసిఐ అనుమతులు

### ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇతర కళాశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అనుమతి

### ఉత్తర్వులు జారీచేసిన తిరుపతి ఎస్‌వివియు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్

**గరివిడి (విజయనగరం జిల్లా), జూలై 9 ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాలకు వి సి ఐ (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) అనుమతులు లభించ లేదు. ప్రభుత్వం కృషి ఫలితంగా హౌస్ సర్జన్(ఇంటర్షిప్)కి వెళ్లే ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మాత్రం విసిఐ అనుమతులు రాకపోయిన నేపథ్యంలో వి సి ఐ అనుమతులు ఉన్న తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం పరిధిలో గల గన్నవరం,తిరుపతి, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో జాయిన్ చేసేందుకు అనుమతులు మంజూ రయ్యాయి. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ (న్యూ ఢిల్లీ) డైరెక్టర్ జయచంద్ర భానురెడ్డి గరివిడి కళాశాల పశువైద్య విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్‌కి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి. రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు ప్రతులను నాలుగు కళాశాలల డీన్, అసోసియేట్ డీన్‌లకు రిజిస్ట్రార్ రవికుమార్ పంపించారు. విసిఐ అనుమతులు లభించని విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్ చేసేందుకు అనుమతి, ఆపై సర్టిఫికెట్ చెల్లుబాటుకి అవకాశం లభించడంతో విద్యార్థుల ఊరట ఏర్పడింది. ఈ అనుమతులకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి కృషి ఫలించిందని చెప్పవచ్చు.

## కొమ్మినేనికి హైకోర్టులో ఊరట, బెయిలు షరతుల్లో సవరణ

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావుకు ఏపీ హైకోర్టు స్వల్పఊరట నిచ్చింది. బెయిల్ షరత్తుల్లో సవరణ చేసింది. రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావుకు మంగళగిరి కోర్టు విధించిన షరతులను అనుసరించి కొమ్మినేని తుళ్ళూరు పోలీసు స్టేషన్‌కు నిర్దేశిత వారాల్లో హజరు కావాల్సి ఉంది. ఈ నిబంధనను .హైకోర్టు పాక్షికంగా సవరించింది. ఇకపై ఆయన తుళ్ళూరుకు బదులుగా తాడేపల్లి పోలీసు స్టేషన్ హాజరు అయ్యేందుకు ఆయనకు వీలు కల్పిం చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లిఖార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై తుళ్ళూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ఓ టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు బెయిలు మంజూరు చేస్తూ, షరతులను విధించే అధికారం ట్రయల్ కోర్టుకు ఇచ్చింది.. దీంతో మంగళగిరి కోర్టు, ప్రతి నెలా రెండు, నాలుగో శనివారాలు తుళ్ళూరు పోలీసు స్టేషన్లో హాజరుకావాలని కొమ్మినేని శ్రీనివాసరావుకు షరతులు విధించింది. తుళ్ళూరు ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకు వెళితే తనపై దాడి జరిగే ప్రమాదం ఉందని, తాడేపల్లి పీఎస్‌కు వెళ్లేందుకు వెసులుబాటు ఇవ్వాలని కొమ్మినేని కోరారు.

## స్లీపర్ సెల్స్ పై సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలుపుదల!

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్రంలో స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరపాలంటూ డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే నేతృత్వంలోని ధర్మాసనం నిలిపివేసింది. హైకోర్టు ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అనంతరం కేంద్ర నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్–ఐఎస్ఐకి చెందిన పలువురు స్లీపర్ సెల్స్‌గా భారతదేశంలో ఉన్నారని అందులో కొందరు ఏపీలోని నంద్యాల, గుంటూరు, కడప, తదితర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని పేర్కొంటూ న్యాయవాది ఎస్.గౌతమి ప్రొద్దుటూరుకు చెందిన ఎ.శివకుమార్ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజేపీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ చేసింది. మంగళవారం జరిగిన విచారణలో ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించాలని అభ్యర్థించారు.

## రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహానికి 10 నమూనాలు మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అత్యంత ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. ఇందుకు పూర్వరంగం సిద్ధమైంది. రాజధాని లోని నీరుకొండ హిల్ ఏరియాలో ఎన్టీఆర్ భారీ విగ్రహం స్మారకాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. క్రమంలో రాజధానిలో నిరి ్మంచే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పది నమూనాలు సిద్దం చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిథులకు సూచించారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. విగ్రహ నమూనా దాని చుట్టుపక్కల చేపట్టే నిర్మాణాలపై కన్సల్టెన్సీ ప్రతినిథులతో పురపాలక శాఖ మంత్రి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.


సాంస్కృతిక మంత్రిత్వశాఖ
భారత ప్రభుత్వం

**టెండర్ ఆహ్వానిస్తూ ప్రకటన**

భారత ప్రభుత్వ, సాంస్కృతిక మంత్రిత్వశాఖచే 09 జూలై 2025న రూపొందించబడిన యుగే యుగీన్ భారత్ మ్యూజియం న్యూఢిల్లీ కొరకు సమగ్రమైన వస్తు ప్రదర్శనశాల డిజైన్ (ఆర్కిటెక్చురల్ మరియు ఎగ్జిబిషన్ డిజైన్) సర్వీసుల కొరకు డిజైన్ కన్సల్టెంట్ యొక్క ఎంపికకు ప్రతిపాదన కొరకు అభ్యర్థన.

ఆసక్తిగల బిడ్డర్‌లు వివరాలను **eprocure.gov.in** పై వీక్షించవచ్చు.

బిడ్ దాఖలు కొరకు చివరి తేదీ 01 ఆగస్టు 2025

cbc 09101/11/0010/2526

KAKINADA MUNICIPAL CORPORATION

**'e' PROCUREMENT TENDER NOTIFICATION**

Roc No. 1389/2025/E4, Dated: 09.07.2025

Tenders invited through ap e procurement platform for 14 works, Tenders invited through with an estimated amount value of **Rs. 4,12,10,724/-** from the eligible contractors in the following manner.

**Four Works for an amount of Rs. 22,09,776/-**
Last date and time for downloading bid documents: Dt: 15-07-2025 upto 10-00 AM

**Four Works for an amount of Rs. 23,08,032/-**
Last date and time for downloading bid documents: Dt:21-07-2025 upto 10-00 AM

**Six Works for an amount of Rs. 3,66,92,916/-**
Last date and time for downloading bid documents: Dt:28-07-2025 upto 10-00 AM

Tender Inviting Authority: Commissioner, Municipal Corporation, Kakinada
**Mail: kkd_mplcorp@yahoo.com, Call Centre Phone:0884-2357722**
Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

**OFFLINE TENDER RFP**

R.o.c.No. 3088/2025/E2 Dated: 09-07-2025

Kakinada Municipal Corporation is inviting Tenders from interested reputed firms/ organizations/ agencies. **FOR 3RD PARTY QUALITY CONTROL**
The interested agencies are paying Rs. 10,000/- for each work respectively which is Non-refundable in the form of DD drawn in favour of the Commissioner, Municipal Corporation at any Nationalized Bank payable at Kakinada.

| S.No | Description | | Date & Time |
|---|---|---|---|
| 1 | RFP Issue Start Date & time | : | From 11.00 A.M. 14/07/2025 |
| 2 | RFP Issue End Date & time | : | 4.00P.M. 21/07/2025 |
| 3 | RFP document receiving Closing Date & time | : | 4.00P.M. 22/07/2025 |
| 4 | Opening of Technical Bids Date & time | : | 5.00 P.M. 22/07/2025 |

Contact Mobile No: **9849906516; kmcengineeringsection@gmail.com**
Sd/- **Bhawna,** I.A.S,
Commissioner, Municipal Corporation, Kakinada


దోష రహితమైన దాన్ని నిందించడం, ప్రశంసకు అర్హత లేనిదాన్ని పొగడ్డం, మనిషి డబ్బుకోసం ఏం చేయడానికి అయినా వెనుకాడడు.

-పంచతంత్ర

# ద్వంద్వ ప్రమాణాలకు చెక్!

అంత్యరుద్ధాలు, దేశాల మధ్య అనుచిత వైరుధ్యాలు, వాదోపవాదాలు ఉద్యమాలతో సతమతమవుతున్న పెక్కు దేశాల ఏర్పాటు వాద ఆకాంక్షలు తీరేందుకా అన్నట్లు బ్రెజిల్‌లో జరిగిన 'బ్రిక్స్' సమావేశాలు ఒకింత ఊరటనిచ్చాయనే చెప్పాలి. సమస్య, పరిష్కారం రెండూ ఒకదానివెంట ఒకటి ఉన్నా ముందు సమస్యలపై విశ్లేషణ జరగందే పరిష్కార మార్గాలు ఎంచుకోలేని పరిస్థితి ఉంటుంది. కానీ మొదటి ప్రస్తావనలోనే రియో డీ జనీరో ప్రకటన ద్వారా ఉగ్రవాదంపై పోరుబాటను బ్రిక్స్ నేతలు ఆవిష్కరించినట్లయ్యింది. పశ్చిమాసియా దేశాల మధ్య ఏర్పడిన వైరుధ్యాలు, విభిన్నతల మధ్య కొన్ని ఆందోళన పరిస్థితులు ఏర్పడ్డాయన్న విషయం తెలిసిందే. 'బ్రిక్స్' సభ్యదేశం అమెరికా ఇతర దేశాల వాణిజ్యంపై విపరీతంగా సుంకాల విధింపు కూడా ఈ సదస్సులో ప్రస్తావనార్హంగా మారింది. వివిధ దేశాల మధ్య ఆంక్షలు, పక్షపాతం, వంటి అంశాలన్నీ చర్చనీయాంశాలయ్యాయి. తొలుత బ్రెజిల్, రష్యా, చైనాలతో ఏర్పడిన 'బ్రిక్స్'లో ఆ తర్వాత భారత్ చేరింది. దక్షిణాఫ్రికా కూడా సభ్యత్వం తీసుకుంది. ప్రస్తుతం 11 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈసారి ఈ సదస్సుకు రష్యా, ఈజిప్టు, ఇరాన్, చైనా అధ్యక్షుడు హాజరుకాలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గతంలో అన్ని సమావేశాలకు హాజరైనా ఈసారి ఆ దేశ అంతర్గత రాజకీయ సమస్యలవలన రాలేదు. ఆయా దేశాల ఆకాంక్షల మధ్య బ్రిక్స్, సార్క్, వంటి అనేక దేశాల గ్రూపులు ఎప్పటికప్పుడు భవిష్యత్ నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటాయి. స్నేహ సౌహార్ద్ర సంబంధాలను మెరుగుపరుచుకుంటూనే ఉంటాయి. చాలా కాలంగా అచేతనంగా ఉన్న దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) స్థానంలో భారత్‌తో సహా అన్ని దక్షిణాసియా దేశాలతో మారో గ్రూపు ఏర్పాటు చేసేందుకు చైనా నాయకత్వంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు కలిసి వస్తే కొత్త కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నాలు చాపకింద నీరులా జరుగుతున్నాయి. సార్క్‌కు కేవలం ఇది కొత్త రూపంగా ఉండబోతోంది. సార్క్‌లో భారత్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక దేశాలు సభ్యదేశాలుగా ఉన్నా, వాటి బంధాన్ని భారత్‌లోని 'యురీ' సైనిక శిబిరంపై ఉగ్రదాడి ద్వారా పాకిస్థాన్ 'సార్క్'ను చెల్లాచెదురు చేసింది. అందుకే 'సార్క్'ను కొత్త రూపంలో తేవడం ద్వారా దక్షిణాసియాలో ఉద్రికత్తలను పరస్పర అవగాహన ద్వారా నియంత్రించుకోవచ్చుననే భావనలో కొన్ని ప్రధాన దేశాలు యోచిస్తున్నాయి. 'బ్రిక్స్' సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ వివరించిన అంశాలన్నీ ప్రధానంగా అన్ని సభ్యదేశాలూ ఆలోచించదగినవే. కృత్రిమ మేధాయుగంలో దేశాభ్యుదయం గురించి ఆలోచించేవారు వెనుకబడి ఉండరాదన్నది ఆయన సందేశం. పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక సహాయం, సుస్థిరాభివృద్ధి, సాంకేతికత లభ్యత వంటి అంశాలో గ్లోబల్‌సౌత్‌కు తగిన ప్రాతినిధ్యం కానీ, వెసులుబాటు కానీ దక్కలేదని మోడీ ఆవేదన. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత సహా అన్ని అంశాలలోనూ ద్వంద్వప్రమాణాలే పాటించబడుతున్నందున గ్లోబల్ సౌత్ దేశాలకు అన్యాయమే జరిగిందన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్యం దక్కకపోవడం పట్ల మోడీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత అవసరాలకువీలుగా భద్రతా మండలిని 'సంస్కరించుకోవాల్సిన పరిస్థితిని ప్రధాని నొక్కిచెప్పారు. ఆదివారం నాటి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ స్వరమే ప్రధానంగా వినపడింది. ఇటీవల పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సాగించాలని, ఉగ్రవాదులపై ఆంక్షలు విధించేందుకు సంకోచించడం సరికాదని హితవు చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థిస్తే అది మనల్నే కబళిస్తుందన్న ధోరణిని వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ, ఆర్థిక వ్యవహారాలు, బహుళపక్షవాద అనే అంశాలపై 'బ్రిక్స్' సమావేశంగా ప్రధానంగా దృష్టి సారించింది. చాలా కాలంగా అన్యాయమవుతున్న దక్షిణాఫ్రికా దేశాలను ముందుగా సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతనే నరేంద్రమోడీ బ్రెజిల్ 'బ్రిక్స్' సమావేశంలో వారికి ప్రాతినిధ్య ప్రతినిధిగా సమస్యలకు ఆవేదనను ఏకరువు పెట్టారు. పూర్తిగా కాకపోయినా కొంతలో కొంతైనా 'బ్రిక్స్' సమావేశం అనేక దేశాలకు ఆశాకిరణంగా కనపడింది. ఏ మాత్రం మొహమాటం లేకుండా అమెరికా, చైనాలు భారత్ వాణిజ్యంపై పెడుతున్న ఆంక్షలు, సుంకాల విషయాన్ని నిర్ద్వంద్వంగా మోడీ బయటపెట్టారు. 'క్రిటికల్ మినరల్స్' అనబడే లిథియం, నికెల్, గ్రాఫైట్స్ వంటి ప్రధాన ఖనిజాల ఎగుమతులపై చైనా విధిస్తున్న ఆంక్షలు ఆహ్వానించదగినవి కావని ప్రధాని ఎలుగెత్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల తయారీలో క్రిటికల్ మినరల్స్' ఉపయోగిస్తుంటారు. కృత్రిమ మేధవల్ల కలిగే ప్రయోజనాలు, దుష్పరిణామాలను గురించి చర్చించేందుకే వచ్చే యేడాది భారత్‌లో 'ఎఐ ఇంపాక్ట్ సదస్సు'కు బ్రిక్స్ దేశాలను భారతప్రధాని ఆహ్వానించడం భవిష్యత్ సాంకేతికత విషయమై ఓముందడుగు వేసినట్లే. బ్రిక్స్ శాస్త్ర పరిశోధనల బాంఢాగారాన్ని ఏర్పాటును ప్రత్యేకించి ప్రధాని ప్రకటించారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల నుండి తట్టుకోడానికి వీలుగా పారిస్ వాగ్దానాలను భారత్ తనవంతుగా ఇప్పటికే నెరవేర్చిందని, 2070కల్లా 'నెట్‌జీరో' స్థాయికి చేరి పుడమిని రక్షించే నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు ప్రధాని వివరించారు. ఈ 'బ్రిక్స్' సదస్సు నిర్ణయాలు. విశ్వమానవాళికి శుభదాయకం కావాలి. సమన్వయం, సహకారం విధానాలలో వచ్చే యేడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సమావేశంలో సౌహార్ద్ర సంబంధాలు ఇనుమడిస్తాయని ఆశిద్దాం.

> ఎవరిని ప్రశంసిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

> ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే, గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.




ఉడ్రోవిల్సన్

# విద్యాహక్కు చట్టంపై అవగాహన పెంచాలి

*నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి.*

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యను సామాజిక అంశంగా నాటి నుండి నేటి తరం వరకు గుర్తిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఆధునిక జీవన విధానంలో ప్రామాణికమైన, గుణాత్మకమైన విద్యను అభ్యసించిన పరిజ్ఞానమే దేశాభివృద్ధిలో అత్యంత కీలకంగా మారుతుంది. కచ్చితత్వం, విశ్వసనీయ ఆదర్శవంతమైన మంచి ఆలోచనాత్మక ధోరణితో ఉన్న విద్యావ్యవస్థ దేశానికి ఎంతో ఉపయోగకరమైనది. ఇందుకు అవసరమైనటువంటి విధి విధానాలపై ప్రభుత్వాలు ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టాల రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టాల అమలు విధానంలో అనేక సందేహాత్మక అనుమానాలు రేకెత్తుతున్నాయి. విద్యా విభాగం రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ విద్యా బడ్జెట్ కేటాయింపుల్లో ఇంకా ఎక్కువ నిధిని ముఖ్యంగా పాఠశాల విద్యకు కేటాయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న భిన్న వాదనలు ఉండటం గమనార్హం. భారత దేశంలో రెండు వేల పది సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కుచట్టం దేశంలోని బడిఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా వివిధ యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలలో గుణాత్మక విద్యను అభ్యసించే విధంగా విద్యాహక్కు చట్టం ఉచిత నిర్బంధ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, చట్టపరంగా దేశంలోని ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల బాలబాలికలకుఉచిత నిర్బంధ విద్యను కఠినంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ లేకుండా నిర్దిష్టమైన చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం వివిధ యాజమాన్యంలోని పాఠశాలలో విద్యార్థులకు అనువైనటువంటి కనీస మౌలిక వసతులు కల్పించే విధానాలను రూపొందించింది. అయితే కార్యచరణలో పూర్తిస్థాయిలో ఏ మేరకు సఫలీకృతమవుతున్నదో, లేదో అనే చర్చ సమాజంలో జరుగుతున్నది. సంస్కారవంతమైన విలువలతో కూడిన ఉత్తమమైన విద్య ఎంతో ఉన్నతమైనది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే రీతిలో మంచి ఆలోచన విధానాలకు పదును పెట్టే విధంగా పాఠశాల విద్యకు విద్యాహక్కు చట్టం అధిక ప్రాధాన్యతనీ మరింతగా ఇవ్వవలసిన అవసరం ఉందనే అభిప్రాయం లేకపోలేదు. మారుమూల ప్రాంతాల్లో సైతం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా పాఠశాలలను నెలకొల్పి ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు తదితరమైనవి ఉచితంగా అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలోమాత్రం అనుకున్నంత స్థాయిలో విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో నమోదు కావడం లేదన్న విమర్శలు, విద్యావ్యవస్థ మొత్తం ప్రభుత్వ పరంగా నడిపించాలనే వాదనలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలదే పై చేయి అవు





తుండడం, ఆర్థిక వైవిధ్యాలతో ఉన్నా కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలపై మొగ్గు చూపుతుండడం గమనార్హం. కానీ ప్రైవేట్ పాఠశాలలో విద్యా హక్కు చట్టం అమలు విధానంపై అనేక సందేహాలు ఉండడం ,విద్యా హక్కు చట్టం కేవలం ప్రభుత్వ పాఠశాలకే వర్తిస్తాయా లేక ప్రైవేట్ పాఠశాలకు కూడా వర్తిస్తుందా అనే సంశయం విద్యార్థుల తల్లిదండ్రులలో ఉండటం దీనిపై ప్రభుత్వాలు కూడా ఖచ్చితమైన దిశానిర్దేశం సూచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. విద్యాహక్కు చట్టాల అమలు విషయంలో కూడా ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉండాలన్న వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. గతంలో దేశంలో విద్యాభివృద్ధి కొరకు ఓబిబి, అపెప్, డిపెప్, సర్వశిక్ష అభియాన్ లాంటి కార్యక్రమాలు జాతీయ విద్యా ప్రణాళిక ప్రకారం నిర్వహించబడినప్పటికీ, రెండు వేల ఐదు సంవత్సరంలో విద్యా లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు భావవ్యక్తీకరణ కీలకమైనదని భావించిన విద్యా కమిషన్, నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంతో ఒకటి నుండి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను కూడా సమగ్ర మూల్యాంకను ఆధారంగా రూపొందించి పాఠశాలల్లో బోధనభ్యాసనాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. అయితే దేశంలో విద్యా హక్కు చట్టం అమలు అనుకున్న స్థాయిలో లేకపోవడానికి గల కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు మరింత అభివృద్ధి పరచవలసి ఉంది. ప్రభుత్వాలు విద్య విషయమై అనేక సందర్భాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ ,విద్యకు బడ్జెట్ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోతుందనే భిన్న వాదనలు ఉన్నాయి. విద్యాహక్కు అమలు విధానంలో భాగమైన పాఠశాల మౌలిక వసతులు, పరిపూర్ణమైన స్థాయిలో విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా తరగతి గదుల నిర్మాణం చేస్తున్నప్పటికీ, ప్రాథమిక తరగతి స్థాయిలో ప్రతి విషయం బోధనకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి ఉండవలసిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని సందర్భాల్లో చదువుకు అయ్యే ప్రవేశ రుసుములపై నియంత్రణ లేకపోవడం, ఒకఎత్తు అవుతుంటే విద్యాహక్కు చట్ట ప్రకారం ఒకటి నుండి పదవ తరగతి వరకు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వికలాంగులకు సంబంధించినటువంటి వారి విషయంలో ఇరవై ఐదు శాతం ఉచిత విద్యను అందించవలసినటువంటి కార్పొరేట్ విద్యా సంస్థలు ఏ మేరకు విద్యా హక్కు చట్టాన్ని అమలు పరుస్తున్నాయో పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విభిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి. ●

# చేపల రైతు చేతుల్లోనే ఆహార భద్రత!

రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్హి ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతే కాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం వాటాను కలిగి ఉంది. సరైన విధా



నాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్యరంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో దాదాపు 2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటివనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలో మార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగుపరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ ఉద్దేశం. ●

# సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తత అవసరం

కామిడి సతీష్‌రెడ్డి

నిత్యం మనం వాడే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, చార్జింగ్ కేబుల్ డివైజ్ ఏదైనా సరే వానిని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. వీరు చేసే మోసాల గురించి అవగాహన కలిగి ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారానే వారికి అడ్డుకట్ట వేయగలమని సంబంధిత శాఖ అధికారులు, ఆయా బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేటి ఆధునిక కాలంలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్లైన్ డబ్బు చెల్లింపులు అతి సర్వ సాధారణమైనాయి. జేబులో డబ్బులు అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ఏ విధమైన చెల్లింపులైనా చేసే అవకాశం ఉంది. అతి తెలివిగా కేటుగాళ్లు (హ్యాకర్లు) మనంమొబైల్ వాడకంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బులు కొల్లగొట్టేస్తారు. మనం చేసే ఏ చిన్న పొరపాటైనా సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతుంది. కాబట్టి చాలా అప్రమత్తం, జాగ్రత్తగా ఉండాలి. పాస్‌వర్డ్‌లు సరిగ్గా పెట్టుకోకపోయినా, వారి మాయమాటలకు పడిపోయినా ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. ప్రతీ రోజు ఏదో ఒకచోట సైబర్ క్రైమ్ జరుగుతూ వుంది. మన అలసత్వం, అమాయకత్వాన్నే ఆసరాగా చేసుకొని కూర్చున్నచోటి నుంచే కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు సైబర్ నేరగాళ్లు. వీరి బారి నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు సూచిస్తూ ఆర్బీఐ కొన్ని సూచనలు చేసింది. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు సెక్యూర్ పేమెంట్ గేట్‌వేస్‌ను ఎంచుకోవాలి. లేదంటే మన సమాచారం మూడో వ్యక్తికి చేరే ప్రమాదం ఉన్నట్టే. మీ పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు, క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లు భద్రంగా ఉంచుకోవాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు సహా ఇతర వివరాలు ఎప్పుడూ మీ ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్స్, వెబ్‌సైట్స్‌లో సేవ్ చేసి పెట్టుకోవద్దు. మీకు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్లు, ఫైళ్లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వాటితో మీ కంప్యూటర్‌లోకి ఫిషింగ్ లింక్‌లు వచ్చే ప్రమాదం ఉంది. కొత్తవారితో మీ చెక్‌బుక్ కాపీలు, కేవైసీ డాక్యుమెంట్లు షేర్ చేయవద్దు. డివైజ్ లేదా కంప్యూటర్ సెక్యురిటీ ఇలా తరచూ మీ పాస్‌వర్డ్‌లు మారుస్తూ ఉండాలి. మీ డివైజ్‌ల్లో మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు తరచూ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలి. మీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లకు తప్పక పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలియని సోర్స్‌ల నుంచి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు. మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయాలి. మనం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా 24 గంటలపాటు పనిచేసే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. మన తెలుగు రాష్ట్రాలతో సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉంటాయి. మనం కాల్ చేసిన వెంటనే పోలీసులు మన బ్యాంక్ ఖాతాను స్తంభింపజేస్తారు. దీనివల్ల మరింత సొమ్ము



మనఖాతా నుంచి పోకుండా కాపాడుకోవచ్చు. తర్వాత కేసు దర్యాప్తు ఉంటుంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడు వర్చువల్ కీబోర్డు (కంప్యూటర్ స్క్రీన్‌పైన కీబోర్డు కనిపిస్తుంది)ను వాడాలి. సాధారణ కీబోర్డుపై మనం ఏయే నంబర్లు నొక్కామన్నది ఇతరులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. మీరు ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేసిన వెంటనే లాగ్‌అవుట్ కావాలి. తరచూ మీ పాస్‌వర్డ్‌ను మారుస్తూ ఉండాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు మీ ఈ మెయిల్‌కు ఒకే పాస్‌వర్డ్‌ను ఎట్టిపరిస్థితుల్లో పెట్టకోవద్దు. సైబర్‌కేఫ్‌లు, ఇతర పబ్లిక్ కంప్యూటర్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేయక పోవడం ఉత్తమం. పాస్‌వర్డ్ పక్కాగా ఉండేలా చూసుకోవాలి. మీ పాస్‌వర్డ్ మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు తాళం వంటిది. ఇది పక్కాగా ఉండేలా చూసుకోవాలి. అవకాశం ఉన్న ప్రతి చోటా టూ ఫ్యాక్టర్ (రెండంచెల సెక్యూరిటీ) ఆథంటికేషన్ పెట్టుకోవాలి. సైబర్ క్రైమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లేస్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్‌యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది. వాట్సాప్, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింక్‌లు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్. మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సిస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి. అయితే ప్రస్తుతం సిమ్ తీసుకోవాలంటే ఆధార్ లింక్, బయో మెట్రిక్ తప్పనిసరి కావడంతో ఈ ప్రమాదం కొంత వరకు తగ్గుతుంది. కానీ సిమ్ క్లోనింగ్ అనే మరో ప్రక్రియ ద్వారా మన సిమ్ యాక్టివ్‌లో ఉండగానే, మన నంబర్‌తోనే ఇంకో సిమ్ క్రియేట్ చేసే టెక్నాలజీ కూడా వచ్చింది. ఇది ఇంకా ప్రమాదకరం. అందుకే ఆధార్ నంబర్ లాంటి మన పర్సనల్ డేటాను లీక్‌కాకుండా చూసుకోవాలి. బ్లూటూత్ సహాయంతో కూడా హ్యాకర్లు ఒక నిర్ణీత దూరంలో ఉన్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసే చాన్స్ ఉంది. ఇందుకోసం హ్యాకర్లు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ హ్యాకింగ్ ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంది. పబ్లిక్ వైఫైని వాడే వాళ్లు హ్యాకర్లకు ఈజీ టార్గెట్ అవుతారు. అందుకే పబ్లిక్ వైఫైని వాడకపోవడం మంచిది. అలాగే మీ వైఫైని ఓపెన్‌గా వదిలేయకుండా ఉండాలి. కచ్చితంగా స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. సైబర్ నేరాల గురించి సరైన అవగాహన పెంచుకుని ఎవరికి వారు రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ●

# ప్రజావాక్కు



## విషపూరిత రసాయనాలను వాడొద్దు

ఇటీవలవ్యవసాయంలో విస్తృతంగావినియోగిస్తున్న గ్లైఫోసేట్ అనే విషపూరిత రసాయనంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనేక పరిశోధనలు, నివేదికలు దీని ప్రమాదకరతను స్పష్టం చేస్తున్నప్పటికీ, మన దేశంలో ఇది ఇంకా వ్యవసాయ చట్టాల కింద నియంత్రణలో లేకుండా వినియోగించబడుతోంది. ఇది రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పర్యావరణానికి, జల వనరులకు, వన్యప్రాణులకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది. గ్లైఫోసేట్ అనేది హెర్బిసైడ్‌గా ఉపయోగించే రసాయనం. ఇది ముళ్లపొదల్లో స్పష్టమైన ప్రభావం చూపుతుందనేది నిజమే. కానీ దీని దీర్ఘకాలిక ప్రభావాలు మాత్రం అత్యంత భయంకరమైనవిగా బయటపడుతున్నాయి. ఇది కేన్సర్‌ను తేవచ్చు అనేవిషయం ప్రపంచ ఆరోగ్య సంస్థకి చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ నివేదిక ద్వారా స్పష్టం అయింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

హక్కుల గురించి మాట్లాడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణ లేకుండా కుక్కబడిన పరిస్థితి ఉంది. దళితులలోఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కువ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు. నిరసన తెలిపేందుకు అవకాశం లేదు. చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు. రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

## తండాలకు తారు రోడ్డు వేయాలి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గిరిజన తాండాలకు తారు రోడ్డువేయాలి. గిరిజన తాండాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తండాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నస్థితిలో ఉంటున్నాయి. కావున ప్రభుత్వాలు తక్షణం గిరిజన తండాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

## పోటీకి అనర్హులు

అమెరికా అధ్యక్షుడి ఎన్నికలలో డోనాల్డ్ ట్రంప్‌కు కుడి భుజంగా అహర్నిశలు పనిచేసి లక్షల డాలర్లు ఖర్చు చేసి తన స్నేహితుడి విజయానికి బాటలు పరచిన అపర కుబేరుడు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ట్రంప్ నిర్ణయాలతో విభేదించి స్నేహ బంధాన్ని విడనాడి ప్రజాస్వామ్య పరిరక్షణకు 'అమెరికా పార్టీ' అనే పేరుతో ఓ కొత్త పార్టీకి పునాది రాయిని వేయడం జరిగింది. అమెరికాలో దాదాపు 55రాజకీయ పార్టీలున్నాయి. ఎన్ని ఉన్నా ఎన్నికల పోటీలో నిలబడేవి ముఖ్యంగా డెమొక్రటిక్, కన్సర్వేటివ్ పార్టీలు మాత్రమే. అదే ఇండియాలో రెండు వేల అయిదు వందల పార్టీలున్నాయని మన ప్రధాని ఘానా దేశ పర్యటనలో చెప్పారు. మస్క్ పెడుతున్న పార్టీకి అమెరికాలో అనూహ్య మద్దతు లభిస్తోందని వార్తలొస్తున్నాయి. ఇందులో రాజ్యాంగ పరమైన చిక్కేమిటంటే మస్క్ పుట్టింది సౌత్ ఆఫ్రికాలో. అందుచేత అమెరికా అధ్యక్షునిగా పోటీ చేయడానికి ఆయన అర్హత ప్రశ్నార్థకమే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్థులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం. రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం. అందుకే ఉత్తరాంధ్రలో తెలగకులాన్ని జాగృతం చేయాలి.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

## వికలాంగుల నైపుణ్యాలు మెరుగుపరచాలి

వైకల్యం అనేది శరీరాలకి కానీ మనసుకు, నైపుణ్యాలకు, చైతన్యానికి అడ్డు కాదని వికలాంగులు వివిధ రంగాలలో నిరూపిస్తున్నారు. వికలాంగులలో ఉన్నత విద్యావంతులు, రచయితలు, గాయకులు, ఆర్టిస్ట్, క్రీడలు, నటన, చిత్రకారులు, వివిధ సంస్కృతిక రంగాలలో అద్భుతమైన ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆయా రంగాలలో పేరు ప్రతిష్ఠలు పొందిన వారి చేత వికలాంగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ వివరాల సేకరణ

**సత్తెనపల్లి, జూలై 9 ప్రభాతవార్త :** క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాపై బుధవారం విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. విజిలెన్స్ రేంజ్ ఇన్స్పెక్టర్ షేక్.సైదులు నేతృత్వంలోని నలుగురు విజిలెన్స్ బృందం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఆర్వో అప్పారావు వద్ద వివరాలు కోరారు. ప్రత్యేకంగా ఒక ప్రొఫార్మా ఇచ్చి దాని ప్రకారం వివరాలు నింపాలని సూచించారు. పట్టణంతో పాటు మండలంలోని, గ్రామ, వార్డు సచివాలయాల అడ్మిన్లు అందరిని మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి వారి చేత ప్రొఫార్మా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు.

అమరావతి వార్త

## ప్రీ పీహెచ్‌డి ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై9, ప్రభాతవార్త:** విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ పార్ట్-1, ప్రీ పీహెచ్‌డి-2025 పరీక్షల ఫలితాలను తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు బుధవారం విడుదల చేశారు. ఆర్ట్స్, సైన్స్, ఫార్మశీ, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి ఈ పరీక్షలకు పరిశోధకులు హాజరుకాగా వారిలో 82శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ తాత్కాలిక కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. రీవాల్యుయేషన్ కు ఈనెల 18వ తేదీలోగా ఒక్కోపేపర్‌కు రూ1500 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫలితాల విడుదల సందర్భంలో తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్, ఇంటర్నేషల్ స్టూడెంట్ సెల్ తాత్కాలిక డైరెక్టర్ ఆచార్య పద్మావతి, ఎన్ఎస్ఎస్ తాత్కాలిక ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజో మూర్తి, సిఇ శివప్రసాదరావు, ఏసిఇ వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉన్నతమైన పాఠశాల..

# ఉపాధ్యాయులు ఎక్కడ..?

**విజయపురిసౌత్, జులై 9 ప్రభాతవార్త:** అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా ఉంది విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిస్థితి అవును విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిస్థితి ఇందుకు ఉదాహరణ. విద్యార్థులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నా ఫలితం మాత్రం శూన్యం. ఈ పాఠశాలలో మంచి క్రీడా ప్రాంగణం ఉంది. పరిశుభ్రమైన మంచినీరు, విద్యార్థులు తమ కళానైపుణ్యాలను ప్రదర్శించడానికి కళా వేదిక, పరిశుభ్రమైన తరగతి గదులు అన్నీ ఉన్నాయి కానీ పిల్లలకు చదువుచెప్పే ఉపాధ్యాయులు మాత్రమే కరవయ్యారని ఓసామాన్యుడి సణుగుడు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం విద్యార్థుల సంఖ్య 450కి పైమాటే. ఈ విద్యార్థులందరికీ కేవలం నలుగురు అంటే నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. ఇలా అయితే తాము అన్ని తరగతు విద్యార్థులకు ఏ విధంగా తరగతులు బోధించగలమని ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు ఉపాధ్యాయులు.




పది రోజులక్రితం పాఠశాల హెచ్ఎం ఉపవిద్యాశాఖాధికారిని కలిసి పరిస్థితిని వివరించారు. వారు స్పందిస్తూ వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ జరిగితే కచ్చితంగా మీకు ఉపాధ్యాయులని అందిస్తామని హామీ ఇచ్చారు. ఇలా పలుమార్లు ప్రతి సంవత్సరం జరుగుతూ ఉంది కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. విజయపురిసౌత్ గ్రామంలో మొత్తం జనాభా ఏడు వేల నుంచి ఎనిమిది వేల వరకు ఉంటుంది. అందులో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను 25 కి.మీ. దూరంలో ఉన్న మాచర్లలోని పాఠశాలలకు పంపిస్తున్నారు. కొంతమంది స్థానికంగా ఉన్న పాఠశాలలోనే పిల్లలను చదివిస్తున్నారు. కొంతమంది పంపించే ఆర్థిక స్తోమత లేక, ఫీజులు చెల్లించలేక పిల్లలను మధ్యలోనే చదువు ఆపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో తమ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే సరిపడా ఉపాధ్యాయులు లేకుండా ఎలా సాధిస్తారని ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థులు, గ్రామసఉ్థలు, పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు : కమిషనర్

**గుంటూరుతూర్పు, జులై 9 ప్రభాతవార్త:** నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్ లు, డ్రైన్ల పై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజి లైన్ ని మేజర్ డ్రైన్ లోకి కనెక్ట్ చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఏటి అగ్రహారం, వెంకటరమణ కాలనీ, రామిరెడ్డి నగర్, ఎన్జీఓ కాలనీ, శ్యామల నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్ కి దరఖాస్తు చేసుకున్నభవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ ల కొలతలు తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబందనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబందనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబందనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్ లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రదానంగా సెట్ బ్యాక్ పోర్షన్ లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్ లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుండి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్మెంట్ నిర్వాహకులే డ్రైనేజి లైన్ ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల క్వార్టర్స్ నిర్మాణ పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన శాసనసభాపతి

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త:** ప్రజారాజధాని అమరావతిలో నిర్మించిన లీలితి, లీలిదిల క్వార్టర్స్ భవన సముదాయాలను ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు పరిశీలించారు. శాసనసభాపతి వారికి సిఆర్డిఏ హౌసింగ్ బిల్డింగ్స్ (హౌసింగ్ ప్రాజెక్ట్స్) విభాగ చీఫ్ ఇంజినీర్ ఎన్. శ్రీనివాసులు, ఇతర ఇంజినీరింగ్ విభాగ అధికారులు.. భవనాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, ఇంటీరియర్ గురించి వివరించారు. మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు శాసనమండలి, శాసనసభ సభ్యుల కొరకు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఇంటీరియర్ పనులలో పురోగతిని శాసనసభాపతి వారికి అధికారులు వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని శాసనసభ్యులకు నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు శాసనసభాపతి వారు పలు సూచనలు చేశారు. అలాగే భవన సముదాయాల వద్ద ఏర్పాటు చేస్తున్న పలు సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.





## ఇండోర్ స్టేడియంను ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూలై 9 ప్రభాతవార్త : సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ ఇండోర్ ఆడిటోరియం స్టేడియంను బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ప్రారంభించారు. నూతనంగా ప్రారంభించిన కోర్టులో మంత్రి రాంప్రసాద్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వైకాపా హయాంలో వ్యవస్థలు మొత్తం నాశనమయ్యాయన్నారు. అమరావతిలో 2500 ఎకరాలలో అంతర్జాతీయ క్రీడా మైదానాన్ని నిర్మిస్తామన్నారు. విజయవాడ, వైజాగ్, తిరుపతిలలో స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడు అని తెలిపారు. డిఎస్సీ నోటిఫికేషన్‌లో మూడు శాతం రిజర్వేషన్లు క్రీడాకారులకు కల్పించారని గుర్తు చేశారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు అంటే గొప్ప గౌరవం ఉందన్నారు. వైకాపా హయాంలో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులను గౌరవించి ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు నాగోతు శౌరయ్య, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



### పశ్చిమ నియోజకవర్గంలో

# సుపరిపాలనలో తొలి అడుగు

గుంటూరు క్రైమ్,జూలై 9,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విస్తృతంగా జరుగుతుంది.బుధవారం 45వ డివిజన్ పీరుతోట ప్రాంతంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవికార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 49వ డివిజన్ పీరుతోట ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రజలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ,వారి వద్ద నుండి సలహాలు, సూచనలు స్వీకరించడం జరిగింది. మహిళలకు తల్లికి వందనం,ఉచిత బస్సు పథకాల అమలు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అభివృద్ధి, సంక్షేమంసమపాళ్ళలో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అనుభవంతో ముందుకు నడుపుతున్నారు.రాష్ట్ర మరియు నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్డు,డ్రైన్లు మరియు కల్వర్టుల నిర్మాణంతో అభివృద్ధిలో దూసుకుపోతుంది.ఈ డివిజన్‌లో పర్యటించినప్పుడు వీధి కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.అయితే రాబోయే 2నెలల్లో కుక్కల బెడద కూడా పరిష్కరిస్తాము. టిడ్కో ఇళ్ళ సమస్యను పరిష్కరించి,అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తాం.

**-సమాజంలో వైసీపీకి స్థానం లేదు.**

అధికారం పోయిందన్న అక్కసుతో వైసీపీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జగన్‌రెడ్డి ప్రజలను తొక్కుకుంటూ పోతే,ఆ పార్టీ మాజీమంత్రి, ఎమ్మెల్యేలు ఇష్టానుసారం మహిళల పట్ల నోరు పారేసుకుంటున్నారు.నిన్నటికి నిన్న ఒక బుద్ధిలేని,ఇంగిత జ్ఞానం,విచక్షణ లేని వ్యక్తి మహిళా ప్రజాప్రతినిధి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేస్తే,ఆ పార్టీ అధిష్టానం ఖండించకుండా ఉండటం, ఈ రోజుకి కూడా ప్రసన్నకుమార్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని నిసిగ్గుగా ప్రకటించడం చూస్తే,వీరు ఎంత బరితెగించి ఉన్నారో అర్థం అవుతుంది. ఇటువంటి వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

**-విజిటింగ్ వీసా మీద వచ్చిన అంబటి రాంబాబు**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంకు అంబటి రాంబాబు విజిటింగ్ వీసా మీద వచ్చిన ఒక యాత్రికుడు అని,2029లో మరో యాత్రికుడు వస్తారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవ చేశారు. విలేకరులు అడిగిన ప్రజలకు ఎమ్మెల్యే స్పందిస్తూ ...గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైసీపి ఇన్‌చార్జీగా నియమించడానికి ఒక సంవత్సర కాలం పట్టింది.వైసీపీ కి ఎన్నికల సమయంలో అభ్యర్థులు దొరక్క,వారుచేసిన అవినీతికి ప్రజలు ఓడిస్తారనే భయంతో జంబ్లింగ్ పద్దతిలో జిల్లాలకు కూడా సంబంధం లేని అభ్యర్థులను పోటీకి పెట్టి 11సీట్లకి పరిమితం అయింది.సత్తెనపల్లిలో అవినీతికి పాల్పడిన వ్యక్తిని ఓడిస్తే,అతన్ని గుంటూరు పశ్చిమకు తీసుకొచ్చి ఇన్‌చార్జీగా పెడితే ప్రజలు విశ్వసిస్తారనుకోవడం అవివేకం,వైసీపీ నేతల అవినీతి ఖండాంతరాలు దాటిందని,2029లో అంబటికి బదులు మరోవ్యక్తి వచ్చి పోటీచేస్తారని ఎమ్మెల్యే మాధవి జోస్యం చెప్పారు.కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, వడ్లమూడి వెంకటేశ్వరరావు,బెజవాడ రమ్య, ఈశ్వరాచారి ,రఫీ,నరసింహారావు,కృష్ణారెడ్డి,దుడికి సాంబయ్య,శ ోభారాణి,ములక సత్యవాణి, నాగుల్‌మీరా,ఎలుకా వీరాంజనేయులు,మద్దిరాల మ్యానీ,కొమ్మినేని కోటేశ్వరరావు,దామచర్ల శ్రీనివాస్, కొల్లి అనిల్,పేరయ్య, భద్రయ్య ,తెలగతోటి సుధీర్, సంజీవ్,కన్నసాని బాజి,వలి,క ొడియాల శ్రీదేవి,గుర్రం ప్రసాద్,మొవ్వ వేణు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.





## 14వ వార్డులో సుపరిపానలో తొలిఅడుగు

**-వార్డుల్లో ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు**
**- ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రోగ్రెస్ అడిగిన ఎమ్మెల్యే నసీర్**
**-నూరుశాతం సంతృప్తిగా ఉన్నామని చెప్పిన ప్రజలు**

**గుంటూరుతూర్పు, జులై 9 ప్రభాతవార్త:** కూటమి సుపరిపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజల ముంగిటకు వచ్చిన తమ నాయకుడు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఏడాది కాలంలో తమ ఇంటికే సంక్షేమాన్ని తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ ను మనసారా ఆశీర్వదిస్తున్నారు. సుపరిపాలన మన ఎమ్మెల్యే తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 14వ వార్డులో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు.



ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి తమ పరిపాలన ఏడాది ప్రోగ్రెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పాలనలో వందకు ఎన్ని మార్కులు వేస్తారంటూ ప్రజలను అడిగారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై తామంతా సంతోషంగా ఉన్నామని, వందకు వంద మార్కుల వేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చెప్పిన మాట చెప్పిన విధంగా సంక్షేమ అభివృద్ధి, పథకాలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. పింఛన్లు నాలుగు వేల రూపాయలు పెంచి ప్రతి నెలా ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్న ప్రభుత్వాన్ని అవ్వ తాతలు హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఏ ఒక్కరు బాధపడకూడదని కృత నిత్యంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 200 మందికి రూ.2.50 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల ద్వారా భరోసా కల్పించామని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వందల కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ లో పేదలకు మరింత వైద్య సేవలు అందించేందుకు దాతలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. దీంతోపాటు పీ4 కార్యక్రమం ద్వారా పేదరికంపై యుద్ధం చేయబోతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, కార్పొరేటర్ వేముల జ్యోతి, దేవళ్ల వెంకట్, వహీద్, చల్లా ఆంజనేయ ప్రసాద్, అచ్చి కిరణ్, సాదినేని శ్రీనివాసరావు, కొంపల్లి మాలకొండయ్య, రవి, కోటేశ్వరరావు, కలాం, జానీ, అన్సారి, మధు, వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై9, ప్రభాతవార్త:** వర్సిటీలో రాష్ట్ర యస్‌టి కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా తాత్కాలిక వీసి ఆచార్య గంగాధరరావు, తాత్కాలిక రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని



యస్‌టి స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు రమావత్ అంజి నాయక్, ఉపాధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్‌లు చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో అధ్యాపకుల పోస్టుల భర్తీ, గెస్ట్ ఫ్యాకల్టీ, క్లాస్ 4 ఉద్యోగాలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, క్యాజువల్ వర్కర్స్,, పీహెచ్‌డి అడ్మిషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వర్సిటీల అందిస్తున్న యూఆర్ఎఫ్ సరిపోవడం లేదన్నారు. ఫీల్డ్ వర్క్‌లకు, హాస్టల్ మెస్‌బిల్లులకు అధనంగా బారం పడుతుందని పేర్కొన్నారు. మా సమస్యలు పరిష్కరించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యస్‌టి కేటగిరి విద్యార్థుల ప్రవేశాలు, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, యస్‌టి విద్యార్థులకు, ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? ఉద్యోగ నియామకాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు వాటి భర్తీకి తీసుకుంటున్న చర్యలు, నియమ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అనే వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ అధికారులు స్పందిస్తూ ఉద్యోగ నియామకాలు ఉన్నతవిద్యాశాఖ ఆదేశాల మేరకు రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తున్నట్లు వివరించారు, వర్సిటీలో యస్‌సి, యస్‌టి సెల్ ద్వారా ఎప్పటికప్పుడు ఆయా కేటగిరిల్లో ఉన్న వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సమావేశంలో తాత్కాలిక ఓఎస్‌డి ఆచార్య రవికుమార్, యస్‌సి, యస్‌టి సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ అబ్రహం లింకన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య పాల్ కుమార్ ఆచార్య లింగరాజు, వివిధ శాఖల అధికారులు, కోఆర్డినేటర్లు, వార్డెన్‌లు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

**తిరువూరు, జులై 9, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణం ఎన్ఎస్‌పి కాలనీ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న రాజుపేటకు చెందిన కోట ఆకాష్ (20), పోలిశెట్టిపాడుకు చెందిన నాగుల వైష్ణవ్ కుమార్ అలియాస్ చందు (19), నడిమి తిరువూరుకు చెందిన నాగవరపు కళ్యాణ్ అలియాస్ పికె (22), చింతల కాలనికి చెందిన చావల రాజు అలియాస్ తంబిరాజు (24), అక్కపాలెంకు చెందిన కంచపోగు వెంకటేశ్వరరావు



అలియాస్ వెంకి (24) అనే అయిదుగురు నిందితుల నుండి ఒక్కొక్కరి దగ్గర ఒక కిలో చొప్పున 5కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను తిరువూరు సిఐ గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బృందం అరెస్ట్ చేయడం జరిగింది. ఈ రైడ్‌ను తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, విఆర్వోలు సత్తార్, నాగులు మీరా సమక్షంలో నిర్వహించారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ క్రమంలో సిఐ మాట్లాడుతూ గంజాయి తదితర మత్తు పదార్థాలు కలిగి వుండడం మరియు రవాణా చేయడంలాంటి సమాచారం తెలిస్తే పోలీస్‌వారికి సమాచారం అందించాలని తెలిపారు.

**నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి**
(ఎస్టాబ్లిష్‌డ్ ఇన్ : 1967. Regd. No. 56 of 1967) "జె.కె.సి. కాలేజ్ క్యాంపస్", గుంటూరు - 6.
**విద్యాసంస్థల అభివృద్ధికై విరాళముల కొరకు విజ్ఞప్తి**

గుంటూరులో సాధారణ, సాంకేతిక మరియు ఉన్నతవిద్య ప్రధానోద్దేశ్యంగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి 1967వ సంవత్సరములో స్థాపించి, అదే సంవత్సరము భారత సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం క్రింద రిజిష్టర్ చేయబడినది. నేడు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి, గుంటూరు వారి ఆధ్వర్యములో విజయవంతంగా నడుపబడుచున్న (1) జె.కె.సి. కాలేజి, గుంటూరు (2) డా.కె.ఎల్.పి. పబ్లిక్ స్కూలు, గుంటూరు (3) ఆర్.వి.ఆర్.ఆర్. కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, గుంటూరు (4) ఆర్.వి.ఆర్. & జె.సి. కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, చౌడవరము (5) జె.సి. కాలేజి ఆఫ్ లా, గుంటూరు(6) చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, చౌడవరము (7) మాదల శకుంతల భాస్కర్ కాలేజి ఆఫ్ నర్సింగ్, గుంటూరు విద్యాసంస్థల అభివృద్ధికి (అదనపు) పి.జి. కోర్సులు, అదనపు తరగతులు ప్రారంభించుటకు మరియు అదనంగా వసతి ఏర్పాట్లు, నూతన ప్రయోగశాలలు, ఎక్విప్ మెంట్, హాస్టల్స్, నూతన తరగతి గదులు ఇతరములైన సౌకర్యములు కల్పించుటకు) విరాళములు అందజేయవలసినదిగా పారిశ్రామిక, వ్యాపారసంస్థలకు, సేవా ట్రస్ట్ లకు, వితరణ శీలురైన ప్రజలకు, మా విద్యాసంస్థలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థినీ, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, విద్యావ్యాప్తికి దోహదము చేయతలచిన ప్రతి ఒక్కరికి వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

విరాళములు అందచేయువారు తమ విరాళములను "నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి, గుంటూరు" పేరున అకౌంట్ పేయి డిమాండ్ డ్రాఫ్ట్ / బ్యాంకర్స్ చెక్ / పే ఆర్డరు / ఆర్.టి.జి.ఎస్. / చెక్ ల ద్వారా కవరింగ్ లెటరుతో అందజేయవలసినదిగా మనవి.

వీటిపై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80-జి క్రింద మినహాయింపు లభిస్తుంది.

గుంటూరు
తేది : 09-07-2025 నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి యాజమాన్యము

## ఎన్‌హెచ్-30 పనులను పరిశీలించిన జెసి

**ఎ కొండూరు, జులై 9, ప్రభాతవార్త :** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు'ల ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మైలవరం ఎ కొండూరు తిరువూరు మీదుగా జగదల్‌పూర్ వెళ్లే జాతీయ రహదారి-30ని రామచంద్రాపురం గ్రామం వద్ద ఎన్‌హెచ్-30పై గత శతాబ్ద కాలంగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను ఎన్‌టిఆర్ జిల్లా (విజయవాడ) జాయింట్ కలెక్టర్ జెసి ఇలక్కియా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విస్తరణ పనుల్లో కొందరు గృహ నిర్వాసితులకు న్యాయపరమైన నష్టపరిహారాన్ని త్వరలో అందించి అర్హులైన వారందరికి ప్రభుత్వ ఇళ్ల స్థలాలు కేటాయించడం జరుగుతుందని జెసి ఇలక్కియా తెలిపారు. గత ఎన్నో ఏళ్లుగా జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోయి దుమ్ము ధూళి వల్ల ఈ ప్రాంత ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసే విధంగా ఎన్‌హెచ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడారని సాధ్యమైనంత త్వరలో విస్తరణ పనులు పూర్తి చేసి నిర్వాసితుల మిగిలిన గృహాలను తొలగించి పనులు పూర్తి చేస్తామని జెసి ఇలక్కియ తెలిపారు. జెసి వెంట తిరువూరు ఆర్డీవో కె మాధురి, ఎ కొండూరు తహశీల్దార్ కాలి లక్ష్మి అధికారులు అనధికారులు పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి రోడ్డు అధ్వాన్న పరిస్థితిని ప్రమాదాల గురించి జెసి ఇలక్కియకు వివరించారు.



## రైతుల పరామర్శ పేరుతో గొప్పగా రక్తి కట్టిద్దామన్న జగన్ నాటకం అభాసుపాలైంది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,జులై9,ప్రభాతవార్త:** రైతుల పరామర్శ పేరుతో గొప్పగా రక్తి కట్టిద్దామన్న జగన్ నాటకం అభాసుపాలైందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల స్థానంలో కార్యకర్తలను ఉంచి బంగారు పాళ్యంలో వైసిపి చేసిన విన్యాసాలను ప్రజలు ఛీ కొట్టారన్నారు. పరామర్శలను కూడా పథకాలు, ప్రణాళిక ప్రకారమే చేయడం జగన్‌కే చెల్లిందని, తన హయంలో ప్రభుత్వ వాటాగా పంటల బీమాకు విడుదల చేయాల్సిన సొమ్ము, చంద్రబాబు ప్రశ్నించేవరకు ఇవ్వని జగన్ నేడు రైతుల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతాంగాన్ని ఆదుకోవటానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులపై ప్రతీకార చర్యలకు పాల్పడిన వ్యక్తి, రైతుల సంక్షేమంపై మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. మామిడిలో ఎన్నిరకాలు ఉన్నాయో, ఏ రకం చెట్టుకు ఎన్నికాయలు కాస్తాయో తెలియని వ్యక్తి మామిడి రైతులను పరామర్శించేందుకు వెళ్లాడని అన్నారు. పంట గురించి, సాగుగురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి పదవి కాంక్షతో రగిలిపోతూ మంచి చేస్తున్న ప్రభుత్వంపై జగన్ బురద చల్లుతున్నాడని విమర్శించారు.



**2019లో రైతులకిచ్చిన హామీలలో జగన్ ఏ ఒక్కటీ నెరవేర్చలేదు**

2019 ఎన్నికల ప్రచారంలో తాను ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో రైతు రాజ్యం వస్తుందని జగన్ ఊదరగొట్టింది నిజం కాదా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ప్రతి రైతు కుటుంబానికి పంటసాయంగా రూ 50వేలు ఆర్థిక సాయం చేస్తానని అన్నాడని, రాష్ట్రంలోని ప్రతి రైతుకు వడ్డీలేని పంటరుణాలు ఇస్తానని చెప్పాడన్నారు. ఉచితంగా బోర్లు వేయిస్తానని, వ్యవసాయానికి పగటిపూటే 9గంటలు ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తానని నమ్మబలికాడని ప్రత్తిపాటి తెలిపారు. రైతులు పైసా కట్టకుండా ప్రభుత్వమే పంటలబీమా చెల్లిస్తుందని, రూ 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని, రూ 4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయనిధి ఏర్పాటు చేస్తానని ఎన్నికల వాగ్దానం జగన్ ఇచ్చాడని అన్నారు. కానీ వీటిలో ఏ ఒక్క హామీని పాలనలో జగన్ అమలు చేయలేదని ప్రత్తిపాటి తెలిపారు. పైగా చంద్రబాబు అంతకుముందు రైతులకు సబ్సిడీపై అందించిన డ్రిప్, స్ప్రింకర్లు, యాంత్రీకరణ పరికరాలు, టార్పాలిన్లు, ట్రాక్టర్ల పంపిణీని జగన్ పూర్తిగా పక్కన పెట్టేశాడని అన్నారు. తన ప్రభుత్వం, పార్టీలోని వారు రైతులను అసభ్యపదజాలంతో తూలనాడినా, డ్రామాలాడుతున్నారని దెప్పిపొడిచినా, జగన్ రైతుల పక్షాన మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు అసెంబ్లీలో నేలపై కూర్చొని నిరసన తెలిపితే అర్ధరాత్రి ఆరకొరగా పంటలబీమా సాయం విడుదల చేయించిన వ్యక్తి జగన్ అనే అన్నారు. అలాంటి వ్యక్తి నేడు రైతులకు కష్టం వచ్చిందని, నష్టపోతున్నారని గగ్గోలు పెట్టడం కేవలం రాజకీయ డ్రామానేనని ప్రత్తిపాటి విమర్శించారు.

## రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబుదే

### -పార్లమెంట్ రైతు విభాగం ప్రధానకార్యదర్శి బొర్రు రామారావు

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందని టిడిపి గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన



కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకొన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తు.చ తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన వాగ్దానాలను సింహ భాగం అమలు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మిగిలి అన్నీ హామీలను అమలు చేసి ఇది మంచి ప్రభుత్వం అని పక్కాగా ప్రజల చేత అనిపించుకొంటామన్నారు. ఇప్పటికే ప్రజలందరూ ఇది మంచి ప్రభుత్వమని కితాబిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పూర్తిగా నిర్వీర్యానికి గురైందన్నారు. వైకాపా హయాంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగిందన్నారు. గాడి తప్పిన ప్రభుత్వాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అంతా ఇంతా కాదన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ:పాతాళానికి వెళ్లిందన్నారు. మళ్ళీ జవసత్వాలు తెచ్చేందుకు చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించి ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, చలమశెట్టి సీతారామయ్య, యక్కటి పద్మారావు, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులున్నారు.

## కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి : ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎఐటిసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఆరేటి రామారావు, పుప్పాల సత్యనారాయణలు డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 33మంది యువజన విద్యార్థిల బలిదానాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా నిలువరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, పోస్టల్, ఎల్ఐసి, ఓడరేవులను ప్రైవేటు పరం చేసి బడా వ్యాపార వేత్తలకు దారాదత్తం చేయడం మానుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఆటో రంగాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులను ఆదుకోవడానికి, ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంత పాటు





ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. ఇ చలానులను రద్దు చేయాలని, జీరో ఫైనాన్స్ వడ్డీలతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి నగర అధ్యక్షుడు గోవిందరాజులు అధ్యక్షత వహించారు. పట్టణంలో బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, కూచిపూడి రత్నబాబు, వెంకయ్య, ప్రసాద్, ప్రకాష్, సీతారామయ్య, ఆటోయూనియన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

### -జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతిబసు

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** గ్రామ పంచాయితీలలోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ వి.జ్యోతిబసు ఆదేశించారు.



మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గ్రామంలో మంచినీటి సరఫరా, ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పంచాయితీ పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. అదేవిధంగా చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుద్ధి చేసి రక్షిత మంచినీటిని అందించాలన్నారు. సిఈఓ వెంట ఇన్‌చార్జి ఎంపిడిఓ డిడివి నారాయణరావు, మండల డిప్యూటీ ఎంపిడీవో కెవెస్ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి పి.రవిబాబు, స్వచ్ఛ భారత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు, డిపిఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను ప్రతిష్టాత్మకంగా జరపాలి : ఎంపిడిఓ టి.ఊహారాణి

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** ఈ నెల 10వ తేదీన రెండవ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించాలని ఎంపిడిఓ టి.ఊహారాణి ఆదేశించారు. ఈ సమావేశం సజావుగా జరిగేందుకు ఇప్పటికే నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. నోడల్ అధికారులుగా చేబ్రోలు-1 టి.ఊహారాణి, చేబ్రోలు-2 ఆర్.చలపతిరావు, చేబ్రోలు-3 ఆర్.సుబ్బారావు, చేబ్రోలు-4 నాగరాజకుమారి, చేబ్రోలు-5 యం.అనసూయ, దొడవర్రు పి.శ్రీనివాసరావు,



మంచాల ప్రియదర్శిని,నారాకోడూరు-1 ఎ.ప్రసాద్, నారాకోడూరు-2 షేక్ ఫిరోజ్‌లాల్, శేకూరు డి.మీనాక్షి, శలపాడు రసూల్, సుద్దపల్లి కె.శ్రీలక్ష్మి, శ్రీరంగపురం ఐ.ఓబుల్‌రెడ్డి, వడ్లమూడి-1 యం.రవిశంకర్, వడ్లమూడి-2 మాధవి, వేజండ్ల-1 జి.ప్రసాదరావు, వేజండ్ల-2 మల్లికార్జునరావులను నియమించినట్లు చెప్పారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగేవిధంగా చూడాలన్నారు. నోడల్ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి ప్రభుత్వ మార్గదర్శకాలతో సూచించిన విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ కోరారు.

## పొదుపు చేయడం ప్రతి ఒక్కరి విధి

### -ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జరిగిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి సంపాదించిన సంపాదనలో ఇరవై శాతం పొదు చేయాలని భారతీయ రిజర్వుబ్యాంక్ ముఖ్య ఉద్దేశమన్నారు. అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషుల కంటే స్త్రీలు సంపాదనలో 84శాతం పొదుపు చేస్తున్నారన్నారు. ఖచ్చితమైన లావాదేవీలు నడపాలని, డిఫాల్టర్‌గా ఉండకూడదన్నారు. సిబిల్ స్కోర్ కలిగి బ్యాంకు ద్వారా రుణాన్ని పొంది వ్యాపారాభివృద్ధి





పొందాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడమనేది పొదుపు చేయడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే మరి కొంత మందికి రుణాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ల్యాంప్ సంస్థ రీసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రిసురక్ష లాంటి బీమా సౌకర్యాలను కలిగి ఉండాలన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సిటిమిషన్ మేనేజర్ డి.హనుమానాయక్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వాలంభ సాధించాలన్నదే ప్రభుత్వాల ఉద్దేశమన్నారు. అందుకోసమే పెద్ద ఎత్తున బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. సమైక్య సంఘాల గ్రూపులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తమ ప్రతిష్టను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ సిహెచ్ రావమ్మ, విశ్వనాధం, ఆర్.లక్ష్మి, సిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ నాగ పద్మావతి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** ఈ నెల 19వ తేదీ సాయంత్రం 3గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపిడిఓ డిడివి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని మండలస్థాయి అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా సమావేశంలో పాల్గొనాలని కోరారు. అన్నీ శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు. మండలంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు.

## కేంద్ర కార్మిక 11 సంఘాల పిలుపుమేరకు పట్టణంలో ప్రదర్శనలు చేసిన వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

**చిలకలూరిపేటటౌన్,జులై9,ప్రభాతవార్త:** కేంద్రకార్మిక 11 సంఘాల పిలుపుమేరకు జాతీయ సమ్మెలో బాగంగా ఏఐటియుసి, సిపిఐ, సిపియం ఆధ్వర్యంలో పట్టణంలోని బ్యాంకుల సిబ్బంది బుధవారం చేసిన ప్రదర్శనలోనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పేలూరి రామారావు, సిపిఐ నాయకులు నాయుడు శివకుమార్, శేషయ్య, వేములకొండ వెంకటేశ్వర్లు, కె సాంబయ్య, వీరాంజనేయులు, కృష్ణ, ఆటోరిక్షా నాయకులు, బ్యాంక్





యూనియన్ నాయకులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా పలు సంఘాలు, సిపిఐ నాయకులు కలసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మోడీ అమలుచేస్తున్న కార్మిక,కర్షక చట్టాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాలని, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మలా, ఐద్వా నాయకురాలు భారతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెంచయ్య, అంజయ్య, రైతు సంఘం నాయకులు చంద్ర కొండలరావు, ఎస్ నాగేశ్వరరావు, మల్లిఖార్జున్, బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గణపవరం వేణుగోపాలస్వామి దేవాలయంలో చోరి

**నాదెండ్ల,జులై9,ప్రభాతవార్త:** మండలంలోని గణపవరం గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం ఆర్ధరాత్రి దొంగలు పడ్డారు. వారు దేవాలయ గ్రిల్స్ తాళాలు పగుల గొట్టి దేవాలయంలోనికి ప్రవేశించి స్వామివారు, రుక్మిణి, సత్యభామలకు అలంకరించిన మూడు వెండికిరీటాలు, శంఖు



చక్రాలు, 24 గ్రాముల బంగారు అభరణాలు దోచుకొని వెళ్లారు. అదేవిధంగా దేవాలయ ఆవరణలో ఉన్న హుండీని పగులగొట్టి అందులోని నగదును కూడా దోచుకొని వెళ్లారు. మొత్తం సొత్తు విలువ రూ 5లక్షలు ఉంటుందని ఆలయ కమిటి నాయకులు, నాదెండ్ల పోలీసులకు పిర్యాదు చేశారు. నాదెండ్ల ఎస్ ఐ జి పల్లారావు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కౌలు రైతులు తప్పని సరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలి

### -మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు

**పొన్నూరు, జులై 9,ప్రభాతవార్త:** కౌలు రైతులు తప్పని సరిగా కౌలు రైతు కార్డులు(సీసీఆర్సీ) పొందాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని నిడుబ్రోలు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద ఈ నెల 13వ తేదీ వరకు ఆన్‌లైన్లో ఫిర్యాదును రైతులు చేసుకోవచ్చన్నారు. పంటల బీమాకు సంబంధించి గుంటూరు జిల్లా ప్రతినిధులు



ఫ్యూచర్ జనరేలి ఇన్సూరెన్స్ కంపెనీ వారు మాట్లాడుతూ వరి పైరుకు రూ.800ఎకరాకు చెల్లించాలన్నారు. బీమా చెల్లించినవారికి రూ.40వేలు ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం జరిగితే ఇన్సూరెన్సు పొందవచ్చన్నారు. లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ దయానాగ్రేస్ మాట్లాడుతూ రైతులకు వరిపైరులో విత్తన శుద్ధి గురించి వివరించారు. విత్తన శుద్ధి చేయడం ద్వారా చీడ పీడల నుంచి తప్పుకోవచ్చున్నారు. పాముపొడ తెగులు, అగ్గితెగుళ్ళను ముందస్తుగా నివారించుకోవచ్చున్నారు. నారు మడిలో ఒక సెంటుకు 160గ్రాముల కార్బోఫ్యురాన్ 3జి గుళికలు వేయడం వల్ల ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. వరిపైరులో ప్రతి 10అడుగులకు కాలి బాటలు తీయుడం వల్ల పైరుకు గాలి, సూర్యరశ్మి తగిలి దోమ ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, ఎంపీఈఓ షేక్ జయశ్రీ, వి.ప్రియాంక, ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా కోటేశ్వరరావు

**గుంటూరు లీగల్,జులై 9,ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా గుంటూరు జిల్లా కోర్టుల్లో ప్రాక్టీసు చేస్తున్న సీనియర్ న్యాయవాది యడ్లపల్లి కోటేశ్వరరావును నియమిస్తూ కమీషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు.వివిధ కేసుల్లో మూడేళ్ళపాటు గుంటూరు కోర్టుల్లో కార్పొరేషన్ తరపున ఆయన కేసులు వాదిస్తారు.నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం కోటేశ్వరరావుకు ఉత్తర్వులు అందించారు.ప్రస్తుత కౌన్సిల్ శ్యామల సుధాకర్‌రెడ్డి నుంచి ఆయన పూర్తి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

## మెగా టీచర్స్ పెరెంట్స్ మీట్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక పాల్గొనాలి

**గుంటూరు విద్య,జులై 9,ప్రభాతవార్త :** నేడు జరిగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అన్ని జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్‌లో ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక పాల్గొని వారి పిల్లల విద్యాభివృద్ధిపై ఉపాధ్యా యులతో మాట్లాడుకోవాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ సూచించారు.ఆ ఒక్కరోజు ఎన్ని పనులున్నా పక్కన బెట్టి ప్రత్యేక శ్రద్దతో ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా సమావేశానికి హాజరై పిల్లల విద్యా భవిష్యత్తుపై ఆలోచన చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈలాంటి మంచి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిసున్నందుకు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామస్థాయిలో ప్రణాళికలపై శిక్షణ

**యడ్లపాడు, జులై 9, ప్రభాతవార్త :** గ్రామ స్థాయి నందు సుస్థిర అభివృద్ధిని నూరు శాతం రాబోయే ఐదు సంవత్సరాలలో సాధించుటకు గాను 2025,26నుండి గ్రామస్థాయిలో ప్రణాళికలు తయారు చేయవలసి ఉంటుందని ఎంపీడీవో వి హేమలతాదేవి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలు నందు బుధవారం పంచాయితీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ 2.0 గాను 2023,24 సంబంధించి గ్రామ పంచాయితీ స్థాయిలో పంచాయితీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు మరియు మండల



స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో వి హేమలతాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ప్రధాన ఉద్దేశం గ్రామస్థాయిలో తొమ్మిది సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ అవి పేదరికంలేని మరియు మెరుగైన జీవనోపాధుల గ్రామం, ఆరోగ్య కరమైన గ్రామం, బలహిత పంచాయితీ, సంవృద్ధి నీరు ఉన్న గ్రామం, స్వచ్ఛ మరియు హరిత గల గ్రామం, స్వయం సమృద్ధి మౌళిక సదుపాయాలు గల గ్రామం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత గ్రామం, సుపరిపాలన గలిగిన గ్రామం, మహిళాహిత గల గ్రామం నందు నూరుశాతం రాబోయే ఐదు సంవత్సరాలలో సాధించుటకు గ్రామ స్థాయిలో ప్రణాళికలు తయారు చేయవల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌కే జాకీర్ హుస్సేన్, ఎన్‌విఎస్‌జిఎస్ బాపిరాజు పంచాయితీ కార్యదర్శి, మరియు డి వెంకట్రావు ప్యాకల్టీలుగా వ్యవహరించారు.

## సచివాలయ సర్వేర్ల బదిలీ

**యడ్లపాడు, జులై 9, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లాలోని గ్రామ సర్వేయర్ల (గ్రేడ్ 2) హేతుబద్ధీకరణ, వర్గీకరణ మరియు స్థానాలకు సంబంధించి జారీచేయబడిన ఉత్తర్వులను వారి వర్గం మరియు తదుపరి బదిలీల పోస్టింగ్‌ల ఆధారంగా తెలియజేయటం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వులు మరియు జిఎస్ అండ్ డబ్లూఎస్ శాఖ డైరెక్టర్ నుండి వచ్చిన సర్క్యులర్ సూచనల ప్రకారం బదిలీలు జరుగుతాయి. కౌన్సిలింగ్ తర్వాత బదిలీలు నిర్వహించటం జరిగింది. బదిలీ అయిన వారు వెంటనే వారి స్థానాలలో చేరవల్సి ఉంటుంది. మండల పరిధిలోని 11 సచివాలయాలలోని మార్పు చెందిన సర్వేయర్ల వివరాల ఈ విధంగా ఉన్నాయి. చెంఘీస్కాన్‌పేట సర్వేయర్ గండికోట భవాని ఉన్నవ, యడ్లపాడు 2 సర్వేయర్ షేక్ కాజా తిమ్మాపురం, యడ్లపాడు 1 సర్వేయర్ జిత్తా ఝాన్సీ తెనాలి మండలం నందివెలుగు 1, జాలాది సర్వేయర్ జోన్నలగడ్డ సునీల్‌కుమార్ నాదెండ్ల మండలం గొరజవోలు, కారుచోల సర్వేయర్ గడ్డం విద్యాసాగర్ చిలకలూరిపేట మండలం పసుమర్రు 1, కొండవీడు సర్వేయర్ బోడుపల్లి శ్రీను లింగారావుపాలెం, లింగారావుపాలెం సర్వేయర్ కట్టెబోయిన దేవేంద్రబాబు చెంఘీస్కాన్‌పేట, సొలస సర్వేయర్ సానం సందీప్ కొండవీడు, తిమ్మాపురం సర్వేయర్ సంకూరి రమేష్ జాలాది, తుర్లపాడు సర్వేయర్ షేక్ మహ్మద్ హుసేన్ నాదెండ్ల మండలం యండుగుంపాలెం, ఉన్నవ సర్వేయర్ చాతురాజుపల్లి కళ్యాణ్‌కుమార్ నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు సచివాలయాలకు బదిలీ అయినట్లు ఉత్తర్వులు కార్యాలయానికి రావటం జరిగింది.

## రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడి సమక్షంలో బిజెపిలో చేరిన గట్టా హేమకుమార్

చిలకలూరిపేట,జులై9,ప్రభాతవార్త: రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన మాధవ్ సమక్షంలో పల్నాడుజిల్లా బిజెపి అధ్యక్షుడు ఏలూరు శశికుమార్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గట్టా హేమకుమార్ బిజెపి పార్టీలో చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హేమకుమార్‌కు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి 100మంది కార్యకర్తలు పార్టీ కండువాలు



ధరించి రాష్ట్ర నూతన అధ్యక్షుడి సమక్షంలో నియోజకవర్గంలో పార్టీని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామని ప్రమాణం చేశారు.

## రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు పివిఎన్ మాధవ్‌కు శుభాకంక్షలు తెలిపిన ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు

**చిలకలూరిపేట,జులై9,ప్రభాతవార్త:** విజయవాడ భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో బుధవారం



బిజెపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పివిఎన్ మాధవ్ పదవీ భాద్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసరావు చిలకలూరిపేటకు చెందిన ముఖ్యనాయకులతో కలసి మాధవ్‌కు శుభాకాంక్షలు తెలియచేశారు. అదేవిధంగా రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర నాయకులు మధుకర్‌జి, సోము వీర్రాజు, ఎస్ దయాకర్‌రెడ్డి, తపనాచౌదరి, బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు శశికుమార్, శ్రీనివాస్ యాదవ్‌లను కలసి పలు విషయాలపై చర్చించారు.

## అమీన్‌సాహెబ్ పాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రచారం చేసిన తెదేపా నాయకులు

**నాదెండ్ల,జులై9,ప్రభాతవార్త:** మండలంలోని అమీన్‌సాహెబ్ గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో బాగంగా గ్రామ పార్టీ నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సంవత్సరకాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో, మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచనల మేరకు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలు, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల



గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు, బూత్ కన్వీనర్ పూనాటి సుధీర్, కో కన్వీనర్ గుర్రం రామారావు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 29వ వార్డులో రోడ్లు,కాలువలను పరిశీలించిన మునిసిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం

**చిలకలూరిపేట,జులై9,ప్రభాతవార్త:** మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని 29వ వార్డులో నిర్మించాల్సిన రోడ్లు, కాలువలను మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం పరిశీలించారు. ఆయనతోపాటు 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ జానీ, మోదిన్, చంద్ర,




ముల్లా కరిముల్లా, వార్డు అధ్యక్షులు షేక్ కరిముల్లా, ఆ వార్డుకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఆక్రమణలు వారం రోజులలోగా తొలగించాలి

### -మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు హెచ్చరిక

**చిలకలూరిపేట, జులై 9, ప్రభాతవార్త:** పట్టణంలో ఆక్రమణలకు గురైన రోడ్లు, ట్రాఫిక్ సమస్యలు, మరియు ప్రమాదాలపై బుధవారం మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు విలేకరులతో మాట్లాడుతూ నరసరావుపేట సెంటర్‌నుంచి నరసరావుపేటకు వెళ్లే దారిలో, టిడ్కో, పసుమర్రు ప్రాంతాలలో ఇళ్లు కేటాయించినప్పటికి ప్రజలు గుడిసెలు వేసుకొని



రోడ్లపైన వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా అడ్డరోడ్డు సెంటంలోనే కోటప్పకొండకు వెళ్లే రోడ్డులో షాపులు, కెబిరోడ్, నరసరావుపేట సెంటర్‌నుంచి రిజిస్ట్రార్ కార్యాలయం వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు అధికంగా ఉన్నాయని, దీనివలన ట్రాఫిక్ అంతరాయాలు, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వారంరోజులలోగా ఈ ఆక్రమణలను స్వచ్ఛందంగా ఆక్రమణ దారులు తొలగించు కోవాలని, లేని పక్షంలో మున్సిపాలిటి స్వయంగా రంగంలోకి దిగి అన్నింటిని తీసి వేయడం జరుగుతుందని కమీషనర్ పి శ్రీహరి బాబు హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు రోడ్లపై మార్కింగ్ చేయనున్నట్లు తెలిపారు. మార్కింగ్ దాటి రోడ్లపైకి వచ్చేవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించడం, కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా, పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మహాత్మాగాంధీ హాస్పిటల్‌లో కోమాలోకి వెళ్లిన వృద్ధురాలికి అరుదైన వైద్యం

**నరసరావుపేట , జూలై 9 ప్రభాతవార్త :** పట్టణంలోని మహాత్మాగాంధీ హాస్పిటల్‌లో కోమాలోకి వెళ్లిన 65 సంవత్సరాల వృద్ధురాలు కొండపోగు కమలమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్



అయినట్టు వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలను బుధవారం వైద్యశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్యతో కలిసి తెలియజేశారు. కమలమ్మ తీవ్రమైన తలనొప్పి, మూర్ఛలు వచ్చి కోమాలోకి వెళ్లడం జరిగిందన్నారు. మెదడుకు పూర్తి -డ్యామేజ్ జరిగినట్టు, తలలోని ఒక రక్తనాళం ఉబ్బిపోయి పగిలినట్టు వైద్య పరీక్షల్లో గుర్తించడం జరిగిందన్నారు. అటువంటి పరిస్థితులలో ప్రాణాపాయం ఖచ్చితంగా ఉంటుందన్నారు. పల్నాడులోనే మొదటిసారిగా ప్రత్యేక శస్త్ర చికిత్సతో పాటు రక్తనాళాలు మూసుకుపోకుండా మెదడు రక్తనాళాలలోకి ప్రత్యేక ఇంజక్షన్లను ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పాటు రెండు సార్లు ఈవిడి అనే మెదడు వాపును తగ్గించే శస్త్ర చికిత్స చేశామన్నారు. సుమారు రెండు నెలల పాటు వెంటిలేటర్‌పై శ్వాస తీసుకోవడం జరిగిందన్నారు. పూర్తి చికిత్స అనంతరం వైద్య ప్రక్రియలో అద్భుతంగా కమలమ్మ రికవరీ కావడం, పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వెళ్ళడం జరిగిందని హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య లు తెలియజేశారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ సుధీర్ చక్రవర్తి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అనీల్‌రెడ్డి వైద్యసేవల్లో సహకారం అందించారని వారు వివరించారు.

# బాలల హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించేది లేదు

### రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి

**బాపట్ల,జులై09,ప్రభాతవార్త:** బాలల హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులుబత్తుల పద్మావతి తెలిపారు.కర్లపాలెం మండలం,బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ముందుగా బాపట్ల మున్సిపల్ హై స్కూల్ ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖితో సంభాషించి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను కంగా వ్రాయించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్స్ ను మరియు విద్యార్థులు అటెండెన్స్ ను మరియు ఉపాధ్యాయుల అటెండెన్స్ పరిశీలించి డ్రాప్ అవుట్ చిల్డ్రన్స్ పై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని,బాలబాలికలు తప్పనిసరిగా స్కూల్ జీవితాన్ని అనుభవించాలని దానికి సిబ్బంది కృషి చెయాలని ప్రిన్సిపాల్‌కి ఆదేశాలు జారీచేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకమును పరిశీలించి మెనూ రిజిస్టర్ ప్రకారం ఆహార పదార్థములను తనిఖీ నిర్వహించారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారి హక్కులకు భంగం కల్గిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ తగు చర్యలు తీసుకుంటుందని బాలల హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం కర్లపాలెం మండలం గణపవరం జడ్పీ హైస్కూల్ లను అకస్మకంగా తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్కూల్ ప్రాంగణంలో విద్యార్థుల చేత పనులు చేయించడం గురించి హెచ్ఎం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా సంభాషించి వారి నుండి ఉపాధ్యాయుల



ఏ విధంగా లెసన్స్ పాటలు చెపుతున్నారు ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకున్నారు అనంతరం స్టాక్ రిజిస్టర్ మరియు వంటగదులను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించి వాటిని రుచి చూసి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి మెనూ ప్రకారం రుచికరమైన ఆహార పదార్థాలు వండి పెట్టించాలని లేనియెడల బాలల హక్కులకు ఎటువంటి భంగం కలిగిన వారి పట్ల నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ ఆదేశించారు.గణపవరంలోని ఏలిమెంటరీ స్కూల్ ను రిజిస్టర్స్ మరియు స్టాక్ రిజిస్టర్స్ అకస్మిక తనిఖీ చేశారు.అనంతరం కర్లపాలెం మండలం కర్లపాలెం గ్రామం నందు గల కర్లపాలెం హై స్కూల్ ను అకస్మిక తనిఖీ నిర్వహించారు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క సమస్యల గురించి తెలుసుకొని యాజమాన్యం విద్యార్థులకు తగు అనుకూల వాతావరణాన్ని తరగతి గదులను అందుబాటులో ఉంచాలని స్కూల్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా బాలబాలికలకు తగినన్ని బాత్‌రూమ్స్ ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. స్కూల్ ఫీజు వివరాలను స్కూల్ కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చెయాలని ప్రతి తరగతి గది నందు 1098 టోల్ ఫ్రీ నెంబర్ డిస్ప్లే చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. బాల బాలికల కు వారి హక్కులకు భంగం కల్గిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలియజేసారు.అనంతరం బాపట్ల నందు గల బాలికల గురుకుల పాఠశాల ను అకస్మిక తనిఖీ నిర్వహించారు ముందుగా సాయంత్ర స్నాక్స్ ను పరిశీలించారు స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు తరువాత విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన భావాలతో ఉండాలని అందరికి 1098 తెలిసి ఉండాలని సెల్ఫ్ ప్రొటెక్షన్ స్కిల్ కల్గి ఉండాలని తెలియజేసారు. వ్యక్తి గత పరిశుభ్రత చాలా ముఖ్యం అని బాలల హక్కులు పూర్తిగా పొందుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జిసిడివో చారులత, డీసీపీవో. పురుషోత్తమ రావు కర్లపాలెం ఎమ్ఈవో 1 రాజశ్రీ మరియు సిబ్బంది పాల్గొన్నారు

## తెదేపా కార్యకర్తను పరామర్శించిన డాక్టర్ ఆదిత్య

**నరసరావుపేట, జూలై 9 ప్రభాతవార్త :** తెలుగు దేశంపార్టీ కార్యకర్తను బుధవారం శాసనసభ్యులు డాక్టర్



చదలవాడ అరవిందబాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య పరామర్శించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కార్యకర్త ఆనంద్‌ను డాక్టర్ ఆదిత్య పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యసేవల వివరాలను తీసుకొని మెరుగైన చికిత్స అందించ వాలని ఏరియా హాస్పిటల్ వైద్యులను కోరారు. అదే విధంగా వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు ఆనంద్ కుటుంబానికి భరోసాను కల్పించామని డాక్టర్ చదలవాడ ఆదిత్య తెలియజేశారు.

## ఇస్సపాలెం అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**నరసరావుపేట, జూలై 9 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న



శ్రీ మహాంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కార్య నిర్వాహణాధికారి నలబోలు మాధవిదేవి తెలియజేశారు. పట్టణానికి చెందిన రాజనాల జగన్నాధరావు జ్ఞాపకార్ధం ఆయన ధర్మపత్ని పార్వతీదేవి ఆలయ నిర్మాణానికి రూ.1,00,116లను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం వేగంగా జరుగుతుందని తెలిపారు. అదే విధంగా దాతలు అందించే ఆర్థిక సహకారానికి సంబంధించి ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపును ఇస్తుందని ఈవో నలబోతు మాధవిదేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాతలు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు

**నరసరావుపేట టౌన్, జూలై 9 ప్రభాతవార్త :** ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా



సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు చెందిన డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటి లెక్చువల్ ప్రాపర్టీ హక్కులను ఎలా పొందాలి, కొత్త ఆవిష్కరణలకు పేటెంట్ ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే విషయాలను వివరించారు. అలాగే స్టార్ట్‌అప్‌లు, యువ పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఇ రంగం ద్వారా లభించే ప్రయోజనాలను తెలియజేశారు. సెక్రటరీ అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సహకారం అందించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అందించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆవిష్కరణలకు అవకాశాలపై అవగాహనను ఇటువంటి కార్యక్రమం ద్వారా అందజేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మల్లికార్జున్, కె.కృష్ణారెడ్డి, భార్గవ భూషణ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో వైఎస్ఆర్ 76వ జయంతి

**రొంపిచర్ల, జూలై 9 ప్రభాతవార్త :** మండలంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైకాపా కార్య నిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మండల కేంద్రమైన రొంపిచర్లతో పాటు రామిరెడ్డిపాలెం, బుచ్చిపాపన్నపాలెం, వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, మునమాక, ఇక్కుర్తి, అల్లూరివారిపాలెం, బసికాపురం, పమిడిమర్రు గ్రామాలలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ అందించిన సేవలను కొనియాడారు. పేదల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయే 104, 108, ఆరోగ్యశ్రీ, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. వారి బాటలో నడుస్తూ వైఎస్సార్ ఆశయసాధన కోసం ఆయన తనయుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను అందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విత్తనాల షాపులను తనిఖీ చేసిన అధికారులు

**నరసరావుపేట టౌన్, జూలై 9 ప్రభాతవార్త :** పట్టణంలోని పలు విత్తనాల షాపులను బుధవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారిణి శాంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాపులలో



లైసెన్సులు, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులను అందజేయాలన్నారు. తయారీ తేది, గడువు తేది, లాట్ నెంబర్ తప్పనిసరిగా వేయాలని దుకాణదారులకు తెలియజేశారు. వరిలో రైతులకు అవసరమైన జేజిఎల్ 384 విత్తనం రకం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని దుకాణదారులకు సూచించారు. విత్తన చట్టం 1966 ప్రకారం డీలర్లు వ్యవహరించాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## సార్వత్రిక సమ్మె విజయవంతం

**నరసరావుపేట, జూలై 9 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. నాయకులు కాసా



రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, అంజిరెడ్డితో పాటు సిఐటియు నాయకులు పాల్గొని మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయం వరకు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసిన ఉద్యోగులు, కార్మికులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వేతనాలను సవరించాలన్నారు. దేశ సంపదను ఆదానీ, అంబాని వంటి కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసే కుట్రలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను తొలగించేందుకు ప్రయత్నిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

## నేడు పట్టణంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**నరసరావుపేట టౌన్, జూలై 9 ప్రభాతవార్త :** పట్టణంలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారి రఫీ బుధవారం తెలియజేశారు. డి-1 పరిధిలోని బరంపేట, ఏనుగులబజార్, కోట సెంటర్, సత్తెనపల్లి రోడ్డు ప్రాంతాలలో సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారి రఫీ కోరారు.

## సత్తెనపల్లిలో విజయవంతంగా కార్మిక సమ్మె

**సత్తెనపల్లి, జూలై 9 ప్రభాతవార్త :** దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం, సంక్షేమ సౌకర్యాలు అమలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలన్నారు. ఉద్యోగ రక్షణ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. పని గంటలు, నియంత్రణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర అంశాలతో పాటు ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను



కార్పోరేట్‌లకు దోచిపెట్టే విధానాలు ఆపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంభాల శ్రీనివాస్, నరిశేటి వేణుగోపాల్, మస్తాన్, ఈసిరెడ్డి అంజిరెడ్డి, ఆర్.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, షేక్.మహబూబ్ సుభాని, పెదకూరపాడు బాబు, చెన్నారావు, దారా మరియదాసు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడిలో విజయవంతమైన సార్వత్రిక సమ్మె


**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కారంపూడి పురవీధుల్లో ర్యాలీ, రాస్తారోకోలు సీపీఐ మండల కారదయదర్శి సైదా ఆధ్వర్యంలో విజయంతం చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ ఎంఎల్, ఏఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఆశ వర్కర్లు, వీఏలోలు ఈ సమ్మెలో పాల్గొన్నారు.




ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లయినా కార్మికులకు, కర్షకులకు చేసిందేమీ లేదన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే నాలుగు కోడ్‌లను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు నెలకు 26 వేల జీతం ప్రకటించాలని, ఆశ వర్కర్లకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ నాయకులు జక్కంపూడి పద్మ రైతుకార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సూర్య హనుమంతరావు, రైతు నాయకులు గాలం శ్రీనివాసరావు, ఐఐటీసీ నాయకులు నూనె వెంకటేశ్వర్లు, ఎఫ్టుయూ నాయకులు రామ్మూర్తి, నరసమ్మ, వీఏఓ నాయకులు, ఆశ వర్కర్లు నాయకురాలు అనురాధ, విజయలక్ష్మి, యేసమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**బాపట్ల,జులై9,ప్రభాతవార్త:** గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మండల పరిధిలోని కప్పలవారిపాలెం గ్రామం, నాగరాజు కాలువ వద్దకు సుమారు 25సంవత్సరాల నుండి 30సంవత్సరాల వయస్సు కలిగిన ఒక గుర్తు తెలియని మగ మృతదేహం నీటిలో కొట్టుకొని వచ్చిందన్నారు.మృతుని వంటిపై డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. మృతదేహం యొక్క ఆచూకి తెలిస్తే సమాచారాన్ని బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన కోరారు.ఈ మేరకు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి

**కర్లపాలెం,జులై9,ప్రభాతవార్త:** రైతులు పంట వేసేముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని తద్వారా తెగుళ్లను నివారించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు ధనరాజ్ అన్నారు.బుధవారం కర్లపాలెం మరియు పెదపులుగువారిపాలెం గ్రామాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాన్ని ఎంచుకునేటప్పుడు మేలైన రకాలను ఎంచుకోని, విత్తే ముందు మొలక శాతం పరీక్షించుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే రైతులు మేలైన రకాలైన బిపిటి 2782, బిపిటి 2846, ఎమ్‌టియు 1318, ఎమ్‌టియు 1262, ఎమ్‌టియు 1232 వంటి రకాలను ఎంచుకోవాలని, ఇవి పురుగు మరియు తెగుళ్లను తట్టుకొని కాండం దృఢంగా ఉండి చేను పడిపోని రకాలని తెలిపారు. కౌలు దారులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు అయ్యే పథకాలు వర్తించాలన్నా, అన్నదాతా సుఖీభవ పడాలన్నా, పంట నమోదు చేసుకోవాలన్నా కౌలు కార్డు తప్పనిసరి అని సూచించారు. రైతులు అందరూ తప్పనిసరిగా పంటల బీమా ఆగస్టు 15 వ తారీఖు లోపల రైతు సేవా కేంద్రాలలో లేదా కామన్ సర్వీసు సెంటర్లలో పంటల బీమాకి సంబంధించిన ప్రీమియం కట్టుకోవాలని, దానికి గాను పంట విస్తీర్ణానికి సంబంధించిన సర్టిఫికేట్ వ్యవసాయ సిబ్బంది దగ్గరనుంచి పొంది ఉండాలని సూచించారు. రైతులందరూ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకూ అర్హులైన రైతుల వివరాలు అన్ని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచారని, ఇంకా అర్హులైన రైతులు అన్నదాతా సుఖీభవలో అర్జీ పెట్టుకోవడానికి ఇప్పుడు అవకాశం ఉందని, రైతులు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ మరియు పొలానికి ఆధార్ లింక్ చేయించుకొని, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్, విస్తరణ అధికారి భాగ్యలక్ష్మీ గ్రామ వ్యవసాయ సహాయకులు లివింగ్స్టన్, భ్రమరాంబదేవి మరియు రైతులు పాల్గొన్నారు.

## అత్యధిక మైలేజ్‌తో అత్యధిక లాభాలనందించే మహీంద్రా ఫ్యూరియో 8

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** మహీంద్రా అధునాత ప్లాంట్‌లో తయారైన ఫ్యూరియో 8 వాహనం, ఎల్సీవి సెగ్మెంట్లో వివిధ అవసరాలకు అనుగుణంగా 4టైర్ కార్గో, 6టైర్ కార్గొ అనే రెండు వేరియంట్లలో లభిస్తుందని మహీంద్రా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు వినోద్ సహాయ్ తెలిపారు. అత్యుత్తమ మైలేజ్, అత్యధిక పేలోడ్ సామర్థ్యం, సౌకర్యం, సదుపాయం, భద్రతతో అధునాతన క్యాబిన్ తదితర ఫీచర్లతో లభిస్తుందన్నారు.

## శాంసంగ్ నుండి అత్యంత తేలిక, మన్నికైన స్మార్ట్‌ఫోన్లు

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** అత్యంత తేలిక, మన్నిక కలిగిన ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను ఈనెల 9న న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో విడుదల చేసినట్లు సామ్‌సంగ్ కంపెనీ డివైస్ ఎక్స్పీరియన్స్ డివిజన్ యాక్టింగ్ హెడ్ టిఎం రోహ్ వెల్లడించారు. తమ ఇంజనీర్లు, డిజైనర్లు గెలాక్సీ జడ్‌సిరీస్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను అద్భుతంగా రూపొందించారన్నారు.

## అమేజాన్ పేతో ప్రతి కొనుగోలును తెలివైన డీల్‌గా మార్చుకోండి

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** ఈనెల 12 నుండి 14 వరకు 2025 ప్రైమ్‌డే లో 72 గంటలపాటు కొత్త విడుదలలు, బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఆఫర్లను అందుకోవాలని అమేజాన్ ఇండియా ప్రతినిథులు తెలిపారు. అమేజాన్ పే ని ఉపయోగించి రోజువారి అవసరాలు, గిఫ్ట్‌కార్డ్ వరకు మీ రూపాయికి మరింత విలువను పెంచుకోండన్నారు.

## బదిలీపై వెళ్తున్న సురేష్ మాస్టర్‌కు సన్మానం

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** కారంపూడి మండలం పెదకొదమగుండ్ల మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన బి.సురేష్ మాస్టర్ బదిలీపై వెళ్లిన సందర్భంగా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ ఛైర్మన్ బండ్ల అప్పారావు, ప్రస్తుత ఛైర్మన్ బాబులాల్, ఉపాధ్యాయులు వేణుబాబు, వెంకటకోటయ్య, రాంబాబు, వీరాంజనేయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## దాతల సహకారంతో వైద్యశాలలో అన్నదానం

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** దాతల సహకారంతో ప్రతినెలా 9వ తేదీన వైద్యశాలలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు అన్నప్రసాద కమిటీ తెలిపింది. కారంపూడి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణులకు, ఆశ వర్కర్లు, పేషెంట్లు, ఏఎన్ఎం, వైద్యసిబ్బందికి సుమారు 200 మందికి అన్నదానం చేశారు. దాతలు వెలుగూరు శేషారావు, భారతి, అశోక్‌కుమార్, శ్వేతలు సహకరించినట్లు అన్నప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు తెలిపారు. కార్యక్రమంలో మహిళా కమిటీ సభ్యులు చిన్ని



లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, పల్లా పద్మ, కొల్లిపర వెంకటలక్ష్మికుమారి, సూరే ధనలక్ష్మి, గుండా మహేశ్వరి, ఆతుకూరి అంజలి, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు ఎం.రమ్య, కె.లక్ష్మీమౌనిక, సీహెచ్ఓ కె.మల్లయ్య, హెచ్‌వీ వెంకటమణి, హెల్త్ అసిస్టెంట్ లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడి మండల సొసైటీ ఛైర్మన్‌గా రామకృష్ణ నియామకం

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** కారంపూడి మండల సొసైటీ అధ్యక్షులుగా కారంపూడికి చెందిన నాగరపు రామకృష్ణ, డైరెక్టర్లుగా చినకొదమగుండ్ల గ్రామానికి చెందిన వెన్నా హనిమిరెడ్డి, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఉన్నం రామయ్యలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బీసీ సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎంపికైనవారు ఎమ్మెల్యేకు, కారంపూడి మండల టీడీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నియమితులైన వారికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



## కారంపూడి మండలస్థాయి అధికారులకు శిక్షణ


**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు



కారంపూడి మండలస్థాయిలో సుస్థితద అభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోగతిని సాధించే దిశగా మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు దిశానిర్దేశం చేశారు. ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పురోగతి సూచికలో సాధించాల్సిన తొమ్మిది ముఖ్యాంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తహశీల్దారు శ్రీనివాసనాయక్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి కసిన్యానాయక్, సీహెచ్ఓ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి పోట్ల నరసింహారావు, వెలుగు ఏపీఎం నరసింహారెడ్డి, స్వచ్ఛాభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, మలేరియా సూపర్‌వైజర్ లాలునాయక్, కార్యాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త మృతికి నాయకుల సంతాపం

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ సయ్యద్ మస్తాన్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు బుధవారం వారి గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరు పుల్లయ్య, గోళ్ల సురేష్‌యాదవ్, మాదల సత్యనారయణ, కొండపల్లి అప్పారావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పంగులూరు లక్ష్మయ్య, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ,



## అల్ట్రాటెక్ గనికి 5స్టార్ రేటింగ్

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** సుస్థిర మైనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌కు చెందిన 13 సున్నపు రాయి గనులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, గనుల మంత్రిత్వ శాఖ ద్వారా గురి_ంపును ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా అల్రాటెక్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, బాలాజీ సిమెంట్ వర్క్స్‌లో భాగమైన బూదవాడ లైమ్‌స్టోన్ కు ప్రతిష్టాత్మక 5స్టార్ గుర్తింపును కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అందించి సన్మానించారు.



## వర్షాకాలానికి ఆయుర్వేద ఆహారం శ్రేష్టం

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** సరైన చర్మ ఆరోగ్యాన్ని సహజమైన సరళమైన నివారణలను ఆశ్రయించాలని ఆయుర్వేద నిపుణురాలు డా మధుమిత కృష్ణన్ సిఫార్సు చేస్తున్నారు. బాదం, హెర్బల్‌టీలు, పసుపు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా వాత, పిత్త, కఫాలు సమతుల్యం చేసుకోవాలన్నారు. కాలానుగుణంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలు, నెయ్యి వాడాలన్నారు.

## చంద్రబాబు ఏడాదిపాలన
## రాష్ట్ర ప్రగతికి బాట వేసింది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, జులై 9,ప్రభాతవార్త:** జగన్ విధ్వంస, విద్వేష పాలననుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడంతోపాటు ప్రజల సంతృప్తి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేసేలా ఏడాదిలో కూటమి ప్రభుత్వం గొప్ప విజయాలు సాధించిందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 34,35 వార్డులలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరిగి ప్రజలతో మమేకమై, కూటమి ప్రభుత్వ ఏడాది ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి ప్రత్తిపాటికి స్వాగతం పలికారు. జగన్ ఐదేళ్ల పాలనలో సాధించలేనిది చంద్రబాబు ఏడాదిలోనే సాధించారని, కూటమి ప్రభుత్వ సుపరిపాలనను ప్రజలకు అర్థమయ్యేలా పార్టీ శ్రేణులు వివరించాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు. వైసిపి నాయకుల్లా మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించలేదని, అందరం గర్వంగా చెప్పుకునేలా మన నాయకుడు సంవత్సరంలోనే ఎన్నో మంచిపనులు చేశారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త, నాయకుడు కాలర్ ఎగరేసి గర్వంగా చంద్రబాబు చేసిన మంచిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. జగన్ దుర్మార్గపు పాలన ఆనవాళ్ల చెరిపేయడంతోపాటు ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసేలా చంద్రబాబు ఏడాదిపాలన సాగిందని అన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టి, సరికొత్త నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి బాటలు వేశాయని ప్రత్తిపాటి తెలిపారు. టిడిపి శ్రేణులు ఐక్యంగా ఉండి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ఎంత అవసరమో వారికి అర్థమయ్యేలా చెప్పాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రజలతో పాటు కార్యకర్తలకు ఎలా మేలు చేయాలో చంద్రబాబు, లోకేష్‌లకు బాగా తెలుసునని ప్రత్తిపాటి వివరించారు. ఇప్పటికే వారిద్దరూ ఆ దిశగా ఆలోచన చేశారని తెలిపారు

## కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి,సంక్షేమం : ఎమ్మెల్యే నరేంద్రవర్మ

**పిట్టలవానిపాలెం, జులై 9,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళులాగా భావించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం మండలం సంగు పాలెం గ్రామంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొని ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి,పెట్టుబడులు,



సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కరపత్రాలను ప్రజలకు అందించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులకు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలనే సంకల్పంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యాక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్క్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు అఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడియాల వర ప్రసాదరావు, క్లస్టర్ ఇన్ ఛార్జ్ వెంకటపతిరాజు, సీనియర్ నాయకులు లోకయ్య, గ్లోరి యానెట్, మరియు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జ్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిఘా కీలకం

**బాపట్ల, జులై9,ప్రభాతవార్త:** అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణలో డ్రోన్ల ద్వారా నిఘా కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 6 డ్రోన్లను



దాతలు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా సంబంధిత పోలీస్ అధికారులకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న ఆలోచనలతో ప్రేరణ పొందిన దాతలు, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నిఘా, విపత్తుల నిర్వహణ కోసం సామాజిక బాధ్యతతో, సేవా దృక్పథంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డిజెఐ మిని3 డ్రోన్లను జిల్లా పోలీస్ శాఖకు బహూకరించారు. పోలీస్ శాఖ తరపున దాతలను జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌కు రాఘవేంద్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ తరపున కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి ఒక డ్రోన్, నిజాంపట్నంలోని ఏ.బి.ఏ.డి ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు బ్లూ పెర్ల్ మెరైన్ కంపెనీలు సంయుక్తంగా మరో డ్రోన్, మొత్తంగా రెండు డ్రోన్లను బహూకరించారన్నారు. రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌కు రేపల్లెలోని డి.పి.ఎస్ ఫుడ్స్ సంస్థ ఒక డ్రోన్, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌కు కొల్లూరు మండలం జువ్వలపాలం చెందిన వేములపల్లి రవికిరణ్ ఒక డ్రోన్, చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌కు చెరుకుపల్లి మండలంలోని ఎన్ఎస్ఎల్ టెక్స్టైల్స్ ఒక డ్రోన్, వేమూరు పోలీస్ స్టేషన్‌కు హైదరాబాద్‌కు చెందిన యోషిత హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక డ్రోన్ బహూకరించారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని స్మార్ట్ పోలీసింగ్ వైపు అడుగులు వేస్తున్న జిల్లా పోలీస్ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ఈ డ్రోన్లు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు డ్రోన్లు ఎంతగానో ఉపయుక్తమవుతున్నాయన్నారు. వివిఐపీ బందోబస్తు, బహిరంగ సభలు, తిరునాళ్ళు, ఊరేగింపుల వంటి కార్యక్రమాల్లో జన సమూహాన్ని పర్యవేక్షించేందుకు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్‌ల వినియోగించడం జరుగుతోందన్నారు. అలాగే మారుమూల ప్రాంతాల్లోని పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేసే వారిపై నిఘా ఉంచడంలో డ్రోన్ల వాడకం కీలకమన్నారు. పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రాంతాల్లో పరిస్థితుల్ని అంచనా వేయడానికి డ్రోన్లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. దాతలు కొత్తగా అందజేసిన 6 డ్రోన్లను రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌కు - 1, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌కు - 1, చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌కు - 1, వేమూరు పోలీస్ స్టేషన్‌కు - 1, నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌కు - 2 చొప్పున అందజేశామని తెలిపారు. డ్రోన్లను సమర్థవంతంగా వినియోగించుకుని నేర నియంత్రణలో పటిష్టంగా వ్యవహరించాలని సంబంధిత పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## వర్సిటీలో ఘనంగా ఏబివిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జులై9, ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వర్సిటీ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ మాట్లాడుతూ జులై9న విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవంను విద్యార్థి దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం వర్సిటీ మెయిన్ గేట్ వద్ద జెండా ఆవిష్కరణ చేసినట్లు వివరించారు. విద్యార్థి సమస్యలపై నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2కె రన్, రక్తదాన శిభిరం, ఉచిత ఐక్యాంప్ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా సాక్ష్యం స్టేట్ సెక్రటరి వి.రామారావు పాల్గొని మాట్లాడారు. దేశం కోసం విద్యార్థులను తయారు చేస్తున్నది విద్యార్థి పరిషత్ అన్నారు. కామర్స్ డీన్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ లో ఏబివిపి ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం కోసం ఏబివిపి కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర సోధ్ కన్వీనర్ రమాకాంత్, వర్సిటీల కన్వీనర్ గంగాధర్, ఎస్ఎఫ్‌డి రాష్ట్ర కో కన్వీనర్ శివ గణేష్, డాక్టర్ యం.వి.రమణలు మాట్లాడారు.

## శివాలయం చైర్మన్ "బోగి"ని పరామర్శించిన దానబోయి

**మంగళగిరి, జులై 9, ప్రభాతవార్త** :మంగళగిరి ద్వారకా నగర్ చెందిన గుండెకు స్టంట్ వేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న స్థానిక శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి



వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి కోటేశ్వరరావును బుధవారం రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్, ఉపాధ్యక్షుడు రేఖా సుధాకర్ గౌడ్, జిల్లా పద్మశాలియ సాధికారిక సమితి కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ తదితరులు భోగి కోటేశ్వరావును కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సుందరరావు యాదవ్ మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా బోగి కోటేశ్వరరావు పనిచేశారని, ఈ మేరకు మంత్రి నారా లోకేష్ రెండో దఫా కూడా కోటేశ్వరరావుపై నమ్మకంతో చైర్మన్ గా అవకాశం ఇచ్చారన్నారు. నరసింప స్వామి దేవస్థానం మాదిరిగా శివాలయం కూడా అభివృద్ధి చేయాలని ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. కోటేశ్వరరావు త్వరగా కోలుకొని శివాలయం అభివృద్ధి, స్వామివారి సేవ కార్యక్రమంలో యధావిధిగా పాల్గొనే శక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్ని భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. టీడీపీ జిల్లా పద్మశాలియ సాధికారిక సమితి కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ, టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, టీడీపీ నాయకులు నల్లగొర్ల శ్రీరామకృష్ణ, శివయ్య, బీజేపీ నాయకులు మాదల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కుర్రా ఏడుకొండలు తదితరులు కోటేశ్వరరావును పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సత్తెనపల్లిలో పర్యటించిన ఫుడ్ కమీషన్ సభ్యులు

**సత్తెనపల్లి, జులై 9 ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలో బుధవారం ఫుడ్ కమీషన్ సభ్యులు గంజి మాలదేవి పర్యటించారు. రేషన్ షాపులలోనూ, ఎమ్మెల్సీ



పాయింట్‌ల వద్ద తనిఖీలు నిర్వహించారు. నాగార్జునకాలనీ, మిర్చి యార్డు, పలు వార్డుల్లోని రేషన్ షాపులలో తనిఖీలు కొనసాగాయి. కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలన్నారు. స్టాక్ రికార్డులు, నిల్వలు సరిపోవాలన్నారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా డీలర్లు వ్యవహరించాలని ఫుడ్ కమీషన్ సభ్యులు గంజి మాలదేవి అన్నారు. వారి వెంట ఐసిడిఎస్, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

## కాపు జేఏసీ తొమ్మిది తీర్మానాలు
## కాపుల అభ్యున్నతికి తోడ్పడతాయి

**మంగళగిరి, జులై 9, ప్రభాతవార్త:** కాపులకు బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తాం అంటూ కాపుల సమస్యలపై రాష్ట్ర కాపు జే ఏ సీ అధ్యక్షులు చందు జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన జే ఏ సి



సమావేశం లో ఇటీవల పలు తీర్మానాలను ఆమోదించిన విషయం విధితమే. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మానవ వనరులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ లకు బుధవారం పంపించినట్లు జేఏసీ నాయకులు బుధవారం తెలిపారు. కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్ధన్ ఆదేశాల మేరకు కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాల్లోఅందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. జనసేన కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు వినతి పత్రాన్ని అందజేయవలసిందిగా ఎమ్మెల్సీ హరిప్రసాద్, కళ్యాణ్ శ్రీనివాసరావు, ఏపీ ఎంఎస్ఐడిసి ఛైర్మెన్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్ మాట్లాడుతూ కాపు జేఏసీ తీర్మానించిన తొమ్మిది తీర్మానాలు కాపుల అభ్యున్నతికి తోడ్పడతాయని పేర్కొన్నారు. కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని, రాష్ట్రం లో కాపు వర్గాలపై జరిగే దాడులను అరికట్టాలని, కృష్ణా జిల్లాకు స్వర్గీయ వంగవీటి మోహనరంగా పేరును నామకరణం చెయ్యాలని తీర్మానించారు. కాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.3,000 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని, రెండు ఎకరాల్లో కాపు భవనాల నిర్మాణాలు పూర్తి చెయ్యాలని, వీటితో సహా పలు తీర్మానాలను ఆమోదించారు. కూటమి ప్రభుత్వ పెద్దల ద్వారా ఆయా తీర్మానాలు అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్, దాసరి దుర్గా మల్లేశ్వరరావు, చవ్వాకుల కోటేష్ బాబు, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, నవీన్, హరి పాల్గొన్నారు.

## శ్రీసాయినాథ సన్నిదానంలో గురుపూర్ణిమ ఉత్సవాల
## 6వ రోజు సాయినాథునికి విశేషాభిషేకాలు

**గుంటూరు కల్చరల్, జులై 9,ప్రభాతవార్త :** స్థానిక విద్యానగర్‌లోని శ్రీసాయినాథ సన్నిదానంలో గురుపూర్ణిమ ఉత్సవాల 6వ రోజు సాయినాథునికి విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. మందిరంలో గురుపూజ ఉత్సవం శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవాది, వేలాది యాగకర్తలు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులకు యడ్లపాటి అశోక్‌కుమార్, స్వరూపరాణి దంపతులు పాదపూజ చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలపాటి మాధవి రాజేంద్రప్రసాద్, స్థానిక కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు మరియు ఎందరో పురప్రముఖులు పాల్గొని పుణ్యదంపతుల ఆశీర్వచనం తీసుకొన్నారు. సాయినామ సప్తాహం ఆరవ రోజు కొనసాగింది. సాయంత్రం జరిగిన గ్రామోత్సవం కోలాటాలు, తప్పెట్లు, తాళాలు, వివిధ వేషాలతో వైభవంగా నిర్వహించారు.

## రెండు గ్రామాలలో పొలం పిలుస్తోంది

**సత్తెనపల్లి, జులై 9 ప్రభాతవార్త :** మండలంలోని ఫణిదం, దీపాలదిన్నె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఎవరైనా అర్హుల జాబితాలో లేకుంటే అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు పేరు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్ళి వివరాలు తెలియజేయాలన్నారు. భూ యజమానుల అంగీకారంతో పంటసాగు హక్కు పత్రాలను పొందాలన్నారు. విత్తనాల కొనుగోళ్ళలో జాగ్రత్తలు వహించాలని వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జానీబాషా, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు,చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : నగర కమిషనర్

**గుంటూరుతూర్పు, జులై 9,ప్రభాతవార్త:** పారదర్శక ఎన్నికలు, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ లెవెల్ అధికారుల (బిఎల్‌ఓల) పాత్ర కీలకమని, బిఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలని గుంటూరు తూర్పు 95 నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ (ఐఐఐడీఈఎమ్) ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ 94, తూర్పు 95 నియోజకవర్గాల బిఎల్‌ఓలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యత కల్గి ఉంటుందని, నిరక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విధుల్లో ఏమైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, ఏఈఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే విధుల్లో భాగంగా అందే ప్రతి క్లైమ్ కి తప్పనిసరిగా ఫైల్ నిర్వహించాలని, అందులో సదరు క్లైమ్ సపోర్ట్ డాక్యుమెంట్స్, పబ్లికేషన్ ఫారాలు, నోటీసు, నోటీసు ఇచ్చినట్లు ఎకనాలాడ్జ్మెంట్, బిఎల్‌ఓ రిమార్క్స్, ఆమోదించినా, రిజెక్ట్ చేసినా ప్రొసీడింగ్స్, ప్రొసీడింగ్స్ దరఖాస్తుదారుకి అందినట్లు ఎకనాలాడ్జ్మెంట్ వంటివి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నగరంలోని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల బిఎల్‌ఓలకు జరుగుతున్న దశల వారీ శిక్షణలో



బిఎల్‌ఓ విధులు, ఎన్నికల నిబంధనలు, చట్టాలపై తెలుసుకోవచ్చని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం బుధవారం శిక్షణ అనంతరం బిఎల్‌ఓలకు పెట్టిన పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ 94 నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్‌ఓలు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, రాంబాబు, సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం: వామపక్ష నేతలు

**మాచర్ల, జులై 9 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ



నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సీసీఎం నాయకులు బండ్ల మహేష్, ఎంసీపీఐ నాయకులు అబ్రహం లింకన్, ఎంసీపీఐయూ నాయకులు మాచవరపు నాగేశ్వరరావులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన ప్రభుత్వాలు ఆ దిశలో కనబడటం లేదన్నారు. ఎందరో ప్రాణ తానయగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నారు. ఎనిమిది గంటల పని వేళలు కాదని 12 గంటలు పని చేయాల్సిందేనంటూ చట్టాలను మార్పు చేయడం కార్పొరేట్లకు దోచి పెట్టడమేనన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు, లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడంలో అర్థం లేదన్నారు. నాడు స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించిన నేటి పాలకులు వాటిపై ఇప్పుడు నోరు మెదపకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిలలాడుతున్నారన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో కుందుర్తి వీర బ్రహ్మాచారి, వీరాచారి, చెన్నకేశరావు, భద్రి, నాగార్జున, శివ, బ్రహ్మం, మహేష్, శివ, రమణ, అన్నమ్మ, నాగరాజు, ప్రకాష్, సంపూర్ణమ్మ, కోటేవ్వరమ్మ, పార్వతి, హనుమంతు, దేవళ్ల కోటేశ్వరరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

## సీఎంఏ ఫలితాలలో అఖిలభారత స్థాయిలో
## మాస్టరమైండ్స్‌విద్యార్థుల
## ర్యాంకుల ప్రభంజనం

**గుంటూరు విద్య, జులై 9,ప్రభాతవార్త :** ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ర్యాంకుల ప్రభంజనాన్ని సృష్టించారు. సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 10ర్యాంకులను మాత్రమే ప్రకటించడం జరుగుతుంది. ఈ 10ర్యాంకుల్లో 11ర్యాంకులను మాస్టర్ మైండ్స్ విద్యార్థులు కైవశం చేసుకున్నారని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సీఏ మట్టుపల్లి మోహన్ పత్రికా విలేకర్ల సమావేశంలో తెలపారు.



మాస్టర్ మైండ్స్ విద్యార్థులు సాధించిన ఆలిండియా ర్యాంకులు వరుసగా 4,5,6,6,8,8,8,9,9,10, 10, సేమ్ మార్క్స్ వచ్చినటువంటి విద్యార్థులకు సేమ్ ర్యాంక్స్ ఇవ్వడమనేది జరుగుతుంది. ఈ విధంగా అఖిల భారత స్థాయిలో 10ర్యాంకుల్లో 11ర్యాంకులను మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. ఇలాంటి ఘన విజయాన్ని మాకు అందించిన విద్యార్థులకు, సహకరించినటువంటి వారి తల్లిదండ్రులకు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు మోహన్ ధన్యవాదాలు తెలియజేశారు.

కామర్స్ కోర్సులు చదివిన విద్యార్థులకు నిరుద్యోగ సమస్య ఉండదని, ఉద్యోగ ఉపాది పోటీ ప్రపంచంలో అకౌంటెంట్స్ కొరత తీవ్రంగా ఉందని ఇలాంటి నేపథ్యంలో కామర్స్ కోర్సులను విద్యార్థులు ఎంచుకుంటే భవిష్యత్తు ఉజ్వలం అవుతుందని మోహన్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలని విద్యార్థులు కామర్స్ కోర్సుపట్ల మక్కువ పెంచుకోవాలని ఆయన సూచించారు.

## ఇంటింటికి తెదేపా కార్యక్రమాన్ని
## వేగవంతం చేయాలి

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ నేతలు అన్నారు. కారంపూడి పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో క్లస్టర్,



యూనిట్, బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమావేశం బుధవారం జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరు అంజయ్య, పంగులూరు పుల్లయ్య, గోళ్ల సురేష్‌యాదవ్, బొమ్మిన శేషగిరి, కోదాటి ప్రభాకర్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, బాలునాయక్, నాగారపు రామకృష్ణ, నాలుగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడిలో విత్తన దుకాణాలపై
## విజిలెన్సు దాడులు

**కారంపూడి, జులై 9 ప్రభాతవార్త:** కారంపూడి పట్టణంలోని విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావుతో కలిసి విజిలెన్సు సీఐ పి.శివాజీ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, కొనుగోలు, అమ్మకాల లావాదేవీలకు సంబంధించిన బిల్లులు, భౌతిక నిల్వలు క్షుణ్ణంగా పరిశీలించారు. రెండు దుకాణాల్లో భౌతిక నిల్వలకు, స్టాకు రిజిస్టర్లకు వ్యత్యాసం ఉండటంతో రూ.1,54,770 విలువ చేసే మిర్చి విత్తనాల అమ్మకాలను అధికారులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు అధికారులు మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు.

## ఉన్నత పాఠశాల దుస్థితి చూసి
## ఆవేదనకు గురైన ఎన్నారై

- 450 పైగా విద్యార్థులకు కేవలం నలుగురే ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయులు లేరని డ్రాప్ అవుతున్న విద్యార్థులు
- ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల దుస్థితికి ఆవేదన వ్యక్తం చేస్తున్న పూర్వవిద్యార్థులు

**విజయపురిసౌత్, జులై 9 ప్రభాతవార్త:** తాను పుట్టి పెరిగి చదువుకున్న నాగార్జునసాగర్‌లోని విజయపురిసౌత్ ఉన్నత పాఠశాల తమకు పూజామందిరం కంటే గొప్పదని, అందుకని తాను 2002 నుంచి ఆ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా విరాళాలు ఇస్తూ, పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తూ, వారి చదువుకు ఎక్కడా ఆటంకాలు లేకుండా, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తూ తన మాతృదేశ రుణాన్ని తీర్చుకుంటున్నారు ఎన్నారై షేక్ చాంద్‌పాషా. అంతేకాకుండా పాఠశాలలో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, అందరికీ మార్గదర్శిగా ఉంటూ అన్నీ తానై నడిపిస్తున్నాడు. గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా తాను అందించిన సహకారంతో కొంతమంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో కూడా విజయం సాధించడం గర్వకారణంగా నిలిచింది. కానీ గత విద్యాసంవత్సరంలో తన పాఠశాలకు డెప్యుటేషన్‌పై వచ్చిన టీచర్లందరూ వెళ్లిపోవడంతో 450కిపైగా ఉన్న పాఠశాలలో ప్రస్తుతం కేవలం నలుగురు ఉపాధ్యాయులే ఉండటం నిరుత్సాహానికి గురైనట్లు 'వార్త'తో తెలిపారు. ప్రభుత్వం విద్యకి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నా ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పూర్వవిద్యార్థులు అన్నారు. విద్యార్థులకు ఇంకా ఎక్కువ నష్టం జరగకముందే ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై దృష్టిసారించి వెంటనే తగు చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చేయాలని ఎన్నారై చాంద్‌పాషా, పూర్వవిద్యార్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల
## భూమి ఆక్రమణ అవాస్తవం : తహశీల్దార్

**పిడుగురాళ్ల, జులై 9 ప్రభాతవార్త:** పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమి ఆక్రమణ అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తి



నిరాధారమైందని తహసీల్దార్ మధుబాబు అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన భూమిని ఆక్రమించి దారి వేశారంటూ కళాశాల కమిటి సభ్యులు ఇచ్చిన అర్జీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో అప్పటి కలెక్టర్ 342, 892 సర్వే నంబర్లలో పిడుగురాళ్ల జూనియర్ కళాశాలకు 9 ఎకరాల 54 సెంట్లు భూమిని మంజూరు చేశారన్నారు. కానీ కళాశాలకు సంబంధించి 3.51 ఎకరాలు మాత్రమే ఉపయోగంలో ఉండి మిగిలిన 6.03 ఎకరాలు నిరూపయోగంగా ఉండిపోయిందన్నారు. తరువాత పట్టణం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలం అవసరం కావడంతో అప్పటి తహసీల్దార్ రిపోర్టు పంపించారన్నారు. కాలేజీకి సంబంధించిన వారికి ప్రభుత్వం నుంచి నోటీసు పంపించినా తగిన స్పందన రాకపోవడంతో జీవో నంబరు 570 ప్రకారం ఇచ్చిన స్థలం వెనక్కి తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించిందన్నారు. దీనిలో కోర్టు నిర్మాణానికి 1.01 ఎకరం, క్రీడా వికాస్ కేంద్రానికి 4.91 ఎకరం, రహదారికి 17 సెంట్లు స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఇదంతా కూడా 25-02-2019న ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ కాలేజీకి సంబంధించిన భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవలు లేవని తహసీల్దార్ మధుబాబు తెలిపారు.

## యూరియా కొరతతో రైతన్నల అవస్థలు
### - పట్టించుకోని మండలశాఖాధికారులు

**ఎ కొండూరు, జులై 9, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో యూరియా కొరతవల్ల రైతన్నలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎ కొండూరు, కంభంపాడు, చీమలపాడు, రామచంద్రాపురం, పోలిశెట్టిపాడు గ్రామాల్లో ఎరువుల పురుగు మందుల దుకాణదారులు కొందరు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్న అలాగే విత్తనాల అమ్మకాల్లో అధిక ధరలు రైతులకు రశీదు ఇవ్వకుండా ఇష్టానుసారంగా విక్రయిస్తున్న స్థానిక మండల వ్యవశ్శాఖ అధికారి పట్టించుకోకపోవడం మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉందని పలువరు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ఈ మండలానికి యూరియాను వెంటనే సరఫరా చేసి తమ కష్టాలను తొలగించి ఆదుకోవాలని మండల ప్రాంత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా నేషనల్ ఆటో దినోత్సవ వేడుకలు


**తిరువూరు, జులై 9, ప్రభాతవార్త :** నేషనల్ ఆటో దినోత్సవం సందర్భంగా తిరువూరు వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, జైబావి సెంటర్లలోని ఆటో స్టాండ్లలో ఆటో యూనియన్ సభ్యులు కేక్ కట్ చేసి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆటో యూనియన్ అధ్యక్షులు పర్వతం శ్రీనివాసరావుకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

10-7Pg5.qxd:10-7Pg5.qxd 01/01/01 7:34 AM Page 1



# భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!


## బ్రహ్మపుత్ర నదీజలాలపై భారీ డ్యామ్ నిర్మాణం



**ఇటానగర్,జూలై 9:** భారత్‌తో సరిహద్దులో ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీన్ని చైనా వాటర్ బాంబ్‌గా ఉపయోగించే అవకాశం ఉందని అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ వ్యాఖ్యానించారు. చైనా మిలటరీ కంటే ఈ డ్యాంతోనే అతిపెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా వ్యూహాలకు దీటుగా భారత్ కూడా పలుచర్యలు తీసుకుంటోంది. భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తోంది. దీనికి యార్లుంగ్ త్సాంగ్పో ఆనకట్టగా పేరపెట్టింది. టిబెట్‌లో యార్లంగ్ సాంగ్పో నదిగా ప్రసిద్ధమైన బ్రహ్మపుత్ర నదిపై ఈ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 2024లో చైనా సర్కారు ఆమోదం తెలిపింది. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ఐదేళ్లలో దీన్ని నిర్మించాలని డ్రాగన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 60 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్రహ్మపుత్రనది భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు సాయంతో చైనా బ్రహ్మపుత్ర నదిలో జలప్రవాహాన్ని నియంత్రించగలదు. భారీ మోతాదులో వరద నీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం సృష్టించగలదు. అందుకే దీన్ని వాటర్ బాంబ్‌గా అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ అభివర్ణించారు.

చైనా మిలటరీ కంటే ఈ ఆనకట్టే భారత్‌కు అత్యంత ప్రమాదకరమని పెమాఖండూ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేసి ఉంటే ఈ డ్యాం వల్ల భారత్‌కు పెద్దగా సమస్య వచ్చేదికాదని పెమా ఖండూ తెలిపారు. ఎందుకంటే ఆ ఒప్పందం ప్రకారం బ్రహ్మపుత్ర జలాలను కొంతమేర తప్పనిసరిగా కిందకు వదలాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేయనందున వేసవికాలంలో బ్రహ్మపుత్ర జలాలను భారత్‌లోకి రాకుండా చైనా మళ్లించే అవకాశం ఉందన్నారు. తద్వారా అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఆనకట్ట నిర్మించి వారు అకస్మాత్తుగా నీటిని విడుదల చేస్తే, మన మొత్తం సియాంగ్ బెల్ట్ నాశనం అవుతుంది. ముఖ్యంగా ఆది తెగ సహా ఆ తరహా సమూహాలు అక్కడ ఎక్కువగా నివాసం ఉంటారు. ఆది తెగ ఆస్తి, భూమి, ముఖ్యంగా మానవ జీవితం వినాశకరమైన ప్రభావాలను ఎదుర్కొంటాయి. అసోంలో కూడా బ్రహ్మపుత్ర నది వరద వల్ల భారీ నష్టం సంభవిస్తుందన్నారు.

చైనా నిర్మిస్తున్న డ్యాం పూర్తైతే సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం ఉందని పెమా ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసమే అరుణాచల్‌లో కూడా ఓ ప్రాజెక్టునునిర్మించనున్నాం. దానివల్ల మా నీటి అవసరాలను దానిద్వారా తీర్చుకునే అవకాశం ఉంటుంది. చైనా నిర్మిస్తున్న ప్రాజెక్టు భారత్‌చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. రక్షణ పరంగానూ భారత్‌కు దీనివల్ల సమస్యలు పొంచిఉన్నాయి. యుద్ధ పరిస్థితులు తలెత్తితే ఈ ప్రాజెక్టులో నిల్వచేసిన నీటిని చైనా వాటర్ బాంబ్‌గా ప్రయోగించే ప్రమాదం ఉంది.



# ఆర్థిక నేరస్తురాలు మోనికా కపూర్ అమెరికాలో అరెస్టు

**న్యూఢిల్లీ, జూలై 9:** రెండుదశాబ్దాలుగా ఆర్థికనేరాల్లో నిందితురాలిగా ఉంటూ తప్పించుకుని అమెరికాలో తలదాచుకున్న ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు మోనికా కపూర్‌ను ఎట్టకేలకు సిబిఐ భారత్‌కు రప్పించింది. దిగుమతి లైసెన్స్‌లను దుర్వినియోగంచేసి కోట్లాదిరూపాయలు మోసానికి పాల్పడిందన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమె రెండుదశాబ్దాల క్రితమే అమెరికాలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెపై ప్రత్యేకించి మోనికా ఓవర్సీస్ సంస్థపేరిట 2.36 కోట్ల బంగారం దిగుమతుల్లో కూడా మోసం ఉందని సిబిఐ గుర్తించింది. 1998లో ఆమె తన సోదరులు రాజన్‌ఖన్నా, రాజీవ్‌ఖన్నాలతోకలిసి శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. షిప్పింగ్ బిల్లులు ఫోర్జరీ చేయడం, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ సర్టిఫికేట్లు, ఎగుమతుల్లో అవకతవకలు వంటివాటికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. బంగారం ఉచిత దిగుమతులకోసం ఆరు లైసెన్సులు తీసుకుని వాటిని దుర్వినియోగంచేసారని, వాస్తవానికి ఆ లైసెన్సులు జ్యూయెలరీ ఎగుమతులకు నిర్దేశించినవని సిబిఐ వాదించింది. ఎగుమతులకు బదులుగా అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న డీప్ ఎక్స్‌పోర్ట్స్‌కు విక్రయించినట్లు నేరం మోపారు. అంతేకాకుండా మోనికా సంస్థ దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా బంగారం దిగుమతులుచేసుకున్నదని, దీనివల్ల భారత ఖజానాకు 1.44 కోట్లనష్టం వాటిల్లినట్లు అభియోగాలు నమోదుచేసారు. ఆమె సోదరులను ఢిల్లీకోర్టు 2017లో ఒకకేసులో శిక్ష విధించింది. ఇక మోనికా కపూర్ అయితే విచారణ, దర్యాప్తు, కోర్టు విచారణను తప్పించుకుంటూ వస్తోంది. 1999లో ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. 2002లో కేసునమోదుకాగా ఛార్జిషీటు 2004లో దాఖలుచేసారు. కాగా మోనికా కపూర్‌ను ఉద్దేశ్యపూర్వక ఎగవేత దారుగా 2006లో ప్రకటించారు. ఇందుకు సంబంధించి నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ కాగా ఇంటర్‌పోల్ రెండ్‌కార్నర్‌నోటీసు కూడా జారీచేసింది. 2010లో భారత ప్రభుత్వం ఆమెను తమకు అప్పగించాలని అమెరికాను అభ్యర్థించింది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ న్యాయపరమైన సవాళ్లతో జాప్యం జరిగింది. కపూర్ తన అప్పగింతను సవాల్‌చేసింది.

తనను అక్కడ చిత్రహింసలకు గురిచేస్తారని, ఆమె వాదించింది. ఐక్య రాజ్య సమితిఒప్పందం ప్రకారం అమెరికా విదేశీ వ్యవహారాలు, సంస్కరణలు పునర్వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా 1998లో ఆమె చేసిన క్లెయిమ్‌లన్నింటినీ తిప్పికొట్టారు. కాగా తాజాగా మోనికాకపూర్‌ను అమెరికాలో అదుపులోకి తీసు కుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఎ 292లో కపూర్‌ను సిబిఐ అధికారులు భారత్‌కు తీసుకువచ్చారు. ఈ అప్పగింత ఒక మేజర్ రికార్డు అని ఉద్దేశ్య పూర్వక ఎగవేతత దారులు ఎక్కడ ఉన్నా ఎప్పటికైనా భారత్‌కు రావాల్సిందేనన్న వాదనను నిజంచేసిందని సిబిఐ అధికారులు చెపుతున్నారు.

# బీహార్‌లోనూ ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు..

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు!



**పాట్నా, జులై 9:** బీహార్‌లో ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర తరహాలో నితీశ్‌కుమార్ పార్టీ తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన బీహార్ బంద్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభకు, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ముందుగా ఇండియా కూటమికి మెజారిటీ ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని రాహుల్ పేర్కొన్నారు. కానీ అనుకోని విధంగా తాము ఆయా ఎన్నికల్లో ఓడిపోయామన్నారు.

అనంతరం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికలకు వారం రోజుల ముందు దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు గుర్తించామన్నారు. అలా కొత్త ఓటర్లను చేర్చిన అన్ని నియోజకవర్గాల్లో బిజెపి గెలుపొందిందని ఆరోపించారు. బీహార్‌లోను అదే కుట్ర పన్నుతున్నారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తాము ఓటర్ల జాబితా అడిగినప్పటికీ ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటివరకు దానిని తమకు అందించలేదని రాహుల్ ఆరోపించారు. రాజ్యాంగ విలువలను రక్షించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతలు మరిచి బిజెపి సూచనల మేరకు పనిచేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న బీహార్ బంద్‌పై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు చూపించడానికి అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని బిజెపి నేత షానవాజ్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ బంద్ ముసుగులో వారు చేస్తున్న గూండాయిజాన్ని రాష్ట్ర ప్రజలుస్వయంగా చూస్తున్నారన్నారు. భారత పౌరులు మాత్రమే రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయాలనే ఆలోచనతో మాత్రమే ఇసి ఓటర్ల జాబితాలను సవరిస్తుందన్నారు.



## ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత!

**భోపాల్, జూలై 9:** ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరుపొందిన 'వత్సల' మహిళా ఏనుగు మంగళవారం తుదిశ్వాస విడిచింది. మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వులో ఇది మృతిచెందింది. ఏనుగు ముందుకాళ్ల గోళ్లకు గాయాలు కావడంతో అభయారణ్యంలోని ఖైరైయాన్ కాలువసమీపంలో కూర్చుని ఉండిపోయింది. వైద్యులు, సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ పైకి లేవలేకపోయింది. తర్వాత మృతిచెందినట్లుపన్నా టైగర్ రిజర్వు ప్రకటన విడుదలచేసింది. 100 ఏళ్లకుపైగా బతికిన ఈ ఆడ ఏనుగును దాదీమా, నానిమా అనే పేర్లతోపిలిచేవారు. వత్సల మృతితో వన్యప్రాణుల చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందని సీనియర్ అటవీ అధికారి ఒకరు తెలిపారు. అటవీ అధికారులు సిబ్బంది సమక్షంలో ఆ ఏనుగుకు అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు వృద్ధాప్యం వల్ల వత్సలకు దృష్టిలోపం వచ్చింది. ఎక్కువదూరం నడవలేకపోయింది. హినౌటా ఎలిఫెంట్ క్యాంప్ నుంచి ప్రతిరోజు స్నానం చేయించడానికి తినడానికి దీన్ని ఖైరైయాన్ కాలువ వద్దకు తీసుకెళ్లేవారు. ప్రతిరోజూ వత్సలకు వైద్య నిపుణుల సమక్షంలో రీక్షలు నిర్వహించేవారు. పూర్తి సంరక్షణ వల్లనే వత్సల చాలా ఏళ్లు బతికిందని అధికారులు తెలిపారు. కేరళలోని నర్మదాపురంలో పుట్టిన ఈ ఏనుగును పన్నాకు తీసుకొచ్చారు. గత కొన్నేళ్లుగా పన్నా పులుల సంరక్షణ కేంద్రంలో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది. వత్సల మృతిపై రాష్ట్ర సిఎం మోహన్ యాదవ్ విచారం వ్యక్తంచేసారు.

# చైనా, పాక్, బంగ్లాల మైత్రితో భారత్‌కు పొంచి ఉన్న పెనుముప్పు

## సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ, జూలై 9:** చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల కలయిక భారత్ సుస్థిరత, భద్రతకు తీవ్ర సవాళ్లను సృష్టించగలదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు దేశాల్లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని అదునుగా చేసుకొని, వాటిపై విదేశీ శక్తులు పట్టును పెంచుకునే ముప్పు ఉందన్నారు. దీనివల్ల కూడా భారత్‌కు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సీడీఎస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో పాక్ కొనుగోలు చేసిన ఆయుధాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనావేనని ఆయన గుర్తు చేశారు. చైనా ఆయుధ తయారీ కంపెనీలతో పాకిస్థాన్ పెద్దఎత్తున ఒప్పందాలను కుదుర్చుకుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయా కంపెనీల ఆయుధ తయారీ యూనిట్లు, నిపుణులు పాక్ గడ్డపై కూడా కార్యకలాపాలు సాగిస్తుండొచ్చని అంచనా వేశారు. అణ్వస్త్ర దేశాలైన భారత్ పాక్‌లు మే 7 10 మధ్య తొలిసారిగా నేరుగా సైనిక శక్తులతో తలపడ్డాయన్నారు. నాలుగు రోజుల ఆపరేషన్ సిందూర్ వేళ చైనా సరిహద్దుల్లో ఎలాంటి అసాధారణ సైనిక చర్యలూ చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. చైనా పాక్ మధ్య వ్యూహాత్మక స్నేహం ఉందని, ఆపరేషన్ సిందూర్ చాలా తక్కువ రోజులే కొనసాగడంతో చైనా వైపు నుంచి స్పందన రాలేదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయినప్పటికీ ఆ రెండు దేశాల స్నేహాన్ని తప్పకుండా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాక్ అణ్వాయుధ బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకుండా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ నిర్వహించిందన్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణకు ఆపరేషన్ సిందూరే ఏకైక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఈ సైనిక చర్య చాలా ప్రత్యేకమైందని, దాని నుంచి ఆసియా దేశాలతో పాటు యావత్ ప్రపంచం పాఠాలను నేర్చుకోవచ్చన్నారు.

**ఇకపైనా సంప్రదాయక సైనిక ఘర్షణలే**

రాబోయే కాలంలోనూ సంప్రదాయక సైనిక ఘర్షణలే జరిగే అవకాశం ఉంది. అణ్వాయుధాల వినియోగం దాకా పరిస్థితులు తీవ్రతరం కావు. ఇందుకు మూడు ప్రాథమిక కారణాలు ఉన్నాయి. మొదటి కారణం ఏమిటంటే అణ్వాయుధాలను తొలుత ప్రయోగించకూడదనే భారత్ పాలసీ. అందుకే ఏ పరిస్థితుల్లోనైనా పాక్ కూడా భారత్‌తో సాధారణ తరహా (సంప్రదాయక) సైనిక ఘర్షణకే దిగుతుంది. రెండోకారణం ఏమిటంటే ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాక్ సంప్రదాయక సైనిక ఘర్షణనే మొదలుపెట్టింది. మూడో కారణం ఏమిటంటే భారత్‌తో జరిగే సైనిక ఘర్షణలను ఏ స్థాయికి తీసుకెళ్లాలనేది పాక్ ఇష్టం. పాక్ స్పందించే రేంజ్ కంటే పెద్ద రేంజ్ లోనే భారత్ బలమైన సమాధానం ఇవ్వగలదు. ఈవిషయం పాక్‌కు బాగా తెలుసు. అందుకే అది సంప్రదాయక ఘర్షణకే పరిమితం అవుతుందిఖి అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

**బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పెద్దసవాల్**

సంప్రదాయక సైనిక ఘర్షణను పతాక స్థాయికి తీసుకెళ్లే సత్తా భారత్‌కు ఉందని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. సైబర్, ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ మార్గాల్లోనూ దాడులు జరిపే సత్తా మన దేశానికి ఉందన్నారు. శత్రువులు ఈ తరహా దాడులు చేసినా ధీటుగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. అయితే బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ రకాల క్షి పణులు, పెద్దసంఖ్యలో డ్రోన్లు, దిశను మార్చుకుంటూ ప్రయాణించే మిస్సైళ్లు, డ్రోన్ల నుంచి పూర్తిస్థాయి రక్షణను కల్పించే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఇంకా ప్రపంచంలో ఎక్కడా అందుబాటులోకి రాలేదన్నారు. రాబోయే కాలంలో ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనేలా భారత్ సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఏ క్షణమైనా శత్రుదేశాల దాడులను తిప్పికొట్టగల సైనిక సంసిద్ధత, 365 రోజుల్లో 24/7 అలర్ట్‌గా ఉండే వైఖరి అవసరమన్నారు.

# గురుత్వాకర్షణ లేని స్థితిలో మెంతి, పెసరసాగుపై అధ్యయనం

## భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ, జులై 9:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగా తాజాగా ఆయన ఐఎస్ఎస్‌లో రైతు అవతారం ఎత్తారు. రోదసిలో గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై ఉండే ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నపాటి గాజు పాత్రలో మెంతి, పెసర విత్తనాలను వేసి ఐఎస్ఎస్‌లోని నిల్వ ఫ్రీజర్ ఉంచి జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారు. వాటికి సంబంధించిన ఫొటోలను తీశారు. ధార్వాడ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగాన్ని చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించినట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో శుక్లా మైక్రో ఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్‌లోని స్క్రీన్‌తో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నామని ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని శుక్లా పేర్కొన్నారు. పరిశోధకులకు, స్పేస్‌స్టేషన్‌కు మధ్య వారధిగా ఉండి, వివిధ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

యాగ్జియం -4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గతవారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి శుక్లా అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణవ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది.

# కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?

## అభివృద్ధి కోసమే ఢిల్లీకి వచ్చామంటున్న సిఎం, డిప్యూటీలు

**న్యూఢిల్లీ, జూలై 9:** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇద్దరూ ఒకేసారి హస్తినలో పర్యటిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నాయకత్వ మార్పును కోరుతున్నారనే వార్తల నేపథ్యంలో, ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం కానున్నారనే ప్రచారం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. అయితే, ఈ పర్యటన పూర్తిగా రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిందేనని అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డికె శివకుమార్, తాను రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు నిధుల గురించి చర్చించేందుకు వచ్చానని తెలిపారు. మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. "సీఎం సిద్ధరామయ్య రక్షణ మంత్రితో సమావేశం కోసం వచ్చారు. మా పర్యటనలన్నీ అభివృద్ధి కోసమే" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, ఆయన పాట్నా పర్యటన నుంచి తిరిగి రాగానే కలుస్తానని డికె వివరించారు. మరోవైపు, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. దీనిపై డికె స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పార్టీని పునర్వ్యవస్థీకరించాలని అధిష్టానం కోరుతోందని, దానిపైనే సుర్జేవాలా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. 2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుంచి సీఎం పదవిపై చర్చ కొనసాగుతూనే ఉంది. అప్పట్లో కుదిరిందని చెబుతున్న ఒప్పందం ప్రకారమే మార్పు జరగనుందనే వాదనలు వినిపిస్తున్నా, కాంగ్రెస్ దీనిపై అధికారికంగా స్పందించలేదు.

# ఆస్ట్రేలియాపై భారతీయులకు పెరుగుతున్న క్రేజ్!



**మెల్‌బోర్న్, జూలై 9:** పర్యాటకం కోసం ఆస్ట్రేలియా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సులభతరం చేసిన వీసా నిబంధనలు, పెరిగిన విమాన సర్వీసులు ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అందమైన ప్రకృతి, ప్రత్యేకమైన వన్యప్రాణులు, సిడ్నీ ఒపెరా హౌస్ వంటి అద్భుత కట్టడాలు ఉన్న ఆస్ట్రేలియా అంటే భారతీయులకు ఎప్పటి నుంచో ఆసక్తి ఉన్నప్పటికీ, ఈ ఏడాది పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. టూరిజం ఆస్ట్రేలియా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మార్చితో ముగిసిన సంవత్సరంలో సుమారు 4.50లక్షల మంది భారతీయులు ఆస్ట్రేలియాను సందర్శించారు. ఇది గతేడాదితో పోలిస్తే 9.4 శాతం అధికమని టూరిజం ఆస్ట్రేలియా కంట్రీ మేనేజర్ (ఇండియా అండ్ గల్ఫ్) నిశాంత్ కాశికర్ తెలిపారు. పర్యాటకుల పెరుగుదలకు ప్రధాన కారణం సులభతరం చేసిన వీసా ప్రక్రియ అని ఆయన వివరించారు. అమెరికా, యూకే వంటి దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియా వీసా విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటం, పాస్‌పోర్ట్‌ను భౌతికంగా సమర్పించాల్సిన అవసరం లేకపోవడం, బయోమెట్రిక్స్ లేదా ఇంటర్వ్యూలు వంటివి లేకపోవడంతో భారతీయులకు చాలా సౌకర్యంగా మారిందని పేర్కొన్నారు.

వీసాతో పాటు భారత్‌ఆస్ట్రేలియా మధ్య విమాన కనెక్టివిటీ కూడా భారీగా పెరిగింది. కరోనాకు ముందు వారానికి కేవలం 8 విమానాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 27కు చేరింది. అంతేకాకుండా అమెరికా డాలర్‌తో పోలిస్తే ఆస్ట్రేలియన్ డాలర్ మారకం రేటు స్థిరంగా (సుమారు రూ. 55.56) ఉండటం కూడా సానుకూల అంశమని కాశికర్ అన్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి నగరాలతో పాటు ఇప్పుడు టాస్మానియా, కంగారూ ఐలాండ్ వంటి కొత్త ప్రదేశాలను చూసేందుకు కూడా భారత పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు.

# ఉత్తరకొరియా పౌరులను అప్పగించిన దక్షిణకొరియా

**సియోల్, జూలై 9:** తన ప్రత్యర్థి ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపరుచుకునేలా దక్షిణ కొరియా కీలకమైన చర్య చేపట్టింది. ఈ ఏడాది సముద్రంలో రక్షించిన ఆరుగురు ఉత్తర కొరియా పౌరులను సురక్షితంగా వారి స్వదేశానికి తిరిగి పంపినట్లు దక్షిణ కొరియా యూనిఫికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ పరిపాలనలో ఇరు దేశాల మధ్య సయోధ్యను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఇది ఒక ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

ఈ ఏడాది మార్చి, మే నెలల్లో వేర్వేరు సమయాల్లో కొందరు ఉత్తర కొరియా పౌరుల పడవలు దారి తప్పి దక్షిణ కొరియా సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. వారిని దక్షిణ కొరియా అధికారులు రక్షించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు తమను స్వదేశానికి పంపాలని పదేపదే కోరుకుంటున్నారని, వారి పూర్తి అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉదయం ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర సరిహద్దు రేఖ దాటించి వారిని ఉత్తర కొరియా అధికారులకు అప్పగించినట్లు తెలిపింది. ఈ అప్పగింత ప్రక్రియ కోసం ఉత్తర కొరియాను సంప్రదించేందుకు సియోల్ చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ, చివరికి ఉత్తర కొరియా అధికారుల సహకారంతో ఇది విజయవంతంగా పూర్తయింది.

గత నెలలో కొరియాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే చర్యలలో భాగంగా, సరిహద్దుల్లో ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రచారం చేసే లౌడ్‌స్పీకర్లను దక్షిణ కొరియా సైన్యం ఆపివేసింది. ఈ చర్య ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి సహాయపడుతుందని అప్పట్లో రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. చర్చలను పూర్తిగా నిలిపివేయడం అవివేకమని, అమెరికాతో సమన్వయం చేసుకుంటూనే ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని అధ్యక్షుడు లీజేమ్యుంగ్ గత వారం వ్యాఖ్యానించిన విషయం గమనార్హం. 195053 యుద్ధం కేవలం యుద్ధ విరమణతో ముగిసింది కానీ శాంతి ఒప్పందం జరగనందున, సాంకేతికంగా ఇరు దేశాలు ఇప్పటికీ యుద్ధ వాతావరణంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదు : ఉండవల్లి శ్రీదేవి



**నెల్లూరు రూరల్, జూలై 9, ప్రభాతవార్త** మహిళలపై సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతిరెడ్డి గారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం దారుణమని, పూజించాల్సిన మహిళలపై సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటీవల అమరావతి మహిళలపై వైసీపీ నేతలు నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఎంపీగా పోటీ చేసి డిపాజిట్లు దక్కని అనిల్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీలో ఉన్నప్పుడు వేమిరెడ్డి దంపతులని దేవుళ్ళు అన్నారని, ఇప్పుడు పార్టీ మారిపోతే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమంజసం కాదన్నారు. తల్లి, చెల్లిని పక్కన పెట్టారని, బాబాయ్ హత్య జరిగితే చెల్లికి న్యాయం చేసారా అని ప్రశ్నించారు. నారా లోకేష్‌కి చీర, సారె పంపిస్తామని మాజీ మంత్రి రోజా అన్నారని, అసెంబ్లీలో ఇష్టంవచ్చినట్లు మాట్లాడారని అన్నారు. అందుకే మోనార్క్‌గా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.

పర్యటనల పేరుతో కార్యకర్తలన్ని చంపేస్తున్నారని, అమరావతికి పరిశ్రమలు రానీకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సి కార్పొరేషన్ నిధులను గత ప్రభుత్వం తొక్కేసిందని, ప్రసన్న కుమార్ రెడ్డి తన వ్యాఖ్యలని వెనక్కి తీసుకుని ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

### ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించాలి - పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు రైతులకు అండగా నిలవాలి - వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, జులై 9,ప్రభాతవార్తప్రతినిధి:** అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా సరే తాను టెక్నాలజీ గురించి పదే పదే మాట్లాడేది ప్రజల కోసం.. ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం, ఇన్ఫ్రా, ఆర్టీజీఎస్, స్వర్ణాంధ్ర విజన్2047, ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాల్లో గేట్స్ ఫౌండేషనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గర చేసే అంశంపై గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతి వంటి అంశాలపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉంది. టెక్నాలజీ ద్వారా చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం. అయితే ఆ టెక్నాలజీ ప్రజలకు ఎంతవరకు చేరువ చేయగలిగామనేదే ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి.. దాదాపు 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైనులోనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంటుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. అలాగే టెక్నాలజీ పరంగా ఆయా అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పని చేస్తున్నాం. అయితే ఆయా రంగాల్లో మనం అందిపుచ్చుకున్న సాంకేతికతను ప్రజలకు.. మరీ ముఖ్యంగా పేదలకు అందుబాటులోకి తేవాలి. టెక్నాలజీ ద్వారా ప్రజలు లాభం పొందాలి. అప్పుడే సాంకేతికతకు సార్థకత చేకూరుతుంది." అని చంద్రబాబు చెప్పారు. వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఈ రంగాలు ప్రజలు, పేదలకు అత్యంత అవసరమైనవి. రాన్రాను వైద్యమనేది సామాన్యునికి భారంగా మారుతోంది. ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి. కొన్ని కొన్ని రోగాలకు కోట్లాది రూపాయల మేర డబ్బులు అవసరమవుతున్నాయి. అందుకే ఆరోగ్య రంగాన్ని టెక్నాలజీతో అనుసంధానించే అంశంపై దృష్టి పెట్టాం. ప్రతిఆరు నెలలకోసారి ప్రజలకు రక్త పరీక్షలు చేపట్టాలి. రోగాలు ఏమైనా వచ్చే అవకాశం ఉందా.. అనేది ముందుగానే గుర్తించాలి. ఆ డేటా ఆధారంగా ప్రజలకు ముందుగానే ఆరోగ్య సలహాలు.. సూచనలు అందించేలా చూడాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా వారికి కావాల్సిన వైద్య సేవలు, సూచనలు అందించాలి. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేస్తే.. సగం రోగాలు తగ్గిపోతాయి. అలాగే మన ఆరోగ్య పద్దతులు మార్చుకుంటే చాలా రోగాలు దరిచేరవు. ఇక పుట్టిన పిల్లల్లో వైకల్యం మొదలుకుని.. పోషకాహార లోపాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని గుర్తించగలగాలి. దీని కోసం కేర్ అండ్ గ్రో విధానాన్ని అనుసరిస్తున్నాం. ఎవరెవరికి ఏయే ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని.. వారిని నిరంతరం మానిటర్ చేసేలా ఉండాలి. ఆఫ్ లైన్, ఆన్ లైన్ మెడికల్ కన్సల్టేషన్ ఉండాలి.

## శాకంబరి అలంకారానికి ముస్తాబైన కాణిపాకం

**- విరాళంగా 20 టన్నుల కూరగాయాలు**

**కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలు ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి జరుగనున్న శాకాంబరి అలంకారంకు ముస్తాబయ్యాయి. 2022 నుండి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమనికంఠేశ్వరాలయంలో శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహిస్తున్నారు. ఈఏడాది ప్రధాన ఆలయంలో కూడా శాకాంబరి అలంకారం నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు అలంకరణకు అవసరమైన కూరగాయలను భక్తులు ఉచితంగా సమర్పించాలన్న విజ్ఞప్తితో భక్తులు వారికి తోచిన విధంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లును విరాళంగా దేవస్థానంకు అందజేశారు. దీనితో పలమనేరు, కరా ్నటక రాష్ట్రం వడ్డేపల్లె, కోలారు, ముళబాగల్, బెంగుళూరు, తమిళనాడు రాష్ట్రం హోసూరు ప్రాంతాలలోని కూరగాయల మార్కెట్ యజమానుల నుండి విరాళంగా అందజేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయం, మణికంఠేశ్వ రాలయంలను సరా ్వంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈఆలయాల ప్రాంగణం మొత్తా్న్ని కూరగాయలు, పండ్లుతో అలంకరిస్తున్నారు. వేకువ జామున అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం కూరగాయలు, పండ్లుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

## జగన్ బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసే ప్రయత్నం : మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం వైఎస్ జగన్ మామిడి రైతాంగాన్ని పరామర్శించే చిత్తూరు జిల్లా పర్యటనకు అడ్డుకునేందుకు బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు.మూడు వేల మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. పెట్రోల్ బంకుల వద్ద పోలీసులను కాపలా పెట్టారు. అనేకమందిని హౌస్ అరెస్ట్ చేశారు. హెలీప్యాడ్ వద్ద జనం ఎక్కువ వచ్చారని లాఠీఛార్జ్ చేశారు. విచ్చలవిడిగా పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారు. పోలీసులు ఉంది లా అండ్ ఆర్డర్ కాపాడడానికా జగన్ పర్యటనను అడ్డుకోవడానికా? అంటూ విగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బయటకు వస్తున్నారంటేనే వేలమంది పోలీసులు బంగారుపాళ్యం వచ్చారు. జగన్‌ను చూడడానికి వీల్లేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు అంబటి రాంబాబు. జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి రైతుల సమస్యలను తెలుసుకుంటున్నారు. అనేక మార్లు అనుమతిలేదని చివరికి గత్యంతరంలేక అనుమతి ఇచ్చారు. బంగారుపాత్యం హెలిప్యాడ్ హెలిప్యాడ్ వద్ద అనేక ఆంక్షలు పెట్టారు. పెట్రోల్ బంక్‌లో పెట్రోలు కొట్టకుండా నిర్భందిస్తున్నారు. జన సమీకరణ చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ మణికంఠ మాట్లాడడం బాధాకరం అన్నారు. అయితే, నారా లోకేష్ ఏం చెప్తే అది చేస్తారా? ఐపీఎస్ అధికారి అనే విషయాన్ని మరిచి నారా లోకేశ్ కోసం చెంచాలు మాదిరిగా కొందరు పోలీసులు పని చేస్తున్నారు అని దుయ్యబట్టారు. అయితే, మీ లాఠీతో జగన్‌కు వస్తున్న ఆదరణను ఆపలేరన్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత పెంచుకుంటుంది. జగన్ మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రజల ప్రవాహాన్ని ఉప్పెనను మీరు ఆపలేరు చిత్తూరు మామిడి పంటను ధర లేక రోడ్ల మీద పడవేసి రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక వాహనాలను తనిఖీ చేసి, కొన్ని వాహనాలకు నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు, మామిడి రైతులను పరామర్శిస్తే తప్పు ఏంటి? మీకు ఎందుకు అంత భయం అని నిలదీశారు రాంబాబు, ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారు. మేము ఎక్కడ జన సమీకరణ చేయటంలేదు. బుర్ర లేని నారా లోకేశ్ మాటలు ఐపీఎస్ అధికారులు వినటం బాధాకరం అన్నారు. కూటమిప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు ఒక్కొక్కటి వికటిస్తున్నాయి. ప్రజలకు మీరు మంచి చేస్తే భయం ఎందుకు? రాష్ట్ర డీజీపీ మాకు కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. అందుకే ఆయనకు మళ్లీ పోస్టింగ్ పొడిగిస్తున్నారు.

## అంబరాన్నంటిన శాకంబరి ఉత్సవ సంబరాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 9, ప్రభాతవార్త** ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం నాడు జగన్మాత దుర్గమ్మ వారు శాకంబరి మాతగా దర్శించుకోటానిక భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. దుర్గమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని అందించారు.

- నేడు గిరి ప్రదక్షణ:

దుర్గమ్మ వారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ కార్యక్రమం గురువారం ఆషాఢమాసం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55లకు ఘాట్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ కామధేను ఆలయం వద్ద ప్రారంభిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ వ్యాసపౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలన్నారు.



కూరలు, పండ్లతో అలంకరించిన దుర్గమ్మ ఆలయ ప్రాంగణం



శాకంబరిగా భక్తులను అనుగ్రహిస్తున్న దుర్గమ్మ

- నేడు పూర్ణాహుతి :

10 వ తేదీన గురువారం సప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణము, హోమము, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజ, ఉదయం 9.30కు పూర్ణాహుతి నిర్వహిస్తారు.

- అలరించిన నృత్యనీరాజనం:

దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కోలాటం, నృత్యప్రదర్శనలు భక్తులను అలరించాయి. విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి నృత్యాలయం విద్యార్థులు నృత్యాచార్యులు సప్ప శివకుమార్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు.

- ఇఓకు క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ అభినందనలు:

దుర్గమ్మవారిని ప్రముఖ క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించగా ప్రసాద్ ఇఓను అభినందించారు.



## రొట్టెల పండగకు 2 లక్షల మంది భక్తులు

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 9, ప్రభాతవార్త** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు 4వ రోజు భక్తుల రద్దీ కొనసాగింది. నెల్లూరు నగరవాసులు భారీగా విచ్చేశారు. బుధవారం సుమారు 2లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం, కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

## పేదరికాన్ని రూపుమాపడంలో కలిసికట్టుగా పని చేయాలి:మంత్రి కొల్లు రవీంద్ర

### పేదల సంక్షేమాభివృద్ధికి పి-4 కార్యక్రమం

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్నర్‌షిప్ (పి 4) విధానం ద్వారా పేదల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృష్ణాజిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించి పి-4 కార్యక్రమం అమలుపై పట్టణ, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు తదితరులతో సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 కార్యక్రమ ఉద్దేశాన్ని వారు వివరించి, సలహాలు, సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పి 4 ప్రపంచంలోనే ఒక గొప్ప కార్యక్రమం అని పేర్కొంటూ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం రూపకల్పన చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వ్యక్తుల సహకారంతో దిగువ కుటుంబాలను పైకి తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని, తద్వారా 2029 నాటికి సమాజంలోని పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు సాధ్యమవుతుందన్నారు. పి 4 పథకం సమాజంలోని అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులను ప్రోత్సహించి, దిగువన ఉన్న 20 శాతం పేద ప్రజలను దత్తత తీసుకొని వారికి మద్దతు ఇచ్చేలా చేస్తుందని, ధనవంతులు మార్గదర్శిగా వ్యవహరిస్తూ దిగువన ఉన్న బంగారు కుటుంబాలకు చేయూతనందించేలా చేస్తుందన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్లో 19,17,151 బంగారు కుటుంబాలు గుర్తించగా, అందులో 1,64,546 బంగారు కుటుంబాలను 10,343 మంది మార్గదర్శిలు దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. కృష్ణాజిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించగా, అందులో 2,723 బంగారు కుటుంబాలను 3,44 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని, మచిలీపట్నం నియోజకవర్గంలో 9,778 బంగారు కుటుంబాలు గుర్తించామని, అందులో 398 బంగారు కుటుంబాలను 106 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని మంత్రి తెలిపారు.





పి-4 కార్యక్రమం అమలుపై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

### అందరికీ మంచి జరగాలని ప్రార్థించా : తెలంగాణ ఎమ్మెల్సీ

**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు తెలంగాణ ఎంఎల్‌సి అంజిరెడ్డి తెలిపారు.

స్వామివారిని విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. స్వామివారు ముహిమాన్విత దేవుడని, ఆయన దర్శనంతో మనసు ఆనందంగా ఉందన్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పుట్టపర్తిలో సత్యసాయి భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

### - సౌకర్యాల లేమితో అధికారుల పాట్లు - నేడు కొత్తచెరువులో సిఎం చంద్రబాబు పర్యటన - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భారీ ఏర్పాట్లు

**అనంతపురం జులై 8 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్త చెరువు మండలంలో గురువారం పర్యటించనున్నారు. కొత్త చెరువు మండలంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల, సత్యసాయి బాలుర, బాలికల పాఠశాలలో జరిగే మెగ ఆపిటిఎం-2.0(మెగా పేరెంట్ టీచర్స్) కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండల కేంద్రంలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం సర్వశక్తులు వడ్డుతున్నారు. ఇందులో భాగంగా, సత్యసాయి జిల్లాలో కొన్ని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వార్త ఓ ప్రయత్నం చేస్తోంది. అనంతపురం జిల్లా నుంచి సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడింది. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు సత్యసాయిబాబా పేరును జిల్లాకు నామకరణం చేయడం హర్షం వ్యక్తం అవుతోంది. అదే సమయంలో పుట్టపర్తి కేంద్రంగా కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు అధిక శాతం శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అనుబంధంగా ఉన్న భవనాల్లోనే నడుస్తున్నాయి. పక్కాగా ప్రభుత్వ భవనాలు లేనందున అధికారులు, సిబ్బంది అనేక అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయే ప్రజలు కూడా అనేక అవస్థలకు గురవుతున్నారు. పుట్టపర్తితోపాటు కొత్తచెరువు, బుక్క పట్నం మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కువ భాగం భగవాన్ సత్యసాయి బాబా నిర్మించిన భవనాల్లోనే కార్యాలయాలు ఉన్నాయి. స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యాలయాలు నడుపుకునేందుకు సత్యసాయిసి సెంట్రల్ ట్రస్ట్ వారు తాత్కాలికంగా అనుమతి ఇచ్చినప్పటికీ అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తగిన చొరవ తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. సత్యసాయి జిల్లా కేంద్ర మైన పుట్టపర్తికి మడకశిర తదితర అన్ని ప్రాంతాల నుంచి లింక్ రహదారులు ఇంకా పకడ్బందీగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆ దిశలో నిర్మాణాలు కొనసాగుతున్న ప్పటికీ పూర్తి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో పుట్టపర్తి మండలంలోని కప్పలబండ ఏపిఐఐటి ఆధ్వర్యంలో ప్రోత్సహించేందుకు 100 ఎకరాల భూమి కొనుగోలు చేశారు.



## రేపు వెలగపూడిలో 'ప్రపంచ జనాభా దినోత్సవం'

**- హాజరుకానున్న సిఎం చంద్రబాబు**

**- ఏర్పాట్లు పరిశీలించిన గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 9:** ఈ నెల 11వ తేదీన తుళ్ళూరు మండలం వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయం సమీపంలో 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న నేపధ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి సంబంధించి సభాస్థలి ఏర్పాట్లు, బారికేడ్లు,, వాహనాల పార్కింగ్ , సీటింగ్ , త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.

# అమరావతి స్ఫూర్తితో 'తుడ' అభివృద్ధి

### - సంస్థ పరిధిలో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణం - పంచాయతికార్యదర్శుల సమావేశంలో తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి కీలక నిర్ణయాలు

**తిరుపతి,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన తిరుపతి నదరానికి శ్రీవారి దర్శనార్థం ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులు వస్తున్నారని, ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడ కల్పిస్తుందని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. సిఆర్‌డిఎ పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తుడ పరిధిలో అభివృద్ధి పనులు మొదలుపెట్టామన్నారు. రాష్ట్రఅభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువమంత్రి నారాలోకేశ్ పడుతున్న కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడ అభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు. తుడ అభివృద్ధిలో కీలకమైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం తిరుపతిలోని కచ్ఛపి సమావేశం మందిరంలో తుడ ఉపాధ్యక్షుడు శుభం బన్సల్‌తో కలసి తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి సుదీర్ఘసమావేశం నిర్వహించారు. తుడ పరిధిలోని ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఈ పనుల్లో పంచాయతి కార్యదర్శులు పూర్తిసహాయసహకారాలందించాలని ఆయన కోరారు. తుడ పరిధిలో లేఅవుట్ల అనుమతులు సరళతరం చేస్తున్నామని, అక్రమ లే అవుట్లు ,అనుమతులులేని భవన నిర్మాణాలు పంచాయతి కార్యదర్శులు గుర్తించాలన్నారు. సమాజ అభివృద్ధిలో మీ భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రచరిత్రలోనే మొదటిసారి 4 మున్సిపాల్టీలు, 9నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఒలు, 1,100పైగా గ్రామపంచాయతీలు కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. పంచాయతి పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలని, భవననిర్మాణాల అనుమతులు తదితర అంశాలనుకూలంకుషంగా వివరించారు. మండలాలు, జిల్లాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని, వారి హోదాకు ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని తుడ ఛైర్మన్ స్పష్టం చేశారు.



## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసకర ర్యాలీలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతుల పరామర్శ పేరుతో విద్వంసకర ర్యాలీలు చేయడం జగన్ కే చెల్లాయని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బంగారుపాళ్యంలో హెలీప్యాడ్ నుంచి పర్యటన చేసే స్థలం వద్దకు ర్యాలీగా రావడంపై మండిపడ్డారు. హెలిప్యాడ్ వద్దకు 30 మందికి అనుమతిస్తే 300 మంది వచ్చారన్నారు. సీఎం గా పని చేసిన వ్యక్తి ఈ సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారమే ర్యాలీలు చేస్తున్నారన్నారు. పోలీసులు, విలేకరులపైనా దాడులకు తెగబడుతున్నారన్నారు. మంత్రివర్గం సమావేశం అనంతరం సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్ ,అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. రాబోయే సమస్యలను ముందే ఊహించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చిత్తూరు,అన్నమయ్య, జిల్లాల్లో మామిడిరైతులుఇబ్బందులు పడ్డారు. 2.5 లక్షల టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి జరిగింది. మామిడతి ఉత్పత్తి బాగా పెరిగే సరికి ధర తగ్గింది. తోతాపురి మామిడిని పల్ప్ పరిశ్రమలే కొంటాయి. గతేడాది నిల్వలు ఉండటంతో ఆ పరిశ్రమలూ ఆసారి కొనలేదు. తోతాపురి మామిడిని రూ.12కు కొనాలని నిర్ణయించాం. రూ.8కు మామిడికొనాలని ఆయా పరిశ్రమలకు చెప్పాం. ప్రభుత్వం తరపున కిలోకు రూ.4 సాయం చేస్తామని చెప్పాం. అన్నమయ్యజిల్లాల్లో 99శాతం కొనుగోలు చేశాం. చిత్తూరు జిల్లాలో 80 శాతంకొనుగోలు జరిగింది.

### పాపాలు చేసిన జగన్ నాకు శాపాలు పెట్టడం ఏంటి? : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంది మీరే కదా జగన్‌గారు అంటూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు.,"ఎక్స్" వేదికగా ఆయన మాజీ సీఎం జగన్‌పై పలు విమర్శలు చేసారు.

ఇప్పుడు దొంగే దొంగా దొంగ అన్నట్టు, ఎందుకీ నాటకాలు? 2020- 21లో మొదటి బ్యాచ్ ప్రారంభం అయ్యింది. యూనివర్సిటీకి కనీసం సొంత బిల్డింగ్ లేకుండా, ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా 3 ఏళ్ళు నడిపించింది మీ ప్రభుత్వంలో కాదా? కనీసం ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా కన్సల్టెంట్లతో నడిపించి, విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు.

# కీలక పోస్టుల భర్తీకి చర్యలు

## ఎంవిఐ పాసింగ్ పెరేడ్‌లో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



బుధవారం ఎంవిఐల గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికిరవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంవిఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏఎంవిఐలకు అవార్డులు ప్రదానం చేశారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజా యుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఏఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్‌లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు.రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్( ఏఐ) తీసుకొచ్చి వెహికల్ ఫిట్‌నెస్ చేస్తున్నామన్నారు. మీరంతా రవాణా శాఖలోకి రావడంతో ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టమైందన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చిందని, రోడ్డు ప్రమాదాల నివారణకేంద్రం చర్యలు తీసుకో వాలని ఇప్పటికే విద్యలో ఉన్న 300కి పైగా సిబ్బందికి 2నెలలపాటు శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లో ఈవీ, సీఎన్జీ ఎల్పీజీ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.దేశంలో రవాణాశాఖలో నియామకం అవుతున్నవారందరికీ మీరు రోల్ మోడల్‌గా ఉండాలని,జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకుని మీ తల్లితండ్రులతో పాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# విద్యార్థులకు మోడీ కిట్స్ ఇస్తా

## సైకిళ్లు పంపిణీ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త: కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పదవతరగతి చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన బండి సంజయ్ వాటిని దశల వారీగా పంపిణీ చేసే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మొదట కరీంనగర్‌టౌన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి,ఆర్డీఓ, డీఈవోతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాలనే మా లో ఎమ్మెల్యేలు స్ఫూర్తినింపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు.వారి బాటలో నడుస్తూ మాకు చేతనైనంత సాయం చేస్తున్నాం. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చింది జిల్లా కలెక్టర్, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారు. ఆ ఆలోచనతోనే టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నం. ఇవి ప్రభుత్వ నిధులు కావు. అట్లని నేను కొట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదు. మా దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమాన్యాలను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్ఆర్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందిస్తే వాటితో సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నా. నేను కూడా చిన్నప్పటి నుండి మీలాగే


బుధవారం కరీంనగర్‌లో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

పేదరికంలో పెరిగిన. ఇక్కడే కాపువాడలో పుట్టి పెరిగిన. తినడానికి ఇబ్బంది పడ్డ. మా తల్లిదండ్రులు మమ్ముల్ని ఎంతో కష్టపడి చదివించారు. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే మీరు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో రోల్ మోడల్. ఓపిక సంది వచ్చి కష్టపడి పని చేస్తూ మీఅందరికీ స్ఫూర్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ బీహార్ నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన తండ్రి మిలటరీలో పనిచేశారు. క్రమశిక్షణతో ఎదిగి వచ్చారు. వీళ్లే కాదు... మహాత్మా గాంధీ, అంబేద్కర్, మోదీ కూడా పేదరికం నుండి ఎదిగిన వాళ్లే.ముఖ్యంగా అంబేద్కర్ ఎన్ని కష్టాలు అనుభవించారో, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారో మాటల్లో చెప్పలేం. ఇప్పుడు మీ కష్టాలను తీర్చడానికి మోదీ ఉన్నారు. మా హయాంలో ఆయనకే వాళ్లే లేరు.మోదీ ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728!!కోట్లు మాత్రమే కేటాయిస్తే. ఈ ఏడు ఏడాది(2025 26) 1 లక్షా 28వేల 650 కోట్ల రూపాయలు కేటాయించింది. అంటే యూపీఏతో పోలిస్తే విద్యా రంగానికి నిధుల కేటాయింపు రెట్టింపు పెరిగింది. ఈ 11 సంవత్సరాల్లో ఒక్క విద్యా రంగానికే దాదాపు 8!!లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశామంటే విద్యా రంగంపై మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే...ఇన్ని నిధులు ఖర్చు చేస్తున్నా విద్య అనేది 1976 వరకు రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా నిధులు కేటాయిస్తుంది. అయితే పాఠశాలలను నడిపే బాధ్యతను, స్థానిక భాషలో పాఠ్యాంశాలు బోధించే అంశాలను అమలు చేయాల్సింది మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో విద్యా రంగం ముందుకు సాగుతుందని నమ్ముతూనే ఈ జాతీయ విద్యా విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది.మీకందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్. అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో "మోదీ కిట్స్"ను అందజేయబోతున్నాం. ఎన్ని వేల మంది ఉన్నా. ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్ ను అందిస్తామని అన్నారు.

# మూతపడిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు సహకరించండి

## కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త :తెలంగాణలో మూతపడిన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణకు చొరవ చూపాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకు కేంద్ర మంత్రి హెచ్ డి కుమార స్వామి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు ప్రస్తావించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సిసిఐ, ఎస్ఐఐఎల్ పై కేంద్రమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి,ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేసేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు నోచుకున్నట్లుగానే సిసిఐ,ఎస్ఐఐఎల్‌ల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ అవసరాన్ని, ప్రాధాన్యతను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి తెలిపారు.గతంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు రూ. 5000 కోట్లతో చేపట్టిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) మూతపడటానికి దారితీసిన పరిస్థితులను,ఈ పరిశ్రమల పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యపడి రాష్ట్ర,దేశం ప్రగతిబాటలో పయనిస్తాయని కేంద్రమంత్రికి వివరించారు.ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సిందిగా కోరారు.సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు.ఈ నెలాఖరులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, తెలంగాణలో నెలకొని వున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్షను నిర్వహిస్తానని కేంద్రమంత్రి మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేయపోతే యుద్ధమే: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్,జులై 9,ప్రభాతవార్త :స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే రాష్ట్రంలోని బీసీలంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజారామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), ఆర్టికల్ 16 (4) ప్రకారం ఏ వర్గాలకైతే సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. కుల గణన లెక్కల ఆధారంగా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఐటీఎం బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన ద్వారా 63 రిజర్వేషన్లు ఇచ్చి, బీసీలకు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇస్తే అధికారం తమ చేతుల్లో ఉన్నట్టే. కేంద్ర ప్రభుత్వంపైన నెపం తప్పించుకోవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లితే మండల్-2 ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీసీ హిందూ ఆజాది జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరులు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లోడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ్ యాదవ్, గొర్ల కాపరుల సంక్షేమ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటోజు ఆయోధ్య యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు అంజి యాదవ్, క్రాంతి యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


బుధవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్ తదితరులు

# 23, 24 తేదీలలో 'చలో ఢిల్లీ' : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ (ప్రభాత), జులై 9 ప్రభాతవార్త: దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24 'చలో ఢిల్లీ' పేరిట ఒబిసి జాతీయస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి బీసీలు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చలో ఢిల్లీ సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కే ంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు కవిత హైందవి, జోషి, రవియాదవ్, వల్లి సతీష్, పల్లెపల్లి అంజి, రాందేవ్, నిఖిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అభయ హస్తం దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం ఒక ప్రకటనలో ఈ పథకం ద్వారా రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈనెల 7వ తేదీతో ముగిసిపోయిందని, అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకుదాన్ని ఈ నెల 12వ తేదీ వరకు పెంచుతూనిర్ణయంతీసుకున్నట్లు వెల్లడించారు.

# గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు క్రైమ్,జులై 9,ప్రభాతవార్త : స్థానిక 25,31వ డివిజన్లలో సుమారు రూ.2కోట్ల తో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..25వ డివిజన్‌లో సాయినగర్ క్రాస్ రోడ్లలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు,డ్రైను ,,గాంధీనగర్ మెయిన్‌రోడ్డు మరియు ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో రూ.50లక్షలతో సీసీ డ్రైన్లు మరియు ఆర్సీసీ కల్ వర్టులు,అలాగే అదర్శనగర్ 2వ లైన్ మెయిన్‌రోడ్డులో రూ.16 లక్షలతో సీసీ డ్రెయిన్లు మరియు ఆర్‌సీసీ



కల్వర్టుల నిర్మాణం, సుబ్బారెడ్డి, నగర్ మెయిన్‌రోడ్డులో 2మరియు 5వ లైన్లలో రూ.49లక్షలతో సీసీ రోడ్లు,31వ డివిజన్ ఏటి అగ్రహారం 1,2క్రాస్ రోడ్లలో 35లక్షలతో సిసి డ్రెయిన్లు మొత్తం రూ.2కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.అభివృద్ధి సంక్షేమం తో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.ఇప్పటికే ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు జీరో లైన్ నుండి పనులు ప్రారంభం య్యాయి. పనులు వేగంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు,దాసరి జ్యోతి, అడపా మాణిక్యాల రావు,కదిరి సంజయ్, సాయి ,,బుడే,బిజెపి బుజ్జి,ప్రసాద్,వేముల చిన్న తదితరులు పాల్గొన్నారు.


# సైబర్ నేరాల నివారణపై బ్యాంకు మేనేజర్లతో సమన్వయ సమావేశం : ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు క్రైమ్,జులై 9,ప్రభాతవార్త : జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో సైబర్ నేరాల నిరోధానికి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు.ఆందులో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు శాఖ మరియు బ్యాంకులు కలిసి సమన్వయంతో పనిచేయడం అవసరం ఎంతైనా ఉందన్నారు.బాధితులు 1930కి నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా సమీపంలోని పోలీస్/ బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చన్నారు.ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసిన బాధితులకు ఎఫ్‌ఐఆర్ అవసరం లేకుండా సహాయం చేయబడుతుంది.ఇది నేర నివారణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నదన్నారు.ఖాతాదారులు ఇతర రాష్ట్రాల్లో లేదా విదేశాల్లో ట్రాన్స్‌ఫర్ లు జరిపే సమయంలో బ్యాంకులు వారిని ఒకసారి హెచ్చరించి ఆ లావాదేవీలు నిజమైనవా కాదా పరిశీలించాలి.డిజిటల్ అరెస్టులు,పెట్టుబడి మోసాలు,లోన్ యాప్ మోసాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలి.ఈ మోసాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు.మొబైల్ ఫోన్లు మరియు బ్యాంకింగ్ వ్యవస్థల ద్వారానే ఎక్కువ సైబర్ నేరాలు జరుగుతున్నందున ఈ మార్గాల్లో వినియోగదారులను అప్రమత్తం చేయడం అత్యంత కీలకం అని తెలిపారు.బిల్ కాన్ఫరెన్స్,మెసేజ్,ఈమెయిల్స్ వంటి కమ్యూనికేషన్ చానెల్స్ ద్వారా ఖాతాదారులకు సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి సైబర్ నేరాల బాధితులకు అండగా ఉండి,వారి నివారణకు బ్యాంకుల భాగస్వామ్యంతో మేము కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.పోలీసు శాఖ తరపు నుండి బ్యాంకు ఖాతాదారులకు ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సూచనలతో కూడిన బ్రోచర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి,కె.సుప్రజ క్రైమ్, యూనియన్ బ్యాంక్ డిజీఎం జహార్,లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి,గుంటూరు జిల్లా ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా,అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందజేసిన పరికరాలను విద్యార్థులకు ఉపయోగించండి

### ఎం ఈ ఓ శ్రీనివాసరావు

పెదనందిపాడు జులై 9 (ప్రభాతవార్త) ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పరికరాలను. వారు సద్వినియోగపరుచుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి ముద్దన



శ్రీనివాసరావు అన్నారు. పెదనందిపాడు మండల విద్యా వనరుల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, విద్యార్థులకు. ఐదు వీల్ చైర్స్, రెండు రోలేటర్స్, ఒక సీపీ కమాండ్, రెండు బ్రెయిలీ కిట్స్ ను తదితర ఉపకరణాలను ఆయా విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాసరావు, కొత్తపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనితలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల విద్యార్థుల తల్లిదండ్రులకు వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ ఎస్ బాల బ్రహ్మచారి. ఉపాధ్యాయులు ఎస్ పరిమళ,కెవిఎస్ పూర్ణచంద్రరావు. తదితరులు పాల్గొన్నారు.

# పెదనందిపాడులో విజయవంతమైన సార్వత్రిక సమ్మె, ప్రజాసంఘాల ర్యాలీ

పెదనందిపాడు జులై 9 (ప్రభాతవార్త) కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పెదనందిపాడు లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి జి రమణ, సిఐటియు నాయకులు బొప్పుడి రమేష్ బాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని ప్రజా సంఘాలు విధులను బహిష్కరించి ఈ సమ్మెలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలని, ప్రతి ఐదు ఏళ్లకు వేతనాలు పెంచాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, ప్రభుత్వ స్కీముల కింద పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ విరమించుకోవాలని, విద్యుత్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని, అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ మహిళ సంఘం, కౌలు రైతు సంఘం, రైతు సంఘం, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



# సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన: యాగంటి

## - శ్యామరాజపురంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

మాచర్ల, జులై 9 ప్రభాతవార్త: దుర్గి మండలం శ్యామరాజపురం గ్రామంలో సువరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందడంతో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సీపీ పాలనలో ఇంటింటికి మోసం జరిగిందన్నారు. వైఎస్సీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుందన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ముందుచూపుతో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని యాగంటి మల్లికార్జునరావు వెల్లడించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి యాగంటి నరేష్, బూత్ ఇన్‌ఛార్జి మారబోయిన బుజ్జి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బట్టు శ్రీను, గ్రామ సర్పంచ్ తాటి రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు జానకిరామయ్య, పసుమర్తి బుజ్జి, గౌరి, నాగేశ్వరరావు, సీతయ్య, మండల నాయకులు మారుబాల నారాయణ, మేకల దాసు, తిక్కా కొండలు, ప్రసాద్, సింగు నాగేశ్వరరావు, దిగుమర్తి సుబ్బారావు, గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

మాచర్ల, జులై 9 ప్రభాతవార్త: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు మాచర్ల మండల వ్యవసాయ అధికారిణి డి.పావనిమూర్తి తెలిపారు. మాచర్ల మండల పరిధిలోని రైతులు, లబ్ధిదారుల జాబితాలో పేర్లను తనిఖీ చేసుకోవాలన్నారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని రైతులు గ్రామ రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ పోర్టల్‌లో ఈ నెల 13వ తేదీలోపు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.అంజినాయక్, కె.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

# కోన ప్రభాకరరావు జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

బాపట్ల,జులై09,ప్రభాతవార్త: మాజీ గవర్నర్ శాసన సభాపతి మంత్రి బాపట్ల ముద్దు బిడ్డ కోన ప్రభాకరరావు జయంతి వేడుకలను జయప్రదం చేయాలని బాపట్ల మాజీ శాసన సభ్యులు,మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మూడు పర్యాయాలు శాసన సభ్యులుగా ఎన్నికైన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన కోన ప్రభాకరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ..దీనిలో భాగంగా పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి ఆటోనగర్ రైతులు,కార్మికులు,కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి పాతబస్టాండ్‌లోని కోన ప్రభాకరరావు విగ్రహం ఉన్న ప్రాంతం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కోన ప్రభాకరరావు విగ్రహ ఏర్పాటుకు ఎందుకు రాజకీయం చేస్తున్నారో రాష్ట్రం దాటి పోయిన ప్రజాప్రతినిధులు వ్యవహరించడం సరైనది కాదన్నారు. మూడు పర్యాయాలు నియోజకవర్గానికి శాసన సభ్యులుగా ఘనతను సమానం చేసిన వారు లేరన్నారు. నిరంతరం బాపట్ల అభివృద్ధే ధ్యేయంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి ప్రభాకరరావు అన్నారు.బాపట్ల నియోజకవర్గానికి సాగునీరు,తాగు నీరు అందించి క్రమంలో పలు కాలువలకు ఏర్పాటు చేయించి రైతాంగాన్ని లాభాల బాటలో నడిపించారన్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన సమయం నుంచి ఇప్పటి వరకు బాపట్ల పట్టణ ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు లేకుండా ఉండటానికి ఆనాడు ఆయన చూపిన ముందుచూపే కారణమన్నారు. శ్రీరామానుజం, రాజకీయ నాయకుడిగా నటుడిగా నిర్మాతగా విభిన్న రంగాలలో ప్రతిభా పాటవాలను చాటిన మహోన్నత వ్యక్తి ప్రభాకరరావు అన్నారు. ఆయనలో గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి పాలకులు రాజకీయాలు చేస్తున్నారన్నారు.బాపట్ల విద్యాక్షేత్రంగా రూపుదిద్దుకోవటానికి ప్రభాకరరావు కృషిచేసి ఆనాటి బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటు చేశారన్నారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి బాపట్లలో ఆయన చేసిన కృషి ఎంతో మందికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు.బాపట్ల నియోజకవర్గం నుంచి ఎంపికై అనేక పదవులు అలంకరించారన్నారు.ఆయనలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. బాపట్లలో కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 2024ఎన్నికల ముందు రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో ఉన్న పలు విగ్రహాలు తొలగించడం జరిగిందన్నారు. తిరిగి వాటిని తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేస్తామని నిర్ణయించి పోలీసు శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు. తొలగించిన విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులదే అని ప్రశ్నించారు.తొలగించిన విగ్రహాలను మరల ఏర్పాటు చేయటానికి కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు,మండల పార్టీ అధ్యక్షుడు మరుప్రోలు కొండలరెడ్డి,జోగి రాజా,తన్నీరు అంకమ్మరావు,పువ్వాడ శ్రీనివాస రెడ్డి,మాజీ ఎంపీటీసీ వాలి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10-7pg10exAP.qxd:10-7pg10exAP.qxd 01/01/01 7:31 AM Page 1





## ఆర్చరీ ప్రపంచ కప్.. జ్యోతి, రిషబ్ వరల్డ్ రికార్డు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్ అథ్లెట్లు వెన్నం జ్యోతి సురేఖ-రిషబ్ యాదవ్ కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 4 లో మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ఇరువురు అద్భుత ప్రదర్శన చేశారు. మాడ్రిడ్‌లో జరిగిన ఈ ఆర్చరీ పోటీల్లో జ్యోతి మరియు రిషబ్ మొత్తం 1431 స్కోరుతో 2023 యూరోపియన్ గేమ్స్ తర్వాత డెన్మార్క్‌కు చెందిన టాంజా గెల్లెంథియన్ మరియు మథియాస్ ఫుల్లెర్టన్ పేరిట ఉన్న 1429 పరుగుల ప్రపంచ రికార్డును అధిగమించారు. ముఖ్యంగా రిషబ్ పూర్తి స్థాయిలో రాణించాడు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో అతను 716 పాయింట్లు సాధించి వేదికపై అగ్రస్థానంలో నిలిచాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ స్కోరు మాత్రమే కాదు, 716 స్కోరు బ్రాడెన్ గెల్లెంథియన్ పేరిట ఉన్న పురుషుల వ్యక్తిగత ప్రపంచ రికార్డుకు కూడా కొంచెం దూరంలో ఉంది. అదే సమయంలో జ్యోతి అంతర్జాతీయ వేదికపై కూడా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేసింది, మహిళల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో 715 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మిశ్రమ కాంపౌండ్ జట్టు మొత్తం అంటే ఇద్దరు ఆర్చర్ల వ్యక్తిగత స్కోర్లు కలిపితే వస్తుంది.



## వింబుల్డన్‌లో జోకోవిచ్ ముందడుగు

**న్యూఢిల్లీ:** ఏడు సార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ 2025 వింబుల్డన్ టోర్నమెంట్‌లో తనదైన ముద్ర వేశాడు. నాలుగో రౌండ్‌లో అలెక్స్ డి మినార్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మొదటి సెట్ కోల్పోయినప్పటికీ అద్భుతంగా పుంజుకొని తర్వాతి మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదిలో తడబడినప్పటికీ జకోవిచ్ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు. 2016 తర్వాత వింబుల్డన్‌లో ఇంత త్వరగా బయటపడే ప్రమాదం ఉన్నప్పటికీ జకోవిచ్ డి మినార్‌ను 1-6, 6-4, 6-4, 6-4తో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 38 ఏళ్ల జకోవిచ్ పేలవమైన ఆరంభం చేసి మొదటి సెట్‌ను చేజార్చుకున్నాడు. అయితే జకోవిచ్ వెంటనే పుంజుకుని తర్వాతి రెండు సెట్లు గెలిచి 2-1 ఆధిక్యంలో నిలిచారు. నాలుగో సెట్‌లో డి మినార్ మళ్లీ 4-2 ఆధిక్యం సాధించాడు. కానీ ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆటగాడు జకోవిచ్ వరుసగా రెండు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. ఎనిమిదో వింబుల్డన్ టైటిల్, రికార్డును మెరుగుపరిచే 25వ సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం ప్రయత్నిస్తున్న జకోవిచ్ తదుపరి రౌండ్‌లో ఇటలీకి చెందిన 22వ సీడ్ ఫ్లావియో కోబోలితో తలపడనున్నారు. ఫ్లావియో కోబోలి 2014 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ మారిన్ సిలిక్‌ను 6-4, 6-4, 6-7, 7-6తో ఓడించి తన కెరీర్‌లో తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

# నేటి నుండి మూడో టెస్టు

### సిరీస్ అధిక్యం కోసం భారత్ పట్టు.. టీమ్‌లో మరిన్ని ఛేంజింగ్స్

**న్యూఢిల్లీ:** ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ గట్టి పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో టీమిండియాలో మళ్లీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ నెల 10 నుంచి 14 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరగనున్న మూడో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంతో దూసుకెళ్లేందుకు భారత్ వ్యూహాత్మకంగా బరిలోకి దిగబోతోంది. హెడింగ్లీ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓడిపోయినా ఎడ్జ్ బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ ఘన విజయాన్ని





అందుకుంది. దీంతో ప్రస్తుతానికి సిరీస్ 1-1తో సమంగా ఉంది. రెండో టెస్టులో విజయం సాధించినప్పటికి మూడో టెస్టులో జట్టులో మార్పులు తప్పవనే విషయాన్ని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇప్పటికే వెల్లడించాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రెండో టెస్టుకు విశ్రాంతినిచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా మూడో టెస్టులో ఆడడం ఖాయం. అదే సమయంలో జట్టులో ఇంకొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో సత్తా చాటడడంతో పేస్ ఆల్‌రౌండర్‌గా ఆస్ట్రేలియాలో రాణించిన నితీశ్ కుమార్‌ని కాదని శార్దూల్ ఠాకూర్‌ను తొలి టెస్టుకు తీసుకున్నారు. అయితే శార్దూల్ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలం అయ్యా డు. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్ 8 బంతుల్లో 1 పరుగు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 12 బంతుల్లో 4 పరుగులు మాత్రమే చేశాడు. ఇక బౌలింగ్‌లో 2 వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టుకు శార్దూల్‌ను పక్కన బెట్టిన మేనేజ్‌మెంట్ నితీశ్‌కు చోటు ఇచ్చింది. వచ్చిన అవకాశాన్ని ఈ హైదరాబాదీ ఆటగాడు సద్వినియోగం చేసుకోలేక పోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 బంతుల్లో 1 పరుగే చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 2 బంతులు ఆడి 1 పరుగే చేశాడు. ఇక బౌలింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు వేసి 29 పరుగులు ఇచ్చాడు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతడి చేతికి బంతినే ఇవ్వలేదు. ఈ మ్యాచ్‌లో నితీశ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ క్రమంలో లార్డ్స్ టెస్టులో పేస్ ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఆడించాలోనని టీమ్‌మేనేజ్‌మెంట్ సందిగ్ధంలో పడింది. అటు శార్దూల్, ఇటు నితీశ్ కుమార్‌లు ఘోరంగా విఫలం కావడంతో జట్టుకు ఎం చేయాలో పాలుపోవడం లేదు. లార్డ్స్ పిచ్ పేసర్లకు అనుకూలం కావడంతో ముగ్గురు పేసర్లతో పాటు వీరిద్దరిలో ఎవరో ఒకరికి జట్టులో చోటు దక్కడం ఖాయం. మరి నితీశ్‌కే అవకాశం ఇస్తారా? లేదంటే అనుభవానికి ఓటు వేసి శార్దూల్‌కు అవకాశం ఇస్తారా? అన్నది చూడాల్సిందే. లేక వీరిద్దరిని కాదని మరో ఆటగాడికి ఛాన్స్ ఇస్తారా ?అన్నది ఆసక్తికరంగా మారింది.




## వరల్డ్ నం. 1గా హ్యారీ బ్రూక్

### బౌలింగ్ టాప్‌లో బుమ్రా..

### బ్యాటర్ల టాప్10లోకి గిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ నెంబర్1గా ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో సరికొత్త రారాజుగా ఉద్భవించాడు. ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఇంగ్లండ్ వైస్ కెప్టెన్ 886 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. అతడి తర్వాత స్థానంలో జో రూట్ 868 పాయింట్లతో ఉన్నాడు. భారత్‌తో ఇటీవల ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ 158 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేసి చెలరేగాడు. అంతకు ముందు తొలి టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ రాణించాడు. ఈ క్రమంలో అతడు వర్ల్డ్ నెంబర్ 1 టెస్టు బ్యాటర్‌గా అవతరించాడు. ఇక ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (269), రెండో ఇన్నింగ్స్‌లో భారీ శతకం (161) సాధించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం తాజా ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. గిల్ 807 పాయింట్లతో ఏకంగా 15 స్థానాలు మెరుగుపరచుకుని తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ అరో స్థానానికి చేరుకున్నాడు. ఇక గిల్‌తో పాటు, మరో ఇద్దరు బ్యాటర్లు టాప్10లో చోటు దక్కించుకున్నారు.

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 4వ స్థానంలో ఉండగా, వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ 8వ స్థానంలో నిలిచాడు.. మరోవైపు భారత్‌తో రెండో టెస్టులో సత్తా చాటిని ఇంగ్లండ్ కీపర్ జెమీ స్మిత్ 753 పాయింట్లతో 16 స్థానాలు ఎగబాకి 10వ ప్లేస్‌కు చేరుకున్నాడు. అయితే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా (898) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, సఫారీ పేసర్ కగిసో రబాడ (851) రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక అల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

### ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

## ఛాంపియన్‌గా భారత్ రెజ్లింగ్ టీమ్

### ఖాతాలో 6 స్వర్ణాలు సహా 8 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా అండర్ 15 ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ బృందం ఆధిపత్యం చెలాయించింది. బిష్కెక్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల ఫ్రీస్టైల్ జట్టు ఛాంపియన్‌గా, మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. కిర్గిజస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 2025 అండర్15 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ జట్లు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాయి. ఫ్రీస్టైల్ జట్టు 6 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో సహా 8 పతకాలను గెలుచుకుని మొత్తం 203 పాయింట్లను సాధించాయి. ఈ నేపథ్యంలో



166 పాయింట్లతో జపాన్‌ను అధిగమించి మొత్తం ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్లో 9 8 స్కోరుతో జపాన్ ప్రత్యర్థిపై విజయం సాధించి వాన్ష్ అహ్లావత్ పతకాల పట్టికను ప్రారంభించాడు. 44 కిలోల విభాగంలో ఆర్యన్ కిర్గిజ్ రెజ్లర్‌ను సాంకేతిక ఆధిపత్యంతో (16 6) ఓడించాడు. అలాగే ప్రథమేష్ సూర్యకాంత్ పాటిల్ తన ఉజ్బెక్ ప్రత్యర్థిని 74 తేడాతో, శరద్రుతువు నాటికి సచిన్ (68 కిలోలు) తన ఉజ్బెక్ ప్రత్యర్థిని ఓడించి గెలిచారు. రోహిత్ మాన్ తజికిస్తాన్‌పై 100 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించాడు. కార్తీక్ (85 కిలోలు) కజకిస్తాన్‌పై 31 విజయంతో పోరాడాడు. కాగా మహిళల జట్టు సాహసోపేతమైన ప్రదర్శనను ప్రదర్శించి, 202 పాయింట్లతో మొత్తం మీద రెండవ స్థానంలో నిలిచింది. జపాన్ 217 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. భారతదేశం మరియు జపాన్ మధ్య జరిగిన పోటీలో భారతదేశం 2 స్వర్ణాలు, కాంస్యాన్ని గెలుచుకుంది, చివరికి మొత్తం 3 స్వర్ణాలు, 5 రజతాలు మరియు 1 కాంస్య పతకాన్ని సాధించింది. జియా (33 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 42 తేడాతో విజయం సాధించి స్వర్ణం గెలుచుకోగా, పూర్వి శర్మ (66 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 80 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇక దీక్ష (39 కిలోలు) తన కిర్గిజ్ ప్రత్యర్థిని పతనంలో ఓడించడం ద్వారా అద్భుత ప్రదర్శన ఇచ్చింది. 58 కిలోల కాంస్య పతక పోరులో, భారతదేశం జపాన్‌ను అధిగమించి మరో పతకాన్ని జోడించింది. గ్రీకో రోమన్ రెజ్లర్లు కఠినమైన సవాళ్లను ఎదుర్కొని మొత్తం పతకాల జాబితాలో 5వ స్థానంలో నిలిచారు. చాలా మంది రెజ్లర్లు కాంస్య పతక పోటీలలో ఓడిపోయినప్పటికీ, అభిషేక్ (48 కిలోలు) ఫైనల్‌కు చేరుకుని రజత పతకాన్ని సాధించాడు, కజకిస్తాన్‌పై 80 స్కోరుతో ఓడిపోయాడు. అదనంగా, పర్నమ్ సింగ్ (68 కిలోలు) కిర్గిజ్ రెజ్లర్‌పై 101 తేడాతో ఘన విజయం సాధించి కాంస్యం సాధించాడు.



# వాణిజ్యం

## ఆపిల్ సిఒఒగా సబిహ్ ఖాన్..

**వాషింగ్టన్, జులై 9:** టెక్ దిగ్గజం ఆపిల్ నాయకత్వ బాధ్యతల్లో కీలక మార్పులు చేసింది. భారతీయ మూలాలున్న వ్యక్తికి ముఖ్య బాధ్యతలు అప్పగించింది. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జెఫ్ విలియమ్స్ కంపెనీని వీడనుండడంతో, సిఇఒ టిమ్ కుక్ అదనపు భారం స్వీకరించనున్నారు. విలియమ్స్ సిఇఒ బాధ్యతలను ఆపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సబిహ్ ఖాన్‌కు ఈ నెలాఖర్లో అప్పగించనున్నారు. ఈక్రమంలో డిజైనింగ్ టీమ్ బాధ్యతలను నేరుగా టిమ్ కుక్ స్వీకరించనున్నారు. ఇక విలియమ్స్ స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్న సబిహ్ ఖాన్‌కు సంస్థలో 30యేళ్ల అనుభవం ఉంది. గత ఆరేళ్లుగా ఆపిల్ గ్లోబెల్ సప్లై చైన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి కార్యకలాపాలనూ పర్యవేక్షిస్తున్నారు. ఖాన్ మూలాలు భారత్‌లో ఉన్నాయి. ఆయన ఉత్తరప్రదేశ్ మొరాదాబాద్ జిల్లాలో 1966వ సంవత్సరంలో జన్మించారు. ఖాన్‌కు ప్రమోషన్‌పై సిఇఒ టిమ్ కుక్ మాట్లాడుతూ, ఆపిల్ పంపిణీ వ్యవస్థలను పర్యవేక్షిస్తూనే, అత్యాధునిక ఉత్పాదక విధానాలకు సంబంధించి కీలక టెక్నాలజీల్లో సంస్థకు మార్గదర్శకత్వం చేశారు. అమెరికాలో ఆపిల్ కంపెనీ మానిఫ్యాక్చరింగ్ విస్తరణలో ఆయన కృషి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను ఆపిల్ చురుగ్గా ఎదుర్కొనేలా సిద్ధం చేశారు అని పేర్కొన్నారు. ఈ యేడాది విలియమ్స్ సిఒఒ పదవి నుంచి వైదొలగినా, సిఇఒ టిమ్ కుక్‌తో కలిసి కొంత కాలం పనిచేయనున్నారు. దీంతో పాటు డిజైన్ టీమ్, ఆపిల్ వాచ్, కంపెనీ హెల్త్ ఇనీషియేటివ్‌ను పర్యవేక్షించనున్నారు. కానీ డిజైన్ టీమ్ మాత్రం టిమ్‌కుక్‌కు రిపోర్టింగ్ చేయ నుంది. జెఫ్‌తో కలిసి సుదీర్ఘకాలం పనిచేశాను. అతడు లేకుండా నేడు ఆపిల్ ఇలా ఉండేది కాదు. ఆయన ప్రపం చంలోనే అత్యంత గౌరవప్రద మైన పంపిణీ వ్యవస్థను సృష్టించారు. ఆపిల్ వాడ్ లాంచింగ్, దాని డెవలప్‌మెంట్ పర్యవేక్షించారు. ఇక ఆపిల్ హెల్త్ వ్యూహాన్ని రూపొందించారు. అద్భుతమైన దార్శనికతతో మా డిజైనర్స్ బృందానికి నాయకత్వం వహించారు అని సిఇఒ టిమ్ కుక్ పేర్కొన్నారు.

## ఆర్‌బిఐ బాండ్లకు 8శాతానికిపైగా వడ్డీ!

**న్యూఢిల్లీ, జులై 9:** ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడంతో దాదాపు అన్ని బ్యాంకులూ ఫిక్స్‌డ్ డిపాజిటర్లపై వడ్డీరేట్లను తగ్గించాయి. దీంతో అధిక వడ్డీనిచ్చే ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల కోసం చాలా మంది చూస్తున్నారు. అధిక ప్రతిఫలం ఉన్న చోట రిస్క్ కూడా పొంచి ఉంటుంది. అలా రిస్క్ వద్దనుకునే వారికి మరో స్కీమ్ అందుబాటులో ఉంది. అదే రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రవేశ పెట్టిన ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్ 2020. ఈ బాండ్లపై అధిక వడ్డీతో పాటు ఆర్‌బిఐ సార్వభౌమ గ్యారెంటీ కూడా లభిస్తుంది. మన డబ్బుకు పూర్తి భద్రత, దీర్ఘ కాలంలో మంచి రాబడి లభిస్తుంది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో వడ్డీ రేటు ఎల్లప్పుడే ఒకేవిధంగా ఉండదు. ఆరు నెలలకోసారి మారుతూ ఉంటుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన నేషనల్ సేవింగ్స్ స్కీమ్ (ఎన్ఎస్‌సి)తో ఈ వడ్డీ రేట్లు ముడిపడి ఉంటాయి. ఎన్ఎస్‌సి వడ్డీ రేటును పెంచితే ఈ బాండ్ల రేటు కూడా పెరుగుతుంది. అలాగే



ఎన్ఎస్‌సి వడ్డీ రేటు తగ్గితే ఈ బాండ్లపై వడ్డీ కూడా తగ్గుతుంది. ఎన్ఎస్‌సి అందించే వడ్డీ రేటు కన్నా 0.35శాతం ఎక్కువ రేటు ఈ బాండ్లపై లభిస్తుంది. 2025 జులై-డిసెంబరు అర్ధ వార్షికానికి 8.05శాతంగా వడ్డీ రేటును ఆర్‌బిఐ జులై 1న ఖరారు చేసింది. నేషనల్ సేవింగ్స్‌స్కీమ్ 7.7శాతం వడ్డీరేటు లభిస్తుండగా, ఆర్‌బిఐ బాండ్లపై 8.05శాతం వడ్డీ అందుతుంది. యేడాదికి రెండుసార్లు జనవరి1, జులై1 వడ్డీ మొత్తంఖాతాలో జమ అవుతుంది.

## 24% పెరిగిన 'ఫండ్స్' పెట్టుబడులు


### 'ఆంఫీ' లెక్కలప్రకారం మొత్తం రూ.74.4 లక్షల కోట్ల టర్నోవర్

**ముంబై, , జులై 9:** భారత్ ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెట్‌లోకి పెట్టుబడులు ఒక్కసారిగా పెరిగాయి. గతనెలలో 24శాతం పెరిగి 23,587 కోట్ల రూపాయలు వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ వెల్లడించింది. గడచిన ఐదునెలల క్షీణత నుంచి ఒక్కసారిగా మెరుగుపడింది. ఈక్విటీ రంగాల్లోకి మ్యూచువల్ ఫండ్స్ 23,587 కోట్లు వచ్చాయి. అంతకుముందు నెలలో 19,013 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు ఉన్నట్లు తేలింది. గడచిన సంవత్సరం డిసెంబరు నుంచి వరుసగా తగ్గుతూనే వచ్చాయి. 41,156 కోట్ల నుంచి డిసెంబరులో 39,688 కోట్లకు దిగివచ్చాయి. ఫిబ్రవరిలో 29,303 కోట్లు, మార్చిలో 25,082కోట్లు, ఏప్రిల్‌లో 24,269 కోట్లు పెట్టుబడులు క్షీణించాయి. ఈ తగ్గుదలకు ముందు పెట్టుబడులు నవంబరులో 35,943 కోట్లు వరకూ వచ్చాయి. ఇక ఇతరత్రా చూస్తే డెట్‌ఫండ్స్‌లో 1711 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. మేనెలలో 15,908 కోట్ల కంటే కొంతమేర మెరుగనిపించింది. అంతకుముందు ఏప్రిల్‌లోనే ఫండ్స్ మార్కెట్‌లోకి కరెన్సీ, ఈక్విటీ, ఫండ్స్ రంగాల్లోకి 2.2 లక్షల కోట్లు పెట్టుబడులుగా రావడం విశేషం. మొత్తంగా మ్యూచువల్‌ఫండ్ రంగం మొత్తం 49 వేల కోట్ల మేర జూన్‌నెలలో పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. ఈ మొత్తంతో ఫండ్స్‌రంలో మొత్తం పెట్టుబడులు 74.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. మేనెలాఖరునాటికి 72.2 లక్షల కోట్లుగా ఉంటే కొంతమేర మెరుగుపడింది. ఈక్విటీ అనుసంధానిత పెట్టుబడుల పథకాల్లో 556 కోట్లు వరకూ పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ ఫండ్ కేటగిరీల్లో ఫ్లెక్సీ క్యాప్‌ఫండ్స్ జూన్‌నెలలో 5733కోట్ల వరకూ పెట్టుబడులు అందాయి. వీటికి అదనంగా స్మాల్ క్యాప్‌ఫండ్స్ 4024కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ 3754 కోట్లు పెట్టుబడులు సాధించాయి. భారీ పెట్టుబడులపరంగా ఫండ్స్ నికరంగా 1694 కోట్లు మాత్రమే వచ్చాయని ఆంఫీ ప్రకటించింది.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిసాయి. రేంజిబౌండ్ సెషన్ తర్వాత దిశా సంకేతాలు లేకపోవడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల వద్ద ముగిసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 176.43 పాయింట్లు క్షీణించి 83,536.08 వద్ద, ఎన్ఎస్ఇ నిఫ్టీ 46.4 పాయింట్లు నష్టపోయి 25,476.10 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్100 0.13శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.59శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియాల్టీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 1.49శాతం, 1.4శాతం, 1.25శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎనర్జీ, ఐటి, మీడియా, పిఎస్‌యు బ్యాంకు, హెల్త్‌కేర్ వంటి షేర్లు క్షీణించాయి. వేదాంత షేర్లు 3శాతానికిపైగా నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసిజి, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్‌లోని 17 షేర్లు ప్రతికూలంగా ముగిసాయి. అదే సమయంలో హెచ్‌సిఎల్ టెక్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు రెండు శాతం వరకు నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏసియన్ పెయింట్స్ భారీ లాభాల్లో ముగిసాయి.




## జూన్‌లో సిప్ పెట్టుబడుల రికార్డ్

**న్యూఢిల్లీ, జులై 9:** క్రమానుగల పెట్టుబడి విధానం (సిప్)లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జూన్ నెలలో రికార్డు స్థాయిలో రూ.27,269 కోట్లు మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.26,668 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు తొలిసారి రూ.27వేల కోట్ల మార్కు దాటడం ఇదే తొలిసారి. గత నెలతో పోలిస్తే మొత్తంగా మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 67శాతం మేర పెరిగాయి. మే నెలలో రూ.29,572 కోట్లు పెట్టుబడులు రాగా, జూన్‌లో ఈ మొత్తం రూ.49,310 కోట్లుగా ఉన్నట్లు మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (ఆంఫీ) బుధవారం వెల్లడించింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ కేటగిరీలో జూన్ నెలలో రూ.23,587 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.19,013 కోట్లుగా ఉంది. ఇఎల్ఎస్ఎస్ ఫండ్స్ మినహా అన్ని ఈక్విటీ కేటగిరీల్లోనూ పెట్టుబడులు తరలివచ్చాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.5,733 కోట్లు రాగా, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,024 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,754 కోట్లు వచ్చాయి. డెట్ మ్యూచుల్ ఫండ్స్ కేటగిరీలో జూన్ నెలలో నికరంగా రూ.1,711 కోట్లు పెట్టుబడులు తరలి వెళ్లాయి. మే నెలలో ఈ మొత్తం రూ.15,908 కోట్ల ఔట్‌ఫ్లో ఉంది. షార్ట్ డ్యూరేషన్ ఫండ్స్‌లోకి రూ.10,276 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్‌లోకి రూ.9,484 కోట్లు వచ్చాయి. లిక్విడ్ ఫండ్స్ నుంచి అత్యధికంగా రూ.25,196 కోట్లు తరలిపోయాయి. హైబ్రిడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోస్ 12శాతం మేర పెరిగి రూ.23,222 కోట్లుగా నమోదైనట్లు డేటా వెల్లడించింది. ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.15,584 కోట్లు వచ్చాయి. జూన్ నెలలో గోల్డ్ ఇటిఎఫ్‌ల్లోకి అత్యధికంగా రూ.2,080 కోట్లు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 3శాతం పెరిగి రూ.74.14 లక్షల కోట్లకు చేరింది. మే నెలలో ఈ మొత్తం రూ.71.93 లక్షల కోట్లుగా ఉంది. జూన్ నెలకుగానూ సిప్ చేసిన ఖాతాల సంఖ్య మే నెలతో పోలిస్తే 8.56 కోట్ల నుంచి 8.64 కోట్లకు పెరిగాయి.




## రిలయన్స్ జియో ఐపిఒ ఈ యేడాది లేనట్లే!

**ముంబై, జులై 9:** ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐపిఒల్లో రిలయన్స్ జియో ఒకటి. రాబోయే ఐదేళ్లలో రిలయన్స్ నుంచి రిటైల్, జియో కంపెనీలు లిస్టింగ్‌కు రాబోతున్నాయంటూ ముఖేష్ అంబానీ ప్రకటించినప్పటి నుంచి జియో ఐపిఒ పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. కానీ ఎప్పటికప్పుడు ఈ ప్రణాళికలు వాయిదా పడుతూనే ఉన్నాయి. ఈ యేడాది కూడా ఐపిఒకు తీసుకురాకూడదని రిలయన్స్ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అతిపెద్ద టెలికం కంపెనీ అయిన జియో విలువను 100 బిలియన్ డాలర్లుగా అనలిస్టులు పేర్కొంటున్నారు. ఈ మొత్తాన్ని ఐపిఒకు ముందే పెంచాలని జియో భావిస్తోంది. టెలికం విభాగంలో అధిక ఆదాయం సాధించడంతో పాటు సబ్‌స్క్రైబర్ల బేస్ పెంచుకోవడం ఇందులో మొదటిది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు వచ్చే వార్షికాదాయంలో దాదాపు 80శాతం ఆదాయం టెలికం వ్యాపారం నుంచే సమకూరుతోంది. ఈ సంస్థ టెలికం వ్యాపారంతో పాటు వివిధ యాప్స్‌ను, కనెక్టెడ్ డివైజులు, ఎంటర్‌ప్రైజెస్‌కు ఎఐ సొల్యూషన్లను అందిస్తోంది. దీన్ని విస్తరించాలని భావిస్తోంది. తద్వారా రెవెన్యూను పెంచుకోవాలనుకుంటోందని కూడా పేర్కొన్నాయి. జియోను ఐపిఒకు తీసుకురావానుకుంటున్న విషయాన్ని 2019లో ముఖేష్ అంబానీ ప్రకటించారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14